అనుదినం... జనస్వరం

www.navatelangana.com

మంగళవారం 22-10-2024

12 పేజీలు వెల: 6.50

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 10 సంచిక: 243 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar





శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకోం

ముత్యాలమ్మ గుడి ఘటనపై సీఎం హెచ్చరిక

పోలీసులకు భారీగా పరిహారం పెంపు

ట్రాఫిక్ నియంత్రణకు ఏఐని వినియోగిస్తాం :

పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ- ప్రత్యేక ప్రతినిధి/ ధూల్‌పేట


శాంతిభద్రలకు విఘాతం కలిగిస్తూ ఉన్మాదంతో మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిని ఉపేక్షించబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం గోషామహల్ పోలీస్ స్టేడియంలో జరిగిన పోలీసు అమరవీరుల సంస్మరణ ఫ్లాగ్ డే కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పోలీసు అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు సవ్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమనీ, ఇందుకు ఎవరు మోకాలొడ్డినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముత్యాలమ్మ గుడి ఘటనలో దోషులను అరెస్టు చేశామని చెప్పారు. నిందితులను తామే శిక్షిస్తామంటూ శాంతిభద్రతలకు విఘాతం కల్గించేవారిని ఎలా అనుమతి స్తామని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పోలీసులకు భారీగా పరిహారం పెంపు

శాంతిభద్రతల పరిరక్షణలో అనేక మంది పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలు ఎనలేనివని సీఎం కొనియాడారు. ఈనేపథ్యంలో వారికి ఇస్తున్న పరిహారాన్ని కూడా భారీగా పెంచుతున్నామని సీఎం ప్రకటించారు. కానిస్టేబుల్ , ఏఎస్ఐ స్థాయి వరకు రూ. కోటి, ఎస్సై నుంచి సీఐ వరకు రూ. కోటి 25 లక్షలు, డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీ వరకు రూ. కోటి 50లక్షలు, ఎస్పీ ఆపై స్థాయి అధికారులకు రూ. 2 కోట్ల వరకు చెల్లిస్తామని తెలిపారు. శాశ్వత అంగవైకల్యం పొందిన వారిలో కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు రూ.50 లక్షలు, డీఎస్పీ నుంచి అదనపు ఎస్పీ వరకు రూ. 60 లక్షలు, ఎస్పీ ఆపై స్థాయి అధికారులకు రూ. కోటి చెల్లిస్తామన్నారు. ఇంకా తీవ్ర గాయాలపాలైన కానిస్టేబుల్ నుంచి సీఐ వరకు రూ.50 లక్షలు, డీఎస్పీ నుంచి ఎస్పీ వరకు రూ.10 లక్షలు, ఆపై స్థాయి అధికారులకు రూ.12లక్షల వరకు నష్ట పరిహారం పెంచినట్టు సీఎం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పోలీసు సిబ్బందికి భోజనం తగిన వసతి ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. పోలీసు పిల్లల భవిష్యత్తు కోసం యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను 50ఎకరాల్లో నెలకొల్పుతున్నట్టు తెలిపారు. హోంగార్డు నుంచి డీజీపీ స్థాయి అధికారి వరకు వారి పిల్లలకు అత్యుత్తమ విద్యనందించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. విధి నిర్వహణలో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే తానే స్వయంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డ్రగ్స్ నియంత్రణ విషయంలో పోలీసు అధికారులు మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు ఏఐని ఉపయోగించాలి

పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను కూడా అధికారులు విరివిగా ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. రాష్ట్ర డీజీపీ జితేందర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ ఏడాది 214 మంది పోలీసులు అమరులయ్యారని వారి త్యాగాలు ఎనలేనివని కొనియాడారు. వారిలో రాష్ట్రానికి చెందిన గ్రేహౌండ్స్‌కు చెందిన కానిస్టేబుల్ కూడా ఉన్నారన్నారు. విధినిర్వహణలో అమరులైన పోలీసుల పేర్లను సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్ డీసీపీ చదవగా సాయుధ పోలీసులు అమరుల స్థూపానికి వందన సమర్పణ చేశారు. ఈసందర్భంగా పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు, మాజీ డీజీపీలు అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు.



సోషలిస్టు,సెక్యులర్

రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకం

భారత్ లౌకిక దేశంగా ఉండాలనుకోవడంలేదా?

పిటిషనర్‌కు సుప్రీంకోర్టు ప్రశ్న

తదుపరి విచారణ18కి వాయిదా

న్యూఢిల్లీ: సోషలిస్ట్ (సామ్యవాద), సెక్యులర్ (లౌకిక) పదాలు రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకమైనవని ఇప్పటికే ఎన్నో తీర్పులు నొక్కి చెప్పాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. రాజ్యాంగ పీఠిక నుంచి ఈ పదాలను తొలగించాలని కోరుతూ బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి తదితరులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది.

పిటిషనర్, న్యాయవాది విష్ణు శంకర్ జైన్ తన వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగానికి 1976లో చేపట్టిన 42వ సవరణపై పార్లమెంట్‌లో చర్చే జరగలేదన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. ఈ పదాలకు వివిధ వివరణలున్నాయని.. వేర్వేరుగా అన్వయించుకుంటున్నారని పేర్కొన్నారు. అదే సమయంలో కోర్టులు పలుమార్లు ఇవి రాజ్యాంగంలోని ప్రాథమిక భాగాలుగా అభివర్ణించినట్టు వెల్లడించారు.

మరోలా చూడొద్దు

"సోషలిజం అంటే.. అందరికీ సమాన అవకాశాలు ఉండాలని. సమానత్వం అనే అంశాన్ని ఇది ప్రతిబింబిస్తుంది. మీరు దీనిని మరో రకంగా చూడకూడదు. అప్పుడు వేరే అర్థం కూడా వస్తుంది. ఇక సెక్యులర్ అనే పదం కూడా అంతే" అని ఖన్నా ...11లో

బీజేపీవి మహిళా వ్యతిరేక

త్రిశూల్ విధానాలు

వాటితో ముప్పేట దాడి | వ్యతిరేకిస్తూ సమరశీల ఉద్యమాలు కొనసాగించాలి

మనువాదం, పెట్టుబడిదారీ విధానాలను తిప్పికొట్టాలి :

ఐద్వా బహిరంగ సభలో సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యులు బృందాకారత్ పిలుపు

కొత్తగూడెం నుంచి ఎస్.వెంకన్న

ఆరెస్సెస్ నాయకత్వంలో నడుస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా వ్యతిరేక 'త్రిశూల' విధానాలను అవలంబిస్తోందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నేత, రాజ్యసభ మాజీ సభ్యురాలు బృందాకారత్ ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరించటం, మతోన్మాదాన్ని రెచ్చగొట్టడం, మహిళలను తిరోగమన భావజాలం వైపు నడిపించటమనేవే ఆ త్రిశూల విధానాలని ఆమె విశ్లేషించారు. వీటి ద్వారా దేశంలోని మహిళలపై బీజేపీ ముప్పేట దాడిని కొనసాగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చైతన్యవంతమైన, సంఘటిత, సమరశీల పోరాటాల ద్వారా ఆయా విధానాలను తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. మూడు రోజులపాటు కొనసాగే ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభలు సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెం పట్టణంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో బృందాకారత్ ముఖ్య వక్తగా ప్రసంగించారు. దేశంలో ఒక్క శాతంగా ఉన్న కార్పొరేట్ అధిపతులు...40 శాతం ...12లో

మహిళలు ఈ దేశ పౌరులు కాదా?

మోడీ హయాంలో యథేచ్ఛగా హింస

ఇది మహిళా వ్యతిరేక ప్రభుత్వం

ఆహార భద్రతను తుంగలో తొక్కిన కేంద్రం

పౌష్టికాహార లేమితో రోగాల పాలవుతున్న మహిళలు : ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మరియం ధావలే, వీకే శ్రీమతి



వివరాలు 12లో

సాయిబాబా గొప్ప విప్లవకారుడు



నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని ధారబోసారు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ఎర్రజెండాలు కలవాల్సిన రోజులొచ్చాయి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ప్రశ్నించేవారిపై అర్బన్ నక్సల్స్ అని ముద్ర : రచయిత్రి మీనా కందసామి

నడవలేకపోయినా సమాజానికి నడక నేర్పారు : ప్రొఫెసర్ హరగోపాల్

వ్యవస్థలోని అన్యాయాలను ఎదిరించిన వ్యక్తి సాయిబాబా : వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ

వివరాలు 3లో

ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్‌ల సరఫరా ఆపాలి

భారత ప్రతిష్టను పునరుద్ధరించాలి : కేంద్రానికి సీపీఐ(ఎం) డిమాండ్

మన విదేశాంగ విధానాన్ని మార్చాలి : ధర్నాలో ఎస్.వీరయ్య



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ సర్కార్ తన విదేశాంగ విధానాన్ని మార్చుకుని, భారతదేశ ప్రతిష్టను పునరుద్ధరించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఇజ్రాయిల్‌కు అదానీ ఏరో అండ్ డిఫెన్స్ కంపెనీ హెర్మస్ 900 అనే డ్రోన్లను సరఫరా చేయడాన్ని నిరసిస్తూ పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్ అధ్యక్షతన హైదరాబాద్‌లోని పహాడీ షరీఫ్‌లో గల అదానీ మిసైల్స్ భవనం ముందు సోమవారం ధర్నా నిర్వహించారు. "ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్ల ఎగుమతిని నిలపాలి. భారత ప్రభుత్వం కపటత్వం విడనాడాలి" అనే బ్యానర్‌ను ప్రదర్శిస్తూ గంటకుపైగా నిరసన తెలిపారు. ప్రపంచశాంతిని కాపాడాలి, ప్రధాని మోడీ వైఖరిని మార్చుకోవాలి, మోడీ అవలంబిస్తున్న విదేశాంగ విధానం నశించాలి. సామ్రాజ్య వాదం నశించాలి, సోషలిజం వర్ధిల్లాలి, యుద్ధం వద్దు-శాంతి ముద్దు, పాలస్తీనాపై ఇజ్రాయిల్ మారణకాండను నిలిపేయాలంటూ ఈ సందర్భంగా కార్యకర్తలు పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య మాట్లాడుతూ ప్రపంచశాంతికి హానికరంగా తయారైన ఇజ్రాయిల్ పాలకులు పాలస్తీనా ప్రజలను ఊచకోతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం కేవలం ఇజ్రాయిల్-పాలస్తీనాలకే పరిమితం కాకుండా ఇరాన్ తదితర దేశాలను యుద్ధంలోకి లాగుతూ ప్రాంతీయ యుద్ధంగా మారుస్తున్న దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ కొన్ని ఏండ్లుగా పాలస్తీనా భూభాగంలో ఆక్రమణకు తెగపడుతున్నదని విమర్శించారు. భారతదేశం ఎప్పుడూ పాలస్తీనా వైపే నిలబడిందనీ, అయితే మోడీ అధికారంలోకి వచ్చాక తన విదేశాంగ విధానాన్ని మార్చారని తెలిపారు. ఇజ్రాయిల్‌ను సమర్థించే స్థాయికి మన ప్రతిష్టను దిగజార్చారని చెప్పారు. మారణ హోమానికి అండగా నిలబడటం అమానవీయమని తప్పుపట్టారు. మొదట్నుంచి మోడీ సర్కారుకు అదానీ, అంబానీలు కుడి, ఎడమ భుజాలుగా ఉన్నారనీ, వారు వ్యాపారం చేసుకుంటే తమకు అభ్యంతరం లేదని, అదానీ సరఫరా చేస్తున్న డ్రోన్‌లతో ఇజ్రాయిల్, పాలస్తీనా ప్రజలపై దాడికి పాల్పడుతున్నదని, ...11లో

జోక్యం చేసుకోలేం

గ్రూప్-1 పరీక్షల వాయిదా.. రీ షెడ్యూల్‌పై సుప్రీంకోర్టు

మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకూ నిరాకరణ

అభ్యర్థులు కేంద్రానికి చేరుకున్నాక పరీక్ష ఎలా ఆపగలం ?

వాయిదా వేయాలని సర్వీస్ కమిషన్‌కు చెప్పలేం

ఫలితాలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచన 11లో..



గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు షురూ

తొలిరోజు ప్రశాంతం

46 పరీక్షా కేంద్రాల్లో 72.4 శాతం హాజరు 11లో..

కోప్రి అడువుల్లో కాల్పులు

ఐదుగురు మావోయిస్టులు మృతి

కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు



నవతెలంగాణ-చర్ల

ఇటు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటు మహారాష్ట్రను ఆనుకుని ఉన్న భమ్రాగఢ్ తాసిల్‌లోని కోప్రి అడవుల్లో పోలీసులు, మావోయిస్టులకు మధ్య సోమవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఒక జవానుకు తీవ్రగాయాలైనట్టు పోలీసు ఉన్నతాధికారులు ధ్రువీకరించారు. పోలీసు అధికారులు తెలిపిన ...11లో

మూసీపై పూటకోమాట

సీఎం రేవంత్‌పై మాజీ మంత్రి హరీశ్ ఫైర్

కుట్రలను బట్టబయలు చేస్తామని హెచ్చరిక

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మూసీ ప్రక్షాళనకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూటకోమాట మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మూసీ పరివాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ.లక్షన్నర కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు జులై 20న సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. అదే సీఎం సెప్టెంబరు ఆరున విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లో 18 బిలియన్ డాలర్ల (లక్షన్నర కోట్ల)తో మూసీ రివర్ ఫ్రంట్‌ను రీడెవలప్‌మెంట్ ...11లో

ఆర్డర్లు ముందే సిద్ధం చేసుకున్నారా?

టీజీఈఆర్సీకి విద్యుత్‌రంగ నిపుణులు ఎమ్ వేణుగోపాలరావు చురకలు

మొక్కుబడిగా బహిరంగ విచారణలు

జెన్‌కో ట్రూఅప్ ప్రతిపాదనలపై పిటిషనర్ల అభ్యంతరాలు



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్సీ) ముందస్తుగా ఆర్డరు కాపీలు సిద్ధం చేసుకుని, కేవలం మొక్కుబడి కోసం బహిరంగ విచారణలు నిర్వహిస్తున్నదని విద్యుత్‌రంగ నిపుణులు, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎమ్ వేణుగోపాలరావు అన్నారు. ఆర్థిక సంవత్సరం 2022-23కు సంబంధించి టీజీ జెన్‌కో ప్రతిపాదించిన ట్రూఅప్ చార్జీలు, 2024-25 నుంచి 2028-29 ఆర్థిక సంవత్సరాల వరకు ఐదవ నియంత్రణ కాలానికి సంబంధించిన బహుళ వార్షిక టారిఫ్ గైడ్‌లైన్స్ ఫ్రేమ్ చేసేందుకు ఉద్దేశించిన ప్రతిపాదనలపై టీజీఈఆర్సీ నూతన కార్యాలయంలో చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు (టెక్నికల్) ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య (ఫైనాన్స్) బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ...2లో

డిజిటల్ వేదికలకు కళ్లెం!

అసమ్మతి అణచివేతకు ప్రభుత్వ యత్నాలు



న్యాయస్థానాలు అక్షింతలు వేస్తున్నా ఆగని దూకుడు

పార్లమెంట్ శీతాకాల సమావేశాల పైనే అందరి దృష్టి



'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఒకే పాట పాడాల్సిన అవసరం లేదు' ...పంజాబ్‌లో హింస, అలజడిపై ఆనంద్ పట్వర్ధన్ రూపొందించిన 'ఇన్ మెమొరీ ఆఫ్ ఫ్రండ్స్' అనే డాక్యుమెంటరీని ప్రసారం చేసేందుకు దూరదర్శన్ నిరాకరించడంపై స్పందిస్తూ 1996లో బాంబే హైకోర్టు చేసిన వ్యాఖ్య ఇది. అయితే అప్పటి నుండి దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛ విషయంలో ఎంతో మార్పు వచ్చింది. అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజలు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేయగలుగుతున్నారు. లక్షలాది భిన్న గొంతుకలను వినిపించడంలో డిజిటల్ మీడియా ఎంతగానో దోహదపడుతోంది. మన దేశంలో ఆన్‌లైన్ వేదికల ప్రభావాన్ని తోసిపుచ్చడం సాధ్యం కాదు. కానీ ఇది నాణేనికి ఒక వైపు మాత్రమే.

న్యూఢిల్లీ : నాడు పట్వర్ధన్ డాక్యుమెంటరీని అడ్డుకున్న శక్తులే ఇప్పుడు కూడా తమ ఉనికిని చాటుకుంటున్నాయి. అవి ఎక్కడికీ పోలేదు. అదే తీర్పులో జస్టిస్ షా ఏమన్నారంటే 'తన విధానాలను ద్వేషిస్తూ జరిగే బహిరంగ చర్చలు, భావ వ్యక్తీకరణలను ప్రభుత్వం అడ్డుకోజాలదు'. భావ ప్రకటనా స్వేచ్ఛకు భారత రాజ్యాంగం ఏ విధంగా వెన్నుదన్నుగా నిలుస్తోందో ఆ తీర్పు స్పష్టం చేసింది. అయితే దురదృష్టవశాత్తూ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసే ...11లో



లాభసాటి పంటలపై అన్నదాతలు దృష్టి సారించాలి

- పత్తి కొనుగోళ్లలో మోసానికి పాల్పడితే కఠిన చర్యలు
- పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

రైతులు సంప్రదాయ పంటలపై కాకుండా లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంరూరల్ మండలం గుర్రాలపాడులో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాతావరణ సమస్యల కారణంగా పంటల్లో తేమ ఉంటుందని, రైతులు ఓపికగా పంటను ఆరబెట్టి తేమ శాతం 8 నుంచి 12 మధ్యలో ఉండేలా చూసుకోవాలని, అప్పుడే మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ప్రయివేటు వ్యాపారుల వద్ద ఉన్న తూకం నాణ్యతను, తూనికలు కొలతలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అధిక వర్షాల వల్ల దిగుబడులు తగ్గి అన్నదాతలు కష్టాల్లో ఉన్నారని, ప్రభుత్వం సీసీఐని అప్రమత్తం చేస్తూ రాష్ట్రంలో 44 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పండిన పత్తి పంటను పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. సీసీఐ అధికారులు, మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పత్తి పంటకు మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టాలన్నారు. రైతులను మోసం చేసే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వానికి నష్టం వచ్చినప్పటికీ రైతులు పండించిన అన్ని రకాల పంటలను మద్దుతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. పత్తి, మిర్చి పంటలు పండించే రైతులు లాభసాటి పంట పామాయిల్ సాగు దిశగా దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ పంటకు మార్కెటింగ్ సమస్యలు ఉండవన్నారు.

సోయాబీన్, పెసర, కందులు, మొక్కజొన్న పంటల కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మార్కెటింగ్ శాఖ రూపొందించిన కరపత్రాన్ని మంత్రి ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ.. జిల్లాలోని 3 జిన్నింగ్ మిల్లుల వద్ద సీసీఐ ద్వారా మద్దతు ధరపై పత్తి కొనుగోళ్లు చేస్తున్నట్టు వివరించారు. మార్కెట్ యార్డుల్లో ప్రయివేటు వ్యాపారులు పత్తి కొనుగోళ్లలో మద్దతు ధర, కటింగ్ వంటి సమస్యలను సృష్టిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మెన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ చైర్మెన్ బైరు హరినాథబాబు, ఆర్డీఓ గణేశ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి ఎంఏ ఆలీం, మార్కెట్ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుల నియామకం

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆరుగురు సభ్యులను నియమించింది. ఈమేరకు సోమవారం వ్యవసాయ, సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, న్యాయవాది ఎం. సునీల్‌కుమార్ (హైదరాబాద్), రాంరెడ్డి గోపాల్‌రెడ్డి (ఖమ్మం),గడుగు గంగాధర్ (నిజామాబాద్), కేవీ నరసింహ్మారెడ్డి (నాగర్‌కర్నూల్), చెవిటి వెంకన్న యాదవ్ (సూర్యపేట్), మరికంటి భవాని తదిరులను సభ్యులుగా నియమించింది. ఈ కమిషన్ చైర్మెన్‌గా ఎం కోదండరెడ్డి ఉన్నారు.

బాలసదన్‌లో బాలికపై లైంగికదాడి

- ఆలస్యంగా వెలుగులోకి..
- ఘటనను దాచిపెట్టిన అధికారులు.. కేసు నమోదు

నవతెలంగాణ-భువనగిరి

అనాథలకు రక్షణ కల్పించాల్సిన మహిళా శిశు సంక్షేమ శాఖలోనే బాలికలకు రక్షణ లేకుండా పోయింది. ఓ బాలికపై లైంగిక దాడి జరిగిన ఘటన ఆలస్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని బాలసదన్‌లో వెలుగుచూసింది. ఈ నెల 14న ఒక కార్యక్రమం నిర్వహణ పేరుతో డీసీపీఓతోపాటు మరి కొంతమంది రాత్రి 7 గంటల సమయంలో బాలసదన్‌కు వచ్చారు. కార్యక్రమం జరుగుతున్న సమయంలో ఓ బాలిక బాత్రూంకు వెళ్లి వస్తుండగా.. ఓ వ్యక్తి లైంగికదాడి చేశాడు. ఈ ఘటనతో భయాందోళనకు గురైన బాలిక ఏడ్చుకుంటూ తన గదిలోకి వెళ్లిపోయింది. గమనించిన బాలసదన్ సిబ్బంది ఆరా తీయగా ఓ వ్యక్తి తనపై లైంగికదాడి చేశాడంటూ తన శరీరంపై గాయాలను చూపించింది. వెంటనే సిబ్బంది డీసీపీఓకు సమాచారం అందించారు. సంబంధిత వ్యక్తిపై పోలీస్ స్టేషన్లో కేసు పెట్టకపోగా విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని, చెబితే అందరి ఉద్యోగాలు పోతాయని సిబ్బందిని ఆ ముఖ్య అధికారి బెదిరించినట్టు తెలిసింది. బాలికను వలిగొండలోని ఓ ప్రయివేట్ అనాథాశ్రమానికి తరలించినట్టు సమాచారం. నిందితుడు జిల్లా లీగల్ సెర్వీసెస్‌కు చెందిన ఓ అటెండర్‌గా సమాచారం. కాగా ఆదివారం బాధితురాలు ఉన్న వలిగొండ శాంతి నిలయంలో సంబంధిత బాలసదన్ అధికారులు, కౌన్సిలర్ విచారణ జరపగా.. తనపై లైంగికదాడి జరిగిన విషయాన్ని చెప్పినట్టు తెలిసింది.

కేసు నమోదు

ఈనెల 20న బాలసదన్ సిబ్బంది ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే ఆదేశాల మేరకు సీడబ్ల్యూసీ కమిటీ విచారణ చేయనున్నది. ఈ సంఘటనపై అలసత్వం వహించిన అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వనున్నారు.



మక్క రైతుల తిప్పలు..

వీడని అకాల వర్షాలు.. కంటి మీద కునుకు లేదు..

- ఆశించిన ధర పలికినా.. అందని ఫలితం
- మార్క్‌ఫెడ్ పోటీ ధరకు కొనుగోలు చేయాలని డిమాండ్

నవతెలంగాణ-నర్సంపేట

అకాల వర్షాలు మొక్కజొన్న రైతులను కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఆరబోసిన మక్కలను వర్షం భారీ నుంచి కాపాడుకోవడం రైతులకు పెను సవాల్‌గా మారింది. మార్కెట్‌లో అమ్మకం చేసే లోపే వర్షం పడి దిగుబడి తడిసి ముద్దైతోందనే దిగులు రైతులను వెంటాడుతుంది. మార్కెట్‌లో ఆశించిన ధర పలుకుతున్నా.. చేతికి ఫలితం అందకుండా పోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది ఎంతో ఆశతో రైతులు విస్తారంగా మొక్కజొన్న పంట సాగు చేశారు. పండించిన పంట చేతికొచ్చిందనే సంబరంతో మార్కెట్‌కు తీసుకొస్తే నిరాశే ఎదురైతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు మద్దతు ధరకు మించి పలుకుతున్నా మార్క్‌ఫెడ్ మార్కెట్లోకి అడుగుపెట్టలేదు. ప్రస్తుతం మద్దతు క్వింటాపై ధర రూ.2225 నుంచి 2300 ఉండగా వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం వెయ్యి బస్తాలు ఖరీదు చేశారు. గరిష్ఠంగా ధర రూ.2454, కనిష్ఠంగా రూ.2016 పలికింది. 16 శాతం లోపు తేమ ఉన్న మక్కలకు నాలుగు రోజులుగా సాలినా ధర రూ.2350 పలుకుతూ వచ్చింది. మార్కెట్‌లో దాదాపు 3వేల పైచిలుకు బస్తాలు ఆరబోసి కొనుగోలుకు సిద్ధంగా ఉంది. కొనుగోళ్లు పుంజుకుంటే రోజుకు రెండు వేల బస్తాలు వచ్చే అవకాశం ఉంది. కాగా, తరచూ పడుతున్న వర్షం కారణంగా తేమ 18 శాతానికి మించి ఉండటంతో వ్యాపారులు కొనుగోలుకు నిరాకరిస్తున్నారు. రోజూ కురుస్తున్న వర్షం వల్ల మార్కెట్‌లో ఆరబోసిన మక్కలను టార్పలిన్లు వేసినా సీసీ గచ్చు కింది భాగం నుంచి వస్తున్న వరద నుంచి కాపాడుకోవడం కష్టతరంగా మారిందని చిలుకమ్మ నగర్ చెందిన బానోతు బాలు అనే రైతు వాపోయాడు. రెండు ఎకరాల్లో పండిన మొక్కజొన్న చేతికి రాగా మార్కెట్‌కు తీసుకొస్తే కాపాడుకోవడం కోసం నానా తిప్పలు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తేమ ఉందనే సాకుతో సాధారణంగా తడిసిన మక్కలను కూడా కొనుగోలు చేయకుండా నిరాకరించడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. తీసుకొచ్చిన మక్కలను వెంటనే కొనుగోలు చేసినట్లయితే తమకు ఈ తిప్పలు తప్పుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో జగిత్యాలలో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. దాంతో వారు రైతులను దోచుకుంటున్నారు. తరుగుపేరిట క్వింటాల్‌కు సుమారు 4 కిలోల వరకు కోతపెడుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి కొనుగోలు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సింగరేణిలో 2349 మంది బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ

సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాలు జారీ

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి కాలరీస్‌లో పనిచేస్తున్న 2349 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ఏరియాలకు ఉత్తర్వుల పత్రాలను విడుదల చేశారు. కార్మికులు సింగరేణి సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూగర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240 రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేశారు. 1వ తేదీ సెప్టెంబరు 2024 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎలాంటి నిరీక్షణ లేకుండా ఏడాదిలో నిర్దేశిత మస్టర్లు పూర్తి చేసిన వారిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించడంపై కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. కారుణ్య నియామక ప్రక్రియ కింద సింగరేణిలో ఉద్యోగాలు పొందిన వారసులను ముందుగా బదిలీ వర్కర్లుగా గుర్తిస్తూ, సింగరేణి వ్యాప్తంగా ఉన్న భూ గర్భంలో పనిచేయ డానికి యాజమాన్యం పోస్టిం గులు ఇస్తుంటుంది. ఈ విధంగా గనులకు కేటాయిం చబడిన బదిలీ వర్కర్లు ఏడాదిలో కనీసం 190 మస్టర్లు (పని దినాలు) పనిచేసినట్లయితే వారిని జనరల్ మజ్దూర్లుగా యాజమాన్యం గుర్తిస్తుంది. ఉపరితల గనులు, విభాగాల్లో అయితే 240 మస్టర్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. గతంలో ఈ ప్రక్రియకు ఏండ్ల తరబడి సమయం తీసుకుంటూ ఉండేవారు. కాగా సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉద్యోగంలో చేరిన వారు ఏడాదిలో 190 మస్టర్లు పూర్తి చేయగానే ప్రమో షన్ ఇవ్వాలని పర్సనల్ విభాగం అధికా రులను ఆదేశించారు. సింగరేణిలో ఒకేసారి 2349 మందిని జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగ ఉన్నతి కల్పించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అంకిత భావం, క్రమ శిక్షణతో పనిచేయాలని సీఎండీ కార్మికులకు సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాలో అత్యధికంగా 662 మంది జనరల్ మజ్దూర్లుగా ఉద్యోగోన్నతి పత్రాలను పొందారు. రామగుండం-1 ఏరియాలో 552 మంది, భూపాలపల్లిలో 467 మంది బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా రెగ్యుల రైజ్ అయ్యారు. మందమర్రిలో 310 మంది, అడ్రియాలా లాంగ్ వాల్ ప్రాజెక్టు ఏరియాలో 218 మంది, ఆర్జీ-3 ఏరియాలో 50 మంది, కార్పొరేట్‌లో 25, మణుగూరులో 19, ఆర్జీ-3 లో 12, కొత్తగూడెంలో 16, ఇల్లందు, బెల్లంపల్లిలో 9 మంది చొప్పన జనరల్ మజ్దూర్లుగా రెగ్యులరైజ్ అయ్యారు.

ఎవరు అడ్డుపడినా మూసీ ప్రక్షాళన ఆగదు



- రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- రూ.20 లక్షలతో జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఎవరు అడ్డుపడినా మూసీ నది ప్రక్షాళన ఆగదని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు నడుం బిగించగా.. ప్రతిపక్షాలు అనవసరంగా అడ్డుపడుతున్నాయన్నారు. ఏదేమైనా మూసీ నదిని ప్రక్షాళన చేసి తీరుతామని స్పష్టం చేశారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో రూ.కోటితో తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, ఎంపీడీఓ కార్యాలయాల భవనాలను ఒక్కొక్కటి ఎకరం స్థలంలో నిర్మిస్తామని చెప్పారు. అవసరమైతే మరిన్ని ప్రత్యేక ఫండ్స్ మంజూరు చేయించి మూడు కార్యాలయాలను పూర్తి చేస్తామన్నారు. రూ.2 లక్షలలోపు రుణాలు ఉన్న వారికి రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. 2 లక్షల కన్నా పైన ఉన్నవారి రుణాలకు సంబంధించి రెండు లక్షలను డిసెంబర్ 7 లేదా 9న మాఫీ చేస్తామని చెప్పారు. రూ.4కోట్లతో చెరుపల్లి, తిప్పర్తి రోడ్డు మంజూరు చేశామన్నారు. ఇందుగుల, తిరుమర్తి, మామిడాల, నకిరేకల్ రహదారి పనులకు రూ.60 కోట్లు మంజూరు చేశామన్నారు. కురుమర్తి నుంచి సూర్యాపేటకు డబుల్ రోడ్డు వేయనున్నామని, త్వరలోనే ఈ రోడ్డు మంజూరు చేస్తామని తెలిపారు. మాడుగులపల్లికి 75 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఏఎమ్మార్పీ కాలువల ద్వారా ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో తన సొంత నిధులు ఖర్చు చేసి కాలువల్లో పూడిక తీత, చెట్లతొలగింపు చేపట్టామన్నారు. నల్లగొండజిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన ఎస్ఎల్బీసీ సొరంగం పనులను అనుకున్న సమయంలో పూర్తి చేయడమే తన లక్ష్యమని వెల్లడించారు. అనంతరం మంత్రి గ్రామశివారులో ఉన్న నల్లకుంట చెరువు నుంచి కాల్వలకు వెళ్లే నీటి మోటార్లకు స్విచ్చాన్ చేశారు. కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణఅమిత్, నల్గొండ ఇన్‌చార్జి ఆర్డీఓ శ్రీదేవి, డీపీఓ మురళీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, డీఈ గణేష్, పంచాయతీ కార్యదర్శి కాసిం, నల్లగొండ మున్సిపల్ చైర్మెన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక కష్టాలతో అమ్మకానికి పసికందు

- గమనించిన స్థానికులు.. 1098 చైల్డ్ హెల్ప్ లైన్‌కు ఫిర్యాదు
- సిద్దిపేట శిశు గృహకు శిశువు తరలింపు

నవతెలంగాణ-రాయపోల్

నవ మాసాలు మోసి జన్మనించిన ఓ కన్నతల్లి కనీసం కనికరం లేకుండా కసాయి తల్లిగా మారి కన్నపేగు బంధాన్ని మానవత్వం మర్చి విక్రయించాలని చూసింది. ఇలాంటి హృదయ విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ గ్రామ అటవీ ప్రాంతంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... గజ్వేల్ ఆర్ అండ్ ఆర్ కాలనీ పల్లె పహాడ్ గ్రామానికి చెందిన పోతుల రూప రెండవ కూతురు 20 రోజుల శిశువును బేరం పెట్టింది. గజ్వేల్ మార్కెట్ యార్డులో బేరం కుదుర్చుకున్నారు. అనంతరం గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంపై గజ్వేల్-చేగుంట రోడ్డు మార్గంలో ఇందుప్రియాల్ గ్రామం అటవీ ప్రాంతంలోకి వెళ్లి అక్కడ బేరం మాట్లాడుకునేందుకు ప్రయత్నించారు. మొత్తం ముగ్గురు పురుషులు, ఒక మహిళా కొనుగోలుదారులు, మధ్యవర్తుల మధ్య భేరం కుదరకపోవడంతో వారి మధ్య గొడవ జరిగింది. అడవిలో గొర్లకాపరులు ఆ గొడవను గమనించి సంఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీయగా ముగ్గురు పురుషులు, ఒక మహిళ అక్కడ నుంచి పరారయ్యారు. గొర్రె కాపరులు తల్లీబిడ్డను రోడ్డుపైకి తీసుకువస్తుండగా వర్షం కురవడంతో గజ్వేల్ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనాన్ని ఆపారు. వాహనదారులు విషయం తెలుసుకొని 1098 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బాల పరిరక్షణా అధికారులు ఇందుప్రియాల్ అంగన్వాడీ టీచర్ సుల్తానకు సమాచారం ఇచ్చారు. టీచర్ అక్కడికి వెళ్లి తల్లీబిడ్డను అంగన్వాడీ కేంద్రానికి తీసుకువ చ్చింది. బాలల పరిరక్షణ అధికారులు, చైల్డ్ హెల్ప్ లైన్, ఐసీడీఎస్ అధికారులు అంగన్వాడీ కేంద్రానికి వచ్చి తల్లి బిడ్డను సిద్దిపేట శిశు గృహానికి తరలిం చారు. అనంతరం సిద్దిపేట శిశుగృహ సామాజిక కార్యకర్త రాజారాం మాట్లాడుతూ.. శిశువు ఆరోగ్య పరిస్థితి పరీక్షించిన తర్వాత పూర్తిస్థాయి విచారణ చేపట్టి శిశువును తల్లి రూపకు అప్పజెప్పడమా లేదా శిశు గృహలో ఉంచడమా నిర్ణయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ అధికారి కవిత, నర్స్ శ్యామల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గిరిజ, అంగన్వాడీ టీచర్ సుల్తాన, మంజుల, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డర్లు ముందే సిద్ధం చేసుకున్నారా?

(మొదటిపేజీ తరువాయి)

వేణుగోపాలరావు మాట్లాడుతూ ఈనెల 29తో కమిషన్ కాలపరిమితి ముగుస్తున్నదనీ, ఆలోపే అన్నింటిపై ఆర్డర్లు ఇచ్చేయాలనే అత్యుత్సాహం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలకు చెందిన 9 ప్రతిపాదనలపై కేవలం మూడు వారాల్లో అధ్యయనం, బహిరంగ విచారణలు, ఆర్డర్లు తయారు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. "ఈనెల 29తో కమిషన్ కాలపరిమితి ముగుస్తుంది. ఈనెల 21 నుంచి 25 వరకు విద్యుత్ సంస్థలు ఇచ్చిన 9 ప్రతిపాదనలపై బహిరంగవిచారణలు నిర్వహిస్తున్నారు. ముందస్తుగా ఆర్డరు కాపీలు సిద్ధం చేసుకుంటే తప్ప, కేవలం రెండు రోజుల్లో ఆర్డర్లు తయారుచేసి, ముద్రించి ఇవ్వడం సాధ్యం కాదు. ఇది సరైన ప్రాక్టీస్ కాదు. బహిరంగ విచారణల పేరుతో మమ్మల్నందర్నీ ఎందుకు పిలుస్తున్నారు. మేం చేసే సూచనల్లో ఏ ఒక్కటీ ఎందుకు మీ ఆర్డరు కాపీల్లో ఉండట్లేదు" అని కమిషన్‌ను ప్రశ్నించారు.

"విద్యుత్ సంస్థలు ఆలస్యంగా ఇచ్చిన ప్రతిపాదనల్ని ఆమోదించడమే తప్పు. దాన్ని సమర్థించుకోవడానికి పెనాల్టీలు విధించామని చెప్తున్నారు. ఒకేరోజు జెన్‌కో ట్రూ అప్ ప్రతిపాదనలు, ఐదవ నియంత్రిత కాలానికి సంబంధించిన గైడ్‌లైన్స్ ఫ్రేమ్ చేసే అంశంపై బహిరంగ విచారణలు నిర్వహించడం ఏంటని? అని అడిగారు. గడిచిపోయిన కాలానికి సంబంధించి జెన్‌కో ప్రతిపాదించిన రూ.963 కోట్ల ట్రూఅప్ చార్జీలను తిరస్కరించాలని కోరారు. 2022-23కు సంబంధించి ఇంత ఆలస్యంగా క్లెయిమ్ చేయడం సరికాదన్నారు. కేంద్రప్రభుత్వ విధానాల ప్రకారమే టీజీఈఆర్సీ పనిచేస్తున్నదనీ, ఆ విధానాలన్నీ కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నవేనని చెప్పారు. ఈఆర్సీ తనకు ఉన్న చట్ట పరిధిలో సామాన్య విద్యుత్ వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం పనిచేయాలని సూచించారు.

జెన్‌కో ఇష్టం వచ్చినట్టు ఖర్చులు చేసి, వాటిని ఇప్పుడు జనం నుంచి వసూలు చేసుకుంటామని చెప్పడం భావ్యం కాదనీ, వారు కచ్చితంగా ఖర్చుల్ని నియంత్రించుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. గడచిపోయిన కాలానికి విద్యుత్ సంస్థలు క్లెయిములు చేయడం, దాన్ని ఈఆర్సీ పరిశీలన చేయడం అంటే చనిపోయిన శవానికి పోస్టుమార్టం చేసినట్టే ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతకుముందు టీజీజెన్‌కో డైరెక్టర్ సచ్చిదానందమూర్తి జెన్‌కో ట్రూఅప్, 5వ నియంత్రిక కాలానికి సంబంధించిన గైడ్‌లైన్స్‌ను ఆమోదించాలని కోరుతూ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. జెన్‌కో ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ 13 పిటీషన్లు దాఖలయ్యాయి. వాటిలో తెలంగాణ స్పిన్నింగ్ అండ్ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్, ప్లాస్టిక్ మ్యానుఫాక్చరర్స్ అసోసియేషన్, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ సహా పలు సంఘాలు పిటీషన్లు దాఖలు చేశాయి. బహిరంగ విచారణలో ఆయా సంఘాల ప్రతినిధులు తమ అభ్యంతరాలను తెలిపారు. తొలిసారిగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా టీజీఈఆర్సీ పిటీషనర్ల అభ్యంతరాలను స్వీకరించింది.

నిమిషం ఆలస్యం... అనుమతి నిరాకరణ

- గోడ దూకి వెళ్లిన ఓ అభ్యర్థిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నవతెలంగాణ బ్యూరో/విలేకర్లు - హైదరాబాద్

గ్రూప్-1 మెయిన్స్ తొలిరోజు తొలి పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మొత్తం 5613 మంది అభ్యర్థులు గాను 4896 మంది హాజరయ్యారు. 717 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

కాగా పలు చోట్ల పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులను పోలీసులు కేంద్రాల్లోకి అనుమతించలేదు. కోఠిలోని మహిళ విశ్వవిద్యాలయంలోని పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి.. అక్కడి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎగ్జామ్స్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులకు కలెక్టర్ పలు సలహాలు సూచనలు చేశారు. సికింద్రాబాద్‌లోని పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన మాథ్యూస్ అనే అభ్యర్థిని పోలీసులు అనుమతించలేదు. దీంతో అతను గోడ దూకి పరీక్ష కేంద్రం వైపు పరుగులు పెట్టాడు.

ఇది గమనించిన పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకుని బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇక మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్‌లో ఓ అభ్యర్థిని పొరపాటున తన పరీక్షా కేంద్రానికి కాకుండా వేరే పరీక్షా కేంద్రానికి వెళ్లారు. అయితే అక్కడే విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు సిబ్బంది విషయం తెలుసుకుని వెంటనే ఆమెను తన బైక్‌పై ఎక్కించుకుని సకాలంలో సరైన పరీక్షా కేంద్రం వద్ద దింపాడు. అలాగే కీసరలో ఓ అభ్యర్థి పరీక్ష కేంద్రానికి రావడం ఆలస్యం కావడంతో ఇది గమనించిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య అతన్ని పెట్రోలింగ్ వాహనంలో గీతాంజలి ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రానికి తీసుకొచ్చాడు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా.. 17,779 మంది అభ్యర్థులకు గాను 12,000 మంది హాజరయ్యారు. 5,779 మంది అభ్యర్థులు హాజరు కాలేదు. పరీక్షా కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి (రెవెన్యూ), రాధికాగుప్తా (లోకల్ బాడీస్) తనిఖీ చేశారు.

ఎప్‌సెట్ బైపీసీ కౌన్సెలింగ్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు నేడే ఆఖరు

- 25 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి బీ ఫార్మసీ, ఫార్మా-డీ, బయోటెక్నాలజీ, బయోమెడికల్ ఇంజినీరింగ్, ఫార్మాసూటికల్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎప్‌సెట్ బైపీసీ విద్యార్థులకు ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు గడువు మంగళవారంతో ముగియనుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 23 వరకు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదేనెల 25 వరకు వెబ్‌ఆప్షన్ల నమోదుకు అవకాశముంటుందని వివరించారు. ఇప్పటి వరకు 15,510 మంది ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని పేర్కొన్నారు. 202 మంది అభ్యర్థులు 9,376 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఈనెల 28న తొలివిడత కౌన్సెలింగ్‌లో అభ్యర్థులకు సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

సాయిబాబా గొప్ప విప్లవకారుడు

- నమ్మిన సిద్ధాంతానికి జీవితాన్ని ధారబోసారు :సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఎర్రజెండాలు కలవాల్సిన రోజులొచ్చాయి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని
- ప్రశ్నించేవారిపై అర్బన్ నక్సల్స్ అని ముద్ర : రచయిత్రి మీనా కందసామి
- నడవలేకపోయినా సమాజానికి నడక నేర్పారు : ప్రొఫెసర్ హరగోపాల్
- వ్యవస్థలోని అన్యాయాలను ఎదిరించిన వ్యక్తి సాయిబాబా : వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్
- సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రొఫెసర్ సాయిబాబా గొప్ప విప్లవకారుడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆయన చనిపోలేదనీ, రాజ్యహింసలో హత్యకు గురయ్యారని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘాలు, ప్రజాసంఘాలు, బంధుమిత్రుల ఆధ్వర్యంలో సాయిబాబా సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ..ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయన్నారు. రాజకీయాలు పరాకాష్టకు చేరుకుని ఏ వ్యక్తి ఏ పార్టీలో ఉన్నాడో అర్థంకాని ప్రస్తుత పరిస్థితుల్లో నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పనిచేసిన సాయిబాబా అంకితభావాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేననీ, ఎంచుకున్న మార్గాలు ఏవైనప్పటికీ అంతిమ లక్ష్యం ఒక్కటేనని చెప్పారు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు కూడా ఎదురొడ్డి నిలబడి పోరాడే విషయంలో సాయిబాబా కృషి మరువలేనిదన్నారు. పెట్టుబడి, శ్రమ మధ్య జరుగుతున్న పోరాటంలో ప్రస్తుతం పెట్టుబడిదే ఆధిపత్యం కొనసాగుతున్నదనీ, ఆ పెట్టుబడి ఆధిపత్యం వల్లే పాలకుల నుంచి అహంకారపూరిత మాటలు వస్తున్నాయని వివరించారు. అలాంటి కోవలోకే అమిత్‌షా మాటలు వస్తాయన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ ఎల్పీ నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ..నిర్దోషి అయిన సాయిబాబా పదేండ్ల పాటు జైలులో అత్యంత దుర్భర జీవితాన్ని గడపడానికి కారణమైన వాళ్లపై ఎందుకు చర్యలు తీసుకోకూడదని ప్రశ్నించారు. ఎవరిమీద కోపం వస్తే వారిని పదేండ్ల పాటు జైల్లో పెట్టి హింసిస్తారా? ఇది చట్టాల లోపమా? పాలకుల మనస్సులో గూడుకట్టుకున్న విషమే కారణమా? అని నిలదీశారు. ఒక ప్రొఫెసర్‌కు జైలులో కనీస సౌకర్యాలు కల్పించకపోవడమేంటి? తల్లి చనిపోయినా బయటకు పంపకపోవడమేంటి? ఎన్నికల్లో లబ్ది పొందేందుకు డేరాబాబాను పెరోల్‌మీద బయటకు తీసుకురావడమేంటి? బిల్కిస్‌బానో లైంగిక దాడి కేసులో శిక్ష అనుభవించిన వారిని పూలదండలు వేసి ఊరేగించడమేంటి? అసలు మనం ఏ సమాజంలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక కేసులు ఎదుర్కొంటున్న అమిత్‌షా, మోడీ లాంటి క్రిమినల్స్ దేశాన్ని పాలిస్తున్నారు కాబట్టే ఈ దుస్థితి ఉందని చెప్పారు. పౌరహక్కుల కోసం పోరాడితే దేశద్రోహులు ఎలా అవుతారు? ప్రస్తుత పాలకుల దృష్టిలో అబ్రహం లింకన్, నెల్సన్‌మండేలా, గాంధీ కూడా దేశద్రోహులేనా? అని నిలదీశారు. నిజాం, హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతలకు పట్టిన గతే అమిత్‌షాకు పడుతుందని హెచ్చరించారు. దేశంలో ఇలాంటి పరిస్థితులు నెలకొన్న క్రమంలో ఎర్రజెండాలు కలవాల్సిన రోజు వచ్చిందన్నారు. లేకుంటే సాయిబాబా లాంటి వాళ్లను ఎంతో మందిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రశ్న నుంచే ఉద్యమాలు పుట్టుకురావాలని ఆకాంక్షించారు.

ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ..సాయిబాబా 90శాతం వైకల్యంతో తాను నడవలేకున్నా సమాజానికి నడక నేర్పారనీ, ఆయన జీవితం ఒక ప్రయోగమని కొనియాడారు. చట్టబద్ధ పాలన చేస్తున్న దేశాలే అభివృద్ధి చెందుతాయన్న మాట చెప్పిన వ్యక్తికి నోబెల్ బహుమతి వచ్చిందని గుర్తుచేశారు. మన దేశంలో ఇదే మాట అంటే అర్బన్ నక్సల్ అనే ముద్ర వేసి పాలకులు వేధిస్తున్నారని విమర్శించారు. అటవీసంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఛత్తీస్‌గఢ్‌లో మోడీ సర్కార్ చేస్తున్న విధ్వంసాన్ని తప్పుబట్టారు. జైలులో ఉన్న సమయంలో మహారాష్ట్ర హోంమంత్రి, ఎన్సీపీ నేత సాయిబాబా ను కలిసి వ్యక్తిగత సమస్యలేంటి అని అడిగితే..జైలులో ఉన్న దుర్భర పరిస్థితులను, ఖైదీల ఇబ్బందులను విడమర్చి చెప్పిన వ్యక్తి సాయిబాబా అన్నారు. ఆయన్ను జైలు నుంచి బయటకు తీసుకురావడానికి దేశంలోని ఎంతో మంది మేధావులు శక్తికిమించి కృషి చేశారన్నారు. కానీ, పదేండ్ల జైలు జీవితంలో ఆయన దేహం మొత్తం క్షీణించి బయటకు వచ్చిన కొద్ది కాలంలోనే మరణించారని వాపోయారు.

రచయిత్రి మీనా కందసామి మాట్లాడుతూ..ప్రొఫెసర్ సాయిబాబాను కలిస్తే ఎక్కడలేని రాజకీయ చైతన్యం, ఉత్తేజం వచ్చేదని గుర్తుచేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టేందుకు తీసుకొచ్చిన గ్రీన్‌హంట్‌ను ప్రశ్నించినందుకే సాయిబాబాపై రాజ్యం కక్షగట్టి ఉపా చట్టం కింద పదేండ్ల జైలు జీవితం గడిపించిందని తెలిపారు. రాజ్యాన్ని ప్రశ్నించే ప్రతి ఒక్కరిపైనా నేటి పాలకులు అర్బన్ నక్సల్స్ అని ముద్ర వేస్తున్న తీరును ఎండగట్టారు. ఆయన రూపొందించిన సామాజిక ఉద్యమాలను వివరించారు. తన కవిత్వం, రచనలు, ప్రసంగాల ద్వారా ప్రజలను చైతన్యపరడానికి సాయిబాబా చనిపోయేవరకూ తనవంతు ప్రయత్నం చేశారన్నారు. ఈ సభలో సాయిబాబా సతీమణి వసంత, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సరోజ్‌గిరి, వేములపల్లి వెంకట్రామయ్య (సీపీఐఎంఎల్-న్యూడెమోక్రసీ), విమలక్క(టఫ్), సంధ్య (పీఓడబ్ల్యూ), మామిండ్ల రమేశ్‌రాజా(సీపీఐ(ఎంఎల్) లిబరేషన్), జానకిరాములు (ఆర్ఎస్పీ), సదానందమ్(మాస్‌లైన్), ప్రసాద్(సీపీఐ(ఎంఎల్)), గోవర్ధన్(సీపీఐ(ఎంఎల్) -న్యూడెమోక్రసీ), నందిని సిద్దారెడ్డి(ప్రముఖ కవి), జిలకర శ్రీనివాస్(వీసీకే), పాణి(విరసం), తదితరులు మాట్లాడారు. సాయిబాబా మృతికి సంతాపం తెలుపుతూ ప్రపంచ దేశాల నేతల నుంచి వచ్చిన సందేశాలను ఆయన కూతురు మంజీర, దేశంలో ప్రముఖుల సందేశాలను ఆయన తమ్ముడు రాందేవ్ చదివి వినిపించారు. సంస్మరణ సభ అధ్యక్షవర్గంగా ప్రొఫెసర్ జి.లక్ష్మణ్(పౌరహక్కుల సంఘం), ఎం.రాఘవాచారి(నిర్బంధ వ్యతిరేక వేదిక), పద్మకుమారి(బంధుమిత్రుల సంఘం), అరసవెల్లి కృష్ణ(విరసం), కె.రవిచందర్(నిర్బంధ వ్యతిరేక వేదిక), బి.జ్యోతి(చైతన్యమహిళా సంఘం) వ్యవహరించారు.

ఆయనపై రాజ్యం ఉక్కుపాదం మోపింది...



వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సాయిబాబా జీవన నేపథ్యం, తన జీవితంలో రూపొందించిన ఉద్యమాలు, ఆయనపై రాజ్యం మోపిన ఉక్కుపాదం గురించి వివరించారు. ఆదివాసీలపై కేంద్రంలోని పాలకులు చేస్తున్న ఆపరేషన్ గ్రీన్‌హంట్, ఆనకొండ, కాగర్‌లకు వ్యతిరేకంగా ఆయన జీవితాంతం పోరాడారన్నారు. ఏ తప్పూ చేయని సాయిబాబాపై 950 పేజీల జడ్జిమెంట్ ఇవ్వడమేంటని ప్రశ్నించారు. సాయిబాబాకు శిక్ష విధించిన జడ్జి తర్వాతి కాలంలో మహారాష్ట్రంలో 700 మంది ప్రాసిక్యూటర్లకు ఇన్‌చార్జిగా నియమితులయ్యారని తెలిపారు.

తప్పుడు జడ్జిమెంట్‌ను ప్రశ్నించిన వారిపైనా ఉపాకేసులు పెట్టి కేంద్ర ప్రభుత్వం వేధిస్తున్నదన్నారు. ఆయన అసంపూర్తిగా వదిలేసి పోయిన పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలనీ, ఆపరేషన్ కాగర్‌కు వ్యతిరేకంగా పోరాడాలనీ, ఆదివాసీలపై పాలకుల యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రజల్ని చైతన్యపరచాలని పిలుపునిచ్చారు.



మీనాక్షి చౌదరి, దుల్కర్ సల్మాన్

సరికొత్త అనుభూతినిచ్చే సినిమా

దుల్కర్ సల్మాన్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. సోమవారం ఏఎంబీ సినిమాస్‌లో ట్రైలర్ రిలీజ్ వేడుక ఘనంగా జరిగింది.

దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ, "ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. ఇది నాకు చాలా ప్రత్యేకమైన చిత్రం. హాస్యం, భావోద్వేగాలు మాత్రమే కాకుండా కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలు ఉంటాయి' అని చెప్పారు. 'ఇప్పటివరకు నేను చేసిన పాత్రల్లో సుమతి పాత్ర నాకు బాగా ఇష్టమైన పాత్ర. నా మనసుకి బాగా దగ్గరైన చిత్రం' అని కథానాయిక మీనాక్షి చౌదరి అన్నారు. నిర్మాత సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ, సినిమాలో ప్రతి సన్నివేశం కొత్తగా ఉంటుంది. బ్యాంకింగ్ నేపథ్యంలో కుటుంబం భావోద్వేగాలతో నడిచే ఈ చిత్రం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది' అని తెలిపారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పిస్తున్న ఈ చిత్రం తెలుగు, మలయాళం, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈనెల 31న విడుదల కానుంది.

అత్యధిక థియేటర్లలో రిలీజ్

లక్ష్మీ రాయ్ ప్రధాన పాత్రలో గురుప్రసాద్ దర్శకత్వంలో తమిళ, కన్నడ భాషలలో విడుదలై ఘన విజయాన్ని సాధించిన చిత్రం 'ఝాన్సీ ఐపీఎస్'. ఈ చిత్ర తెలుగు హక్కులు ఆర్ కె ఫిలిమ్స్ అధినేత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ సొంతం చేసుకున్నారు. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుక సోమవారం ఘనంగా జరిగింది. హీరో సుమన్ ట్రైలర్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా నిర్మాత డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ, 'లక్ష్మీ రాయ్ త్రిపాత్రాభినయం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. సమాజంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే యోధురాలు. ఫైట్ మాస్టర్ థ్రిల్లర్ మంజు కంపోజ్ చేసిన 8 ఫైట్స్ లక్ష్మీ రాయ్ కెరీర్లో మైలు రాయిగా నిలిచిపోతాయి. సెన్సార్ పూర్తయ్యింది. నవంబర్ రెండో వారంలో అత్యధిక థియేటర్లలో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.

సుమన్, తెలుగు నిర్మాతల మండలి సెక్రెటరీ ప్రసన్న కుమార్, డాన్సర్, నటి ఆక్సాఖాన్, నటుడు జెవిఆర్ తదితరులు ఈ చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.



నవచిత్రం

పొట్టేల్‌లో పవర్‌ఫుల్ రోల్ చేశా..

యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్ఖూరి డైరెక్ట్ చేసిన రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'. నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 25న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ అనన్య నాగళ్ల మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.



అనన్య నాగళ్ళ

డైరెక్టర్ సాహిత్ చెప్పిన కథ బావుంది. ఇందులో చదువు అనే పాయింట్ చాలా నచ్చింది. ఇంత మంచి కాన్సెప్ట్, కథలో ఎలా అయిన పార్ట్ కావాలని చేశాను. సినిమాలో నా పాత్ర చూసి సర్‌ప్రైజ్ అవుతారు. నా క్యారెక్టర్ పేరు బుజ్జమ్మ. ఇప్పటివరకూ మల్లేశం అనన్య, వకీల్ సాబ్ అనన్య అనే పిలుస్తుంటారు. ఈ సినిమా తర్వాత బుజ్జమ్మ అనన్య అని పిలుస్తారు. అంత ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. నాది చాలా స్ట్రాంగ్ రోల్. 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్' సినిమా రిలీజ్‌కి రెడీగా ఉంది. సతీష్ వేగేశ్న 'కథాకళి', అలాగే 'లేచింది మహిళా లోకం' అనే మరో సినిమా చేస్తున్నాను'.

జాలర్ల జీవితానికి ప్రతిబింబం



రమాకాంత్, అవంతిక

కీర్తన ప్రొడక్షన్స్ పతాకంపై రమాకాంత్, అవంతిక, భానుశ్రీ హీరో, హీరోయిన్లుగా నగేష్ నారదాసి దర్శకత్వంలో బధావత్ కిషన్ నిర్మిస్తున్న యాక్షన్ ఎంటర్టైనర్ 'సముద్రుడు'.

ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను మేకర్స్ ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా దర్శకుడు వి. సముద్ర, తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ టి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. నిర్మాత కీర్తన మాట్లాడుతూ, 'మా సినిమా కలెక్షన్లలో 20శాతాన్ని మత్స్యకారులకు అందజేస్తాం' అని అన్నారు. 'ఈ సినిమా జాలర్ల జీవితాలపై ఒక డిఫరెంట్ కాన్సెప్ట్‌తో దర్శకుడు నగేష్ చాలా బాగా తీశాడు' అని హీరో సుమన్ చెప్పారు. హీరోయిన్ అవంతిక మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నేను టీచర్ క్యారెక్టర్‌లో నటించాను' అని అన్నారు. హీరో రమాకాంత్ మాట్లాడుతూ, "ఛత్రపతి' ఎంత పెద్ద విజయం సాధించిందో ఈ సినిమా కూడా అంతే విజయం సాధిస్తుంది అని నమ్ముతున్నాను. ఈనెల 25న ప్రేక్షకులు అందరూ థియేటర్లకి వచ్చి సినిమా చూస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. 'జాలర్లు సముద్రంలోకి చేపల వేటకు వెళ్ళినప్పుడు పడే కష్టాలు, వాళ్లకు వచ్చే సమస్యల్ని ఈ చిత్రంలో చూపించాం' అని దర్శకుడు నగేష్ నారదాసి చెప్పారు.

ఆటలు

పుణెలో స్పిన్ సవాల్

సిద్ధం కానున్న ర్యాంక్ టర్నర్



నవతెలంగాణ-పుణె

ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసు ఆసక్తికరంగా మారింది. బెంగళూర్ టెస్టులో టీమ్ ఇండియా ఊహించని పరాజయం చవిచూసినా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ అగ్రస్థానంలో కొనసాగుతుంది. కానీ ఫైనల్ బెర్త్ రేసులో భారత్‌కు ప్రత్యర్థి జట్ల నుంచి గట్టి పోటీ నెలకొంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా సహా శ్రీలంక టాప్-2లో నిలిచేందుకు తహతహ లాడుతున్నాయి. తాజా డబ్లూటీసీ సైకిల్‌లో భారత్ మరో ఏడు టెస్టులు ఆడాల్సి ఉంది. ఇందులో కనీసం నాలుగు మ్యాచుల్లో విజయాలు సాధించి, మిగతా టెస్టులను డ్రా చేసుకుంటేనే భారత్ నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. లేదంటే, ఇతర జట్ల సిరీస్ ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. ఆస్ట్రేలియా, శ్రీలంక రెండు మ్యాచుల టెస్టు సిరీస్ ఫలితంతో సమీకరణంపై మరింత స్పష్టత రానుంది. నవంబర్ ఆఖర్లో బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్ ఆరంభం నాటికి డబ్ల్యూటీసీ ఫైనల్ రేసులో ఎవరెక్కడ ఉన్నారనే అంశంపై స్పష్టత ఉండనుంది. అయితే, స్వదేశంలో చివరి రెండు టెస్టులో కచ్చితంగా విజయం సాధిస్తేనే భారత్ అవకాశాలు మరింత మెరుగవుతాయి. బెంగళూర్ టెస్టు చేజారటంతో రోహిత్‌సేన ఒత్తిడిలో పడింది. దీంతో న్యూజిలాండ్‌తో చివరి రెండు టెస్టు వేదికలు పుణె, ముంబయి పిచ్ రూపకల్పన విషయంలో ఒత్తిడి ఎదుర్కొంటున్నాయి. ఆతిథ్య జట్టుకు ఉపయుక్తమైన స్పిన్ స్వర్గధామ పిచ్‌ను సిద్ధం చేయాలనే మౌళిక ఆదేశాలు క్యూరేటర్లకు అందినట్లు సమాచారం.

స్పిన్ పిచ్

భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టుకు పుణె వేదికగా నిలువనుంది. ఈ నెల 24 నుంచి కీలక రెండో టెస్టు ఆరంభం కానుంది. పుణెలో ఇది మూడో టెస్టు పోరు కానుండగా.. గత రెండు మ్యాచుల్లో ఆతిథ్య జట్టు మిశ్రమ ఫలితాలు సాధించింది. ఆసీస్ చేతిలో ఓటమి ఎదురవగా, సఫారీపై ఇన్నింగ్స్ విజయం సాధించింది. దక్షిణాఫ్రికాపై విరాట్ కోహ్లి ఇక్కడ ద్వి శతకం సాధించటం భారత్‌కు ఉత్తేజాన్ని అందించే అంశం. పుణెలో సహజంగా ఎర్రమట్టి చేసిన పిచ్ అందుబాటులో ఉంది. సాధారణంగా ఈ వికెట్ స్పిన్‌కు అనుకూలం. రెండో టెస్టులో తొలి గంట మినహా పేసర్లకు పిచ్ నుంచి పెద్దగా సహకారం లభించకపోవచ్చు. తొలి రోజు రెండో సెషన్ నుంచే స్పిన్నర్లు ప్రభావశీలంగా మారనున్నారు. మూడో టెస్టు వేదిక ముంబయిలో ఎర్రమట్టి చేసిన పిచ్‌లు ఉన్నాయి. అయినా, అక్కడా స్పిన్‌ను అనుకూలంగా ఉండేలా క్యూరేటర్ ఏర్పాట్లు చేసే అవకాశం ఉంది. అశ్విన్, జడేజా సహా కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ జట్టులో ఉన్నప్పటికీ సెలక్షన్ కమిటీ ఐదో స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను జట్టులోకి తీసుకుంది. దీంతో భారత స్పిన్నర్ల బలాలకు అనుకూలంగా పిచ్‌పై ఎంపిక చేసిన ప్రదేశాల్లో వాటరింగ్ చేయటం వంటివి చేసేందుకు క్యూరేటర్లు సిద్ధమతున్నారని చెప్పవచ్చు.

రంజీ బరిలో షమి


పూర్తిగా కోలుకున్న పేస్ బౌలర్



న్యూఢిల్లీ : భారత స్టార్ పేస్ బౌలర్ మహ్మద్ షమి పూర్తి స్థాయి ఫిట్‌నెస్ సాధించాడు. 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్ అనంతరం గాయంతో ఆటకు దూరమైన షమి.. ఈ ఏడాది ఫిబ్రవరిలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు. బెంగళూర్‌లోని జాతీయ క్రికెట్ అకాడమీలో రిహాబిలిటేషన్‌లో కొనసాగుతున్న మహ్మద్ షమి ఆదివారం టీమ్ ఇండియా సహాయక సిబ్బంది పర్యవేక్షణలో చిన్నస్వామి స్టేడియంలో బౌలింగ్ సాధన చేశాడు. భారత్, న్యూజిలాండ్ టెస్టు మ్యాచ్ అనంతరం బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ పర్యవేక్షణలో మహ్మద్ షమి నెట్స్‌లో బంతులు వేశాడు. ఫుల్ రనప్‌తో బౌలింగ్ చేసిన షమి మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించినట్టే కనిపించాడు. గాయంతో బాధపడుతున్న శుభ్‌మన్ గిల్ సైతం నెట్స్‌లో బ్యాటింగ్ చేశాడు. బ్యాటింగ్ కోచ్ గిల్ సాధనను పర్యవేక్షించాడు. నవంబర్ ఆఖరులో ఆరంభం కానున్న బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్‌తో రీ ఎంట్రీకి సిద్ధమవుతున్న మహ్మద్ షమి.. అంతకుముందు ఒకట్రెండు రంజీ మ్యాచులు ఆడే అవకాశం ఉంది. ' ఆదివారం నెట్స్‌లో బౌలింగ్ చేశాను. సర్జరీ తర్వాత తొలిసారి పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాను. ఎటువంటి ఇబ్బంది అనిపించలేదు. ఏకధాటిగా 20-30 ఓవర్లు వేసినప్పుడు, వైద్యుల సలహాతో మ్యాచ్‌కు సిద్ధమవుతాను. ప్రస్తుతానికి వంద శాతం ఫిట్‌నెస్ సాధించాను' అని మహ్మద్ షమి సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో తెలిపాడు.

ఓటమి నం.2

హైదరాబాద్‌పై ఉత్తరాఖండ్ గెలుపు



డెహ్రాడూన్ : రంజీ ట్రోఫీలో హైదరాబాద్‌కు వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం ఎదురైంది. గత సీజన్ అజేయ రికార్డుతో ఎలైట్‌లో ఎంట్రీ ఇచ్చిన హైదరాబాద్ తొలి మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో.. తాజాగా ఉత్తరాఖండ్ చేతిలో 78 పరుగుల తేడాతో ఓటమి పాలైంది. 269 పరుగుల ఛేదనలో హైదరాబాద్ 190 పరుగులకే కుప్పకూలింది. రోహిత్ రాయుడు (47, 152 బంతుల్లో 4 ఫోర్లు), తన్మయ్ అగర్వాల్ (38, 55 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), అభిరాత్ రెడ్డి (35, 45 బంతుల్లో 5 ఫోర్లు) మెరిసినా.. ఛేదనలో హైదరాబాద్ చతికిల పడింది. కెప్టెన్ రాహుల్ సింగ్ (0), హిమతేజ (22), రాహుల్ (12), తనయ్ త్యాగరాజన్ (2), సివి మిలింద్ (5), అనికెత్ రెడ్డి (2)లు విఫలమ య్యారు. ఉత్తరాఖండ్ బౌలర్ స్వప్నిల్ సింగ్ (6/59) ఆరు వికెట్లతో హైదరాబాద్ ఖేల్ ఖతం చేశాడు. ఎలైట్ గ్రూప్-బిలో తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 26 నుంచి పుదుచ్చేరితో హైదరాబాద్ తలపడనుంది.

రంజీ వేదికగా మహబూబ్‌నగర్!

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు



మహబూబ్‌నగర్ : మహబూబ్‌నగర్ స్టేడియాన్ని రంజీ వేదికగా తీర్చిదిద్దుతామని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు తెలిపారు. రూ. 80 లక్షల వ్యయంతో గ్రీన్ టర్ఫ్ వికెట్ పనులకు భూమి పూజ చేసిన చేసిన జగన్‌మోహన్ రావు..రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు దేవరాజ్, దల్జీత్‌సింగ్, బసవరాజు, సిజె శ్రీనివాసరావులతో కలిసి డ్రెస్సింగ్, రిఫ్రెషింగ్ రూమ్‌లను ప్రారంభించారు. త్వరలోనే మరో రూ.20 లక్షలతో స్టేడియంలో అధునాతన వసతులు ఏర్పాటు చేయనున్నామని, రానున్న సీజన్లలో ఇక్కడ రంజీ మ్యాచులు నిర్వహించే విధంగా అభివృద్ధి చేసేందుకు హెచ్‌సీఏ ప్రణాళికలు సిద్ధం చేసిందని జగన్‌మోహన్ రావు వెల్లడించారు.

నవతెలంగాణ

ఒక పర్వతాన్ని అధిరోహించిన వాడికే, తాను ఇంకా ఎన్ని పర్వతాలు ఎక్కాలో తెలిసేది - నెల్సన్ మండేలా

మంగళవారం 22 అక్టోబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

ఇక్కడిలా.. అక్కడలా!

రాష్ట్రాన్ని తాజాగా రెండు సమస్యలు ఓ కుదుపు కుదిపేస్తున్నాయి. జీవో 29ఇష్యూతో గ్రూప్-1 పరీక్షలు జరుగుతాయా లేదా? అన్న గందరగోళానికి గురిచేశాయి. వేలాది నిరుద్యోగుల జీవితాలకు ముడిపడి ఉన్న ప్రశ్న ఒకటి అయితే, రెండోది సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్. గోతికాడ నక్కల్లా ఎదురుచూస్తున్న ఈ శక్తులకు ప్రభుత్వ అనాలోచిత చర్యలు, పనులు అయాచిత ఆయుధాలుగా ఉపయోగపడు తున్నాయి. భాధితులు, సమస్యను ఎదురుకునే వాళ్ల ఈ విచక్షణను అర్థం చేసుకొకుండా ముందుకుపోతే యావత్ సమాజానికే నష్టం. నేడు రాష్ట్రంలో బీజేపీ చేస్తున్న పని అచ్చంగా అలాగే ఉంది.

పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నప్పుడల్లా ఏదో ఒక వివాదం వెంటాడుతున్నది. తెలంగాణ ఏర్పడిన తర్వాత చేసిన ప్రయత్నాలు సక్సెస్ కాలేదు. ఎట్టకేలకు గతేడాది నోటిఫికేషన్ వెలువడింది. ఇప్పటికి మూడుసార్లు ప్రిలిమ్స్ జరిగినా మెయిన్స్ సమయానికి ఏదో ఒక వివాదం ముంచుకొచ్చి నిర్వహణ సందిగ్ధంలో పడుతున్నది. తాజాగా జీవో 29 ఇష్యుతో షెడ్యూలు ప్రకారం పరీక్షలు జరుగుతాయో లేవో అనే కన్‌ఫ్యూజన్ అభ్యర్థులను కలవరపెట్టింది. పరీక్షల నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా రాష్ట్రంలో ఆందోళనలు ఆగలేదు. సోమవారం (మరికొన్ని గంటల్లో పరీక్ష అనగా) సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు నిరాకరించింది. దీంతో సోమవారం యధావిధిగా పరీక్షలు జరిగాయి. వేలాది మంది అభ్యర్థులు హాజరయ్యారు. కానీ, ఈ సమస్యపై ఉద్యోగార్థుల పక్షం మేమున్నామంటూ తెగ ఫోజులుకొడుతూ, రిజర్వేషన్ల గురించి సైతం గొంతు చించుకుంటూ ఆందోళనకు దిగితున్నట్టుగా బీజేపీ చేసిన హడావిడి అంతా ఇంతా కాదు.

తెలంగాణలో రిజర్వేషన్ల అమలుకు డిమాండ్ చేస్తున్న కేంద్రమంత్రులు...కేంద్రంలో మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ రిజర్వేషన్ల ఊసేలేకుండా చేస్తున్నారు. ఇది ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనం. ప్రతియేటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ ఊరించి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ ఆచరణలో యువతరాన్ని నిట్ట నిలువునా ముంచేసింది. మోడీ ప్రభుత్వ విధానాల కారణంగా పనిచేసే చేవ ఉన్నా.. ఉపాధి దక్కక యువతరం ఈసురో మంటోంది.. భారత్‌లో ఉపాధి పరిస్థితి భయంకరంగా ఉందని నిరుద్యోగిత రేటు, కీలక లేబర్ సూచీలు స్పష్టం చేస్తున్నాయి. వాటిపై పల్లెత్తుమాట మాట్లాడని సదరు బీజేపీ నేతలు రాష్ట్రంలో మాత్రం నిరుద్యోగం గురించి, రిజర్వేషన్ల అమలు గురించి రచ్చ చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంది.




తాజాగా సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్‌లో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి హిందువులకు చీమునెత్తురు లేదా, గాజులేసుకుని కూర్చొన్నారా' అంటూ విరుచుకుపడ్డారు. ఇక మాధవిలత అయితే మాటకు ముందు, వెనక సనాతనం, హిందుత్వం తప్ప ప్రజలు, ప్రజా సమస్యలు అనే ముచ్చటే వుండదు. ఈ వివాదంపై ఒక కేంద్ర మంత్రి సమగ్ర విచారణ జరగాలని అంటారు. ఇంకో కేంద్ర మంత్రి వెళ్లి నోరు పారేసుకుంటున్నారు. ఆ పార్టీ మరో ఎంపీ ధర్మపురి అరవింద్ సైతం స్పందిస్తూ 'నుపుర్‌శర్మకు మద్దతు తెలిపినందుకు రాజస్థాన్‌లో ఒకర్ని గొంతుకోసి చంపేశారనీ, దాన్ని గుర్తుపెట్టుకోవాలి' అని హెచ్చరికలు జారీ చేశారు. అంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇదే పద్ధతిని అనుసరిస్తారా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పాలి. మత విద్వేషాల మీద వున్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంపై ఉండదు. రోజుకొక వివాదం.. పూటకో రచ్చ చేస్తోన్న నేతల తీరు మారదా? 'మత మీటర్ లేనిదే కిలోమీటర్ నడవలేని నేతలు' తెలంగాణలో పాగా కోసం ఏ చిన్న అవకాశాన్ని వదులుకోవడం లేదు.

ప్రతిపక్ష పార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు చేయని కుట్ర, కుతంత్రం లేదు. ఆ కోణంలోనే రాష్ట్ర ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు, అప్రదిష్ట పాల్జేసేందుకు ఇక్కడి కమలం నేతలు పావులు కదుపుతున్నారనే వాదనలను మనం కొట్టిపడేయలేం. అందులో భాగంగానే ప్రతి సందర్భాన్ని తనకు అవకాశంగా మార్చుకుంటుంది. ప్రభుత్వ తప్పిదాలే వారికి అవకాశం కల్పిస్తున్నాయి. ఈ మతతత్వ శక్తులను రానీయకుండా అడ్డుకట్ట వేయాలంటే ప్రజల సమస్యలను, నిరుద్యోగుల భయాలను నివృత్తి చేసి, రిజర్వేషన్లకు ఇబ్బందిగా ఉన్న 29జీవోను ప్రభుత్వం విరమించుకోవాలి. ఆ సమస్యను పరిష్కరించాలి. మతపరమైన ఘర్షణలు తలెత్తకుండా సామరస్య పూర్వకంగా వ్యవహరించాలి. లౌకికపక్షాలను కలుపుకుని ముందుకు సాగాలి. అప్పుడే గుంటనక్కలకు చెక్ పెట్టగలం!

> తాజాగా సికింద్రాబాద్ ముత్యాలమ్మ టెంపుల్ ఎపిసోడ్‌లో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి 'హిందువులకు చీమునెత్తురు లేదా, గాజులేసుకుని కూర్చొన్నారా' అంటూ విరుచుకుపడ్డారు. ఇక మాధవిలత అయితే మాటకు ముందు, వెనక సనాతనం, హిందుత్వం తప్ప ప్రజలు, ప్రజా సమస్యలు అనే ముచ్చటే వుండదు. ఈ వివాదంపై ఒక కేంద్ర మంత్రి సమగ్ర విచారణ జరగాలని అంటారు. ఇంకో కేంద్ర మంత్రి వెళ్లి నోరు పారేసుకుం టున్నారు. ఆ పార్టీ మరో ఎంపీ ధర్మపురి అరవింద్ సైతం స్పందిస్తూ 'నుపుర్ శర్మకు మద్దతు తెలిపినందుకు రాజస్థాన్‌లో ఒకర్ని గొంతుకోసి చంపేశారనీ, దాన్ని గుర్తుపెట్టుకోవాలి' అని హెచ్చరికలు జారీ చేశారు. అంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇదే పద్ధతిని అనుసరిస్తారా?

నిజాంపై నిప్పులు చెరిగిన 'కొమురంభీమ్'

అతనొక అగ్ని బరాటా. గెరిల్లా పోరాట యోధుడు. ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక. ఆయన పేరు వింటేనే నిజాం సర్కార్‌కు దడ పుట్టేది. స్వపరిపాలన, ఆత్మగౌరవం కోసం పోరాట మార్గాన్నే ఎంచుకున్న ధీరుడు. ఇదే నిజాం నుంచి తన జాతి ప్రజలను విముక్తి చేస్తుందని నమ్మి ఉద్యమించిన నాయకుడు. అతనెవరో కాదు, తెలంగాణ పోరుబిడ్డ, ఆదివాసుల ముద్దుబిడ్డ కొమురంభీమ్. ఆయన పోరాటం, అమరత్వానికి ఎనిమిది దశాబ్దాలు నిండాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా, గోండు తెగకు చెందిన భీమ్ 22 అక్టోబరు 1901న జన్మించారు. నిజాం చెర నుంచి గిరిజన, ఆదివాసుల విముక్తి కోసం హైదరాబాద్ నవాబు అసఫ్‌జహికి వ్యతిరేకంగా పోరాడాడు. అడవిని జీవనోపాధిగా చేసుకుని కొండకోనల్లో, ప్రకృతితో సహ జీవనం సాగించే ఆదివాసీ ప్రజలకు అడవిపై హక్కులుండాలని, స్వయం పాలన కోసం 'జల్-జంగిల్-జమీన్' నినాదంతో ఉద్యమించాడు. పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా గిరిజనులను ఒక్కతాటిపై నడిపించాడు. తాను పదిహేడేండ్ల వయసులో అటవీశాఖ సిబ్బంది జరిపిన దాడిలో తండ్రి మరణించగా కుటుంబ సభ్యులంతా కరిమెర ప్రాంతంలోని సర్దాపూర్‌కు వలసెళ్లారు. అక్కడ వాళ్ల సాగుచేసుకుంటున్న భూమిని జమిందార్ ఆక్రమించుకోవడంతో ఆగ్రహంతో భీమ్ అతన్ని



హతమార్చాడు. ఆ తర్వాత ఆసిఫాబాద్ పరిసర ప్రాంతాలు, జోడేఘాట్ గుట్టల్ని కేంద్రంగా చేసుకుని నిజాం నవాబుపై గెరిల్లా పద్ధతిలో పోరాటం చేశాడు. భీమ్‌కు అండగా, వెన్నంటే కొమురం సూరు, వెడ్మరాము సహచరులుగా ఉన్నారు.

రాష్ట్రంలో గోండు తెగకు సంబంధించిన ప్రధాన్, తోటి, మన్నె, కోయ తెగలే కాకుండా నాయక్‌పోడ్, ఆంధ్ ఇతర ఆదివాసీ తెగలు ఆదిలాబాద్,ములుగు, భద్రాద్రి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో నివసిస్తున్నాయి. వారి జీవనాధారం పోడు వ్యవసాయం. వారంతా ఎప్పటికీ ఒక రాజ్యంలో ఇమిడిలేరు. అయితే వారిని అడవినుంచి తరిమేసే విధానాలు, దూరం చేసే చట్టాలతో నేటికీ తలపడుతూనే ఉన్నారు. అడవిని నరికి పంటవేస్తే అది జంగ్లాత్ భూమి అని ఒకరు, కాదు రెవెన్యూ భూమి అని మరొకరు అంటూ గోండ్లను ఆభూముల నుంచి తరిమేశారు. పంటల్ని ధ్వంసం చేశారు.. జరిమానాలతో వేధించారు. ఈ వేధింపులు, అణచివేతల నేపథ్యం నుంచే కొమురంభీమ్ నాయకత్వంలో గోండ్లు సంఘటితమయ్యారు. నైజాం నుంచి విముక్తి కోసం 'మాఊర్లో..మా రాజ్యం' అంటూ పన్నెండు గూడాల ప్రజలు ఉద్యమించారు. భీమ్ పోరాటం పలు ప్రాంతాలకు విస్తరించేలోపే నిజాం సేనలతో యుద్ధం జరిగింది. పాశవికంగా ఆ పోరాటాన్ని అణిచేసే ప్రయత్నం చేసింది. ఒక నమ్మకద్రోహి ఇచ్చిన సమాచారంతో నిజాం సైనికులు 1940 అక్టోబర్ 27న జోడేఘాట్ అడవుల్లో భీమ్ స్థావరాన్ని ముట్టడించి అతన్ని హతమార్చారు. నిజాం సైన్యంమీద కొమురంభీమ్ కొదమసింహంలా గర్జించేవాడని నేటికీ అతని పోరాట స్ఫూర్తిని తలచుకుంటారు.ఆయన చనిపోయిన రోజునే ఆదివాసులు తమ పవిత్రమైన పండగను జరుపుకుంటారు.

భీం అమరత్వం జోడేఘాట్ లొద్దుల్లో నేటికీ ప్రతిధ్వనిస్తునే ఉన్నది.ఏహక్కుల కోసమైతే..నాడు భీం ఉద్యమించాడో.. ఆ హక్కుల కోసం ఆదివాసులు నేటికీ నిరంతరం పోరాటం చేయాల్సి వస్తున్నది. ప్రజాస్వామిక రాజ్యమని చెప్పుకుంటున్న నేడు కూడా..ఆదివాసుల అవస్థలు ఏమీ తీరలేదు. వారికి తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట కూడా గగనమే అవుతున్నది. అడవిలో దొరికే పండ్లు, ఫలాలే వారికి ఆహారం. వారు నివసించే తండాలకు నేటికీ రోడ్లు లేవు. వాగులోని చెలిమెలో నీళ్ల తెచ్చుకోవాలన్నా కొన్ని కిలోమీటర్లు నడిస్తేగాని దొరకవు. విషజ్వరాలు వస్తే గనుక ఇక అంతేసంగతి. డెంగ్యూ మలేరియా లాంటి జ్వరాలతో ప్రతియేటా ఐదు వందల నుంచి వెయ్యి మంది వరకు చనిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిని ఒక ఓటుబ్యాంకుగా ఉపయోగించుకుంటున్నాయే తప్ప కొమురంభీమ్ ఏ హక్కుల కోసం పోరాడాడో, ఆ హక్కుల్ని కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. భీమ్ అనగానే ఆయన జయంతి, వర్ధంతిల సందర్భంగా ఒక పూలమాల వేసి, గిరిజనులకు అండగా ఉంటామని ఉపన్యాసలిచ్చి వెళ్లిపోతారు. కానీ గిరిజన, ఆదివాసులు హక్కుల కోసం చేసే పోరాటాలు వారికి పట్టవు. నేటికీ ఆదివాసులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తూనే ఉన్నారు. గిరిజన ప్రాంతాలకు ప్రత్యేక రక్షణ ఇచ్చే రాజ్యాంగంలోని అయిదో షెడ్యూలును తుంగలో తొక్కారు. ప్రాజెక్టులు, గనుల తవ్వకాల పేరుతో వారిని అడవికి దూరం చేసే కుట్ర చేస్తున్నారు. ఆదివాసీ భూరక్షణ చట్టం 1/70 చట్టాన్ని అమలు చేయడం లేదు. అన్యక్రాంతం తమవుతున్న అడవులను, భూములను పట్టించుకోవడం లేదు. 'పోరాడితే పోయేది లేదు, బానిస సంకెళ్లు తప్ప' అని కార్ల్‌మార్క్స్ వందల ఏండ్ల కిందటే పిలుపునిచ్చాడు. అందుకే కొమురంభీం స్ఫూర్తితో తమ జీవనాధారమైన అడవి రక్షణకు ఆదివాసులు సంఘటితమవ్వాలి. చట్టాల అమలుకు పాలకులను ప్రశ్నించాలి. ప్రభుత్వాలపై తిరుగుబావుటా జెండా ఎగరేసి హక్కుల్ని సాధించుకోవాలి.అదే భీమ్‌కు ఇచ్చే నిజమైన నివాళి.

(నేడు కొమురంభీమ్ జయంతి)

- కామిడి సతీష్‌రెడ్డి, 9848445134

పేదరికాన్ని అంచనా కట్టడం ఇలాగేనా?



ప్రభాత్ పట్నాయక్

'పేదరికం' అని వాళ్ల పరిగణించేదానిని అంచనా కట్టే పనిలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు మునిగివున్నాయి. కొంత కాలం వరకూ ఈ పని ప్రపంచ బ్యాంక్ చూసేది. ఇప్పుడు ఐరాస అభివృద్ధి ప్రాజెక్టు, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ అనే ఆక్స్‌ఫర్డ్ సంస్థ ఆ పనిలో ఉన్నాయి. ఇవేవీ వాస్తవంగా పేదరికాన్ని అంచనా కట్టే లక్ష్యంతో లేవు. నయా ఉదారవాదాన్ని అందంగా చిత్రించే పనిలో ఉన్నాయి. "కడు పేదరికం" అంటే 2011 నాటి డాలర్ కొనుగోలుశక్తి ప్రాతిపదికన రోజుకు 1.90 డాలర్ల తలసరి వినియోగం కన్నా హీన స్థాయిలో ఉండడం. అంటే తలసరి రోజుకు దాదాపు రూ.53 ఖర్చు చేయగలిగే పరిస్థితి ఉంటే అది 'కడు పేదరికం' స్థాయికి ఎగువన ఉన్నట్టే. ప్రపంచబ్యాంక్ అంచనా ప్రకారం 1990 దశాబ్దం చివరి భాగంలో ఈస్థాయి కన్నా దిగువన సుమారు 30 శాతం ప్రపంచ జనాభా ఉండేవారు. 2022 నాటికి ఆ స్థాయికి దిగువన కేవలం 10 శాతం కన్నా కూడా తక్కువే ఉన్నారని ప్రపంచబ్యాంక్ తెలిపింది. అంటే నయా ఉదారవాద విధానాల అమలు తర్వాత కోట్లాది మంది ప్రపంచ జనాభా కడు పేదరిక స్థాయినుండి బయటపడ్డారు అన్నది ప్రపంచబ్యాంక్ చెప్పదలచుకుంది. ఇది పూర్తిగా లోపభూయిష్టమైన అంచనా. ఎలాగో ఇప్పుడు చూద్దాం.

ప్రపంచబ్యాంక్ అంచనా కట్టే పద్ధతిలో మూడు పొరపాట్లు ఉన్నాయి. మొదటిది: ఒక వ్యక్తి దగ్గర ఉన్న సంపద పెరిగిందా, తరిగిందా అన్నది ప్రపంచబ్యాంక్ లెక్కలోకి తీసుకోకుండా కేవలం ఆ వ్యక్తి ఆదాయం పరిస్థితిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. రెండవది: ఒక వ్యక్తి ఆదాయాన్ని అంచనా కట్టడానికి ఆ వ్యక్తి చేసే వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకుంటుంది. మూడవది: వాస్తవ వ్యయాన్ని అంచనా కట్టడానికి అది ధరల సూచికను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ ధరల సూచిక వాస్తవ జీవన వ్యయాన్ని సక్రమంగా ప్రతిబింబించడం లేదని అందరికీ తెలుసు. ఈ మూడు పొరపాట్ల ఫలితంగా వచ్చే నిర్ధారణలు చాలా పెద్ద పొరపాటు అంచనాలకు దారి తీస్తాయి. ఇప్పుడు ఒక్కొక్క అంశాన్నీ చూద్దాం.

ఒక వ్యక్తి ఆర్థిక స్థాయిలో వచ్చిన మార్పులను పరిశీలించడానికి ఆ వ్యక్తికి వస్తున్న ఆదాయాన్ని, ఆ వ్యక్తి వద్దనున్న సంపదలో పెరుగుదల లేదా తరుగుదలను- ఈ రెండింటినీ లెక్కలోకి తీసుకోవాలి. ఉదాహరణకు: ఒక వ్యక్తికి ఏడాది క్రితం ఎంత ఆదాయం వస్తోందో. ఇప్పుడూ అంతే ఆదాయం వస్తోందనుకోండి. కాని ఇదే ఏడాది కాలంలో ఆవ్యక్తి దగ్గరున్న సంపద కాస్తా హరించుకు పోయిందనుకోండి. అటువంటి వ్యక్తి ఆదాయంలో ఏ మార్పూ లేదు కనుక ఆర్థిక స్థాయిలోనూ ఏ మార్పూ లేదని మనం చెప్పగలమా? ఉన్న సంపద కాస్తా హరించుకు పోయినప్పుడు ఆ వ్యక్తి మరింత పేదరికంలోకి జారిపోయినట్టు కాదా? కాని ప్రపంచబ్యాంక్ పద్ధతిలో ఆ వ్యక్తి సంపద పరిస్థితి ఏమార్పులకు లోనైంది అన్న అంశం పరిశీలనలోనే ఉండదు. నయా ఉదారవాద విధానాలు అంటేనే సంప దను కొల్లగొట్టి పోగేసుకోవడం. అంటే చాలామంది వ్యక్తులను వారి వారి సంపదకు దూరం చేసి దానిని స్వాహా చేయడం. ఇటువంటి విధానాలను ఒకపక్క అమలు చేస్తూ మరొకపక్క కోట్లాది మంది పేదరికం లోంచి బైట పడ్డారని చెప్పుకోవడం అవహేళన చేయడమే.

రెండవది: ఆదాయాన్ని లెక్కించడంలో కూడా వాస్తవ ఆదాయాన్ని లెక్కించకపోవడం. భారతదేశంతో సహా చాలా దేశాల్లో వ్యక్తుల వాస్తవ ఆదాయాలకు సంబంధించిన వివరాలు లేవు. ఆదాయం అంటే ఏ యే అంశాలను పరిశీలించాలి అన్నదే ఒక సంక్లిష్టమైన విషయం. అందుచేత వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం పరిపాటి అయింది. వ్యయానికి సంబంధించి లెక్కలు లభిస్తున్నాయి గనుక దానినే ప్రాతిపదికగా తీసుకుని వ్యక్తుల ఆదా యాలను లెక్కించడం జరుగుతోంది. వ్యయాన్ని బట్టి ఆదాయం లెక్కించాలనుకున్నప్పుడు ఆ వ్యక్తి సంపద లో వచ్చిన మార్పులను పరిశీలించకపోవడం ఏమాత్రమూ క్షంతవ్యం కాదు. ఎందుకంటే ఒక వ్యక్తి ఆదాయం పడిపోయినా, ఆ వ్యక్తి తన వద్దనున్న ఇతర సంపదను అమ్ముకుని ఆ సొమ్ముతో గతంలో మాదిరిగానే తన వ్యయాన్ని కొనసాగించ వచ్చు. వాస్తవానికి ఆ వ్యక్తి పేదరికం పెరిగింది అని నిర్ధారించాలి. కాని వ్యయం స్థాయి యథాతథంగా నిలబడింది గనుక ఆ వ్యక్తి పేదరికం పెరగలేదు అని నిర్ధారించడం అర్థరహితం కాదా?

మూడవది: వ్యయాన్ని లెక్కించినప్పుడు కూడా వాస్తవ వ్యయం ఎంతో నిర్ధారించడానికి ఆ వ్యయాన్ని ధరల సూచీతో పోల్చి సరి చేస్తారు. ఈ ధరల సూచీ వాస్తవ ధరల పెరుగుదలను ప్రతిబింబించదు. ప్రజలకు గల సాధా రణ అవసరాలను బట్టి కొన్ని వస్తువులను మాత్రం లెక్కలోకి తీసుకుని వాటి ధరల్లో వచ్చే మార్పులను మార్కెట్ సర్వే ద్వారా నిర్ధారిస్తారు. దానిని బట్టి ధరల సూచీ లో మార్పులను నిర్ధారిస్తారు. ఐతే, ఎప్పటినుంచి పెరుగుదలను పరిశీలించాలి అన్నదానికి ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు (ఉదా: 1960, 1982, 2011-ఈ సంవత్సరాలను బేస్ సంవత్సరాలుగా తీసుకుని వివిధ ధరల సూచికలు రూపొందుతాయి). అయితే, అప్పటికీ, ఇప్పటికీ అవే సరుకులను అదే ప్రాధాన్యతతో ప్రజలు ఉపయోగించరు. వినియోగంలో వచ్చే మార్పులను ఈ ధరల సూచీ పరిగణనలోకి తీసుకోదు. అదే మాదిరిగా బేస్ సంవత్సరం నాడు లభించిన సరుకులు ఇప్పుడు లభించవు కూడా. ఈ మార్పులను ధరల సూచీ లెక్కలోకి తీసుకోదు.

ఉదాహరణకి: నయా ఉదారవాద విధానాలు వచ్చాక చాలా సేవలు ప్రయివేటుపరమయ్యాయి. ముఖ్యంగా విద్య వైద్యం. ఇవి అంతకు మునుపు ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందేవి. ఇప్పుడు వాటి ఖరీదు విపరీతంగా పెరిగి పోయింది. వాటిని వినియోగించడం ప్రజలకు అనివార్యం. కాని ధరల సూచీ ఈ రెండింటినీ ఇప్పటికీ ఉచితంగానే అభిస్తున్నవిగా పరిగణిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక ఆపరేషన్‌కు బేస్ సంవత్సరంలో రూ. వెయ్యి వసూలు చేసినది. ఇప్పుడు రూ.రెండు వేలు వసూలు చేస్తే, ఈ తేడాను మాత్రమే ధరల సూచీ లెక్కలోకి తీసు కుంటుంది. ప్రభుత్వ వైద్యవ్యవస్థ విస్తరించనందువలన ప్రయివేటు వైద్యానికి అనివార్యంగా ప్రజలు పోవలసి వస్తోంది. అక్కడ ఇదే ఆపరేషన్‌కు రూ.పది వేలు వసూలు చేస్తారు. కాని ధరల సూచీలో ప్రభుత్వ ఆస్పత్రులలో పెరిగిన ఫీజులను మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. వాస్తవ జీవన వ్యయం ధరల సూచీలో చూపుతున్న దానికన్నా ఎన్నో ఎక్కువ రెట్లు పెరిగింది. కాని దానిని లెక్కించనందు వలన అధికారిక ధరల సూచీని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డట్టు చిత్రిస్తారు.



నిజానికి జీవన వ్యయం పెరిగిన ప్రతీ సందర్భంలోనూ ప్రజలు సర్దుబాటుకు రెండు విధాలుగా ప్రయత్ని స్తారు. మొదటిది: ఉన్న ఆస్తులను, సంపదను అమ్ముకోవడం. లేదా అప్పులు చేయడం. రెండవది: వినిమయాన్ని తగ్గించుకోవడం. అలా వినిమయాన్ని తగ్గించుకోవలసి వచ్చినప్పుడు అత్యంత అవసరమైన వాటికి మాత్రమే ఖర్చు చేస్తారు. వైద్యం అటువంటి అత్యవసరమైన ఖర్చు. ప్రయివేటీకరణ కారణంగా దాని ఖర్చు బాగా పెరిగింది. ఐనా ఖర్చు చేయక తప్పదు. అందుకోసం ప్రజలు తమ తిండి ఖర్చులను సైతం తగ్గించుకోవలసి వస్తోంది. పిల్లల చదువు నిమిత్తం చేసే ఖర్చుకు కూడా అటువంటి ప్రాధాన్యతే ఉంటుంది. ఈ రెండు సేవలనూ ప్రయివేటు రంగం నుండి పొందాల్సి వస్తున్నందున భారతదేశంలో అత్యధిక కుటుంబాలలో తమకున్న బంగారాన్ని, ఇల్లును, లేదా పొలాన్ని అమ్ముకునో, తాకట్టు పెట్టో సర్దుబాటు చేసుకోడం సర్వసాధారణం అయిపోయింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో మరీ ఎక్కువగా జరుగుతోంది. దాని ఫలితంగా ఆ కుటుంబాల ఆహార వినియోగంలో తీవ్ర మార్పులు వచ్చాయి. తిండి ఖర్చులు తగ్గించుకోవడం వలన ఆర్థిక స్థితిగతుల్లో పెద్ద మార్పులు రావన్న సంగతిని వారు గమనించడం లేదు. ప్రజల ఆస్తులు, అప్పులను సర్వే చేసే అఖిల భారత వ్యవస్థ ఎఐఆర్‌డిఐఎస్ 2013కు, 2019కి మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతంలో అప్పుల పాలైన కుటుంబాల సంఖ్య పదకొండు శాతం పెరిగినట్టు తేల్చింది. దానితోబాటు సగ టు కుటుంబ రుణం 43 శాతం పెరిగినట్టు కూడా తేల్చింది. అంతేగాక సగటు ఆస్తుల విలువ 39 శాతం తగ్గినట్టు నిర్ధారించింది. ఇదంతా కేవలం 7 సంవత్సరాల మధ్య కాలంలో మాత్రమే సుమా. ఇక పట్టణాలలో పరిస్థితి కూడా ఏమంత మెరుగ్గా లేదు. స్వయం ఉపాధి ద్వారా జీవించే కుటుంబాల రుణం 24 శాతం పెరిగింది. సగటు ఆస్తుల విలువ 29 శాతం తగ్గింది. అంటే దేశంలో ప్రజల సంపద నయా ఉదారవాద కాలంలో క్షీణించింది అన్నది స్పష్టం.

ఇక రెండో విధంగా సర్దుబాటు చేసుకునేవారి విషయం చూద్దాం. తమ వినిమయాన్ని తగ్గించుకోవడం ద్వారా జీవన వ్యయ భారాన్ని తగ్గించుకోవాలనుకునేవారి విషయంలో కనీస పోషకాహారం 2200 క్యాలరీలు కూడా పొందలేకపోతున్నవారి శాతం 1993-94లో 58 ఉంటే 2011-12 నాటికి అది 68 శాతానికి పెరిగింది. ఇది గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి. ఇక పట్టణాలకు వస్తే కనీసం 2100 క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని పొందలేనివారి శాతం 57 నుండి 65కి పెరిగింది. 2017-18 లో మళ్ళీ సర్వే జరిపితే వచ్చిన గణాంకాలు మరీ ఘోరంగా ఉన్నాయి. దాంతో ఆ గణాంకాల వివరాలను బహిరంగ పరచడా నికి మోడీ ప్రభుత్వం సాహసించలేదు. ఆ సర్వేలో గ్రామీణ ప్రాంతంలో కనీసపు స్థాయిలో పౌష్టికాహారం పొందలేక పోతున్న వారి శాతం 80ని దాటింది. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ప్రపంచ బ్యాంక్ నివేదికలు మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఉంటున్నాయి.

రోజుకు తలసరి ఖర్చు రూ.53 కన్నా తక్కువ చేస్తున్నవారి శాతం 2011-12లో 12 ఉంటే 2022-23లో అది రెండు శాతానికి తగ్గిందని ఆ నివేదికలు అంటున్నాయి! ఆయా దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న లోప భూయిష్ట మైన ప్రమాణాలనే ప్రాతిపదికగా తీసుకుని ప్రపంచబ్యాంక్ ఈ నిదార్ధరణలకు వచ్చింది. తద్వారా పలు మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పేదరికం తగ్గిపోయిందంటూ చేసుకుంటున్న ప్రచారానికే వంత పాడుతోంది. కోట్లాది మంది ప్రజలు పేదరికం లోంచి విముక్తి చెందారంటూ సాగుతున్న ఈ ప్రచారం కేవలం క్రూరమైన అవహేళన మాత్రమే. ఐరాస నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను ఎంత వరకూ ఆ యా దేశాలు చేరుకోగలిగాయన్న విషయం రాబోయే రోజుల్లో ముందుకు రానుంది. అందుచేత ఇటువంటి తప్పుడు ప్రచార హోరు మరి కాస్త పెరుగుతుంది.

(స్వేచ్ఛానుసరణ)

> రోజుకు తలసరి ఖర్చు రూ.53 కన్నా తక్కువ చేస్తున్నవారి శాతం 2011-12లో 12 ఉంటే 2022-23లో అది రెండు శాతానికి తగ్గిందని ఆ నివేదికలు అంటున్నాయి! ఆయా దేశాల ప్రభుత్వాలు అనుసరిస్తున్న లోప భూయిష్ట మైన ప్రమాణాలనే ప్రాతిపదికగా తీసుకుని ప్రపంచబ్యాంక్ ఈ నిదార్ధరణలకు వచ్చింది. తద్వారా పలు మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పేదరికం తగ్గిపోయిందంటూ చేసుకుంటున్న ప్రచారానికే వంత పాడుతోంది. కోట్లాది మంది ప్రజలు పేదరికం లోంచి విముక్తి చెందారంటూ సాగుతున్న ఈ ప్రచారం కేవలం క్రూరమైన అవహేళన మాత్రమే. ఐరాస నిర్దేశించిన అభివృద్ధి లక్ష్యాలను ఎంత వరకూ ఆ యా దేశాలు చేరుకోగలిగాయన్న విషయం రాబోయే రోజుల్లో ముందుకు రానుంది. అందుచేత ఇటువంటి తప్పుడు ప్రచార హోరు మరి కాస్త పెరుగుతుంది.

తప్పెవరిది? శిక్షెవరికి?



వి.యస్. రావు
9490098890

భవిష్యనిధి, గ్రాట్యుటీ లాగా పెన్షన్ కూడా మూడో బెనిఫిట్‌గా ఇవ్వాలని భారత కార్మికులు కోరుతూ వస్తున్నారు. అది పక్కన పెట్టి కంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం ఈపీఎస్‌ను 1995లో ముందుకు తెచ్చారు పాలకులు.చట్టంలో పేరా 11(3) చేర్చి హయ్యర్ పెన్షన్ ఆప్షన్‌ను ముందుకు తెచ్చి సీలింగ్ జీతంపైన కాకుండా పూర్తి జీతంపైన పెన్షన్ ఫండ్‌కు నిధులు చెల్లిస్తే, చివరి 12 నెలల సగటు జీతం ఆధారంగా పెన్షన్ చెల్లిస్తామని 1996లో సవరణ చేశారు.మూడో బెనిఫిట్‌గా పెన్షన్ ఇవ్వరని అర్థం చేసుకొని, పూర్తి జీతంపై పెన్షన్ నిధికి 8.33శాతం నిధులను జమ చేసైనా, ఉద్యోగ విరమణ అనంతరం కొంత సామాజిక భద్రత వస్తుందని భావించిన కార్మికులు/ఉద్యోగులు చట్టంలోని 11(3) ప్రకారం హయ్యర్ పెన్షన్ ఆప్షన్ ఇచ్చారు. దేశం మొత్తంపైన లక్షల మంది ఇచ్చినట్లే ఉమ్మడి ఏపీఎస్‌ఆర్టీసిలో కూడా సుమారు 20వేల మంది హయ్యర్ పెన్షన్ ఇచ్చారు.1996 నుండి 2014 వరకు (వారు స్కీంలో చేరిన రోజు నుండి) వారి జీతాల నుండి సీలింగ్ జీతంపైన కాకుండా పూర్తి జీతంపైన పెన్షన్ నిధి కోసం ఆర్టీసి పి.ఎఫ్ ట్రస్ట్ రికవరీ చేసి, ఆ రికవరీలను ఈపిఎఫ్ఓ పెన్షన్ నిధికి రెగ్యులర్‌గా జమ చేశారు.

అకస్మాత్తుగా ఆర్టీసి పిఎఫ్ ట్రస్ట్ నుండి ఒక లేఖను (లేఖ నెం: Dy. SUP (P) EPS/H/PEN (Raj) 480(2)(20)/14-15, తేది. 15అక్టోబర్ 2014ను) విడుదల చేస్తూ, ఇప్పటి వరకు హయ్యర్ పెన్షన్ కోసం చెల్లింపులు చేస్తూ వస్తున్న 16,307 మంది హయ్యర్ పెన్షన్‌ను ఈపిఎఫ్ఓ వారు తిరస్కరించాలరని, అందుకని 16,307 మంది వద్ద నుండి పెన్షన్ ఫండ్ కోసం రికవరీ చేసిన డబ్బులలో నుండి సాధారణ పెన్షన్ కోసం చెల్లించాల్సినవి పోను మిగతా డబ్బులకు వారి, వారి వ్యక్తిగత ఖాతాలలో వడ్డీతో సహా చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని, 20సెప్టెంబర్2014 నాటి పి.ఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ మీటింగ్ మినిట్స్‌లో నిర్ణయించారు (మినిట్స్ లేఖ నెం. AM(F)/471 (2)/2014-15 - PFT, తేది.20 సెప్టెంబర్ 2014). 1996-2014 మధ్య పదేండ్ల కాలం హయ్యర్ పెన్షన్ కోసం ఈపిఎఫ్ఓ అనుమతి లేకుండానే, ఆర్టీసి పిఎఫ్ ట్రస్ట్ రికవరీ చేసిందా? నిధులు తన దగ్గర జమ చేసుకొన్న ఈపిఎఫ్ఓ వారు పదేండ్ల తర్వాత ఏ ప్రాతిపదికన రిజెక్టు చేసినట్లు? అందుకు కారణమేమిటి? అనేది నేటికి చిదంబర రహస్యమే.

ఉమ్మడి ఆర్టీసిలో 16,307 మంది (నేడు ఏపీఎస్‌ఆర్టీసి - 8934; టీజీఎస్‌ఆర్టీసి-7373 మంది)కి పూర్తి సమాచారం కూడా ఇవ్వక పోవడం దారుణం. 1996లో ఈపిఎస్ చట్టంలో తీసుకొచ్చిన సవరణ ద్వారా అవకాశం కల్పిస్తేనే కదా ఇంతమంది హయ్యర్ పెన్షన్ కోసం అప్లై చేసుకొన్నది. చట్టానికి విరుద్ధంగా ఎందుకు తిరస్కరించారు? అలా తిరస్కరిస్తే పి.ఎఫ్ ట్రస్ట్ ఏం చేసింది? ఆర్టీసి పిఎఫ్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌గా వున్న గుర్తింపు కార్మిక సంఘం ఎందుకు ఆందోళనలకు పిలుపివ్వలేదు? వారందరికి న్యాయం జరిగేలా ఎందుకు ప్రయత్నం చేయలేదు? ఈ ప్రశ్నలకు ఎక్కడా జవాబులు లేవు. 20 సెప్టెంబర్ 2014 నాడు జరిగిన ఏపీఎస్‌ఆర్టీసి బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ మీటింగ్‌లో పాల్గొన్నది ఆనాడు గుర్తింపులో ఉన్న ఎంప్లాయీస్ యూనియన్. 16,307 మంది నుండి చేసిన రికవరీలలో నుండి సాధారణ పెన్షన్ కోసం చెల్లింపులు పోను మిగతా డబ్బులు నెల రోజులలోపు వడ్డీతో సహా తిరిగి కార్మికుల అకౌంట్లలోకి జమ చేపిస్తామని రాసుకున్న మినిట్స్ అమలు కోసం 2014-2024 మధ్య ఆ సంఘం చేసిన కృషి ఏమిటి? 2016 లో జరిగిన ఎన్నికలలో గెలిచిన టిఎంయు నాయకులు ఆ తర్వాత బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్‌గా వున్నారు. మరి 2016 నుండి 2019 వరకు 16,307 మందికి ఈపిఎఫ్ఓ నుండి రావలసిన డబ్బులను తిరిగి ఇప్పించేందుకు చేసిన కృషి ఏమిటి? బాధ్యత కలిగిన కార్మిక సంఘాలు ఈ సమాచారం 16,307 మందికి తెలియజేసేందుకు చేసిన ప్రయత్నం ఏమిటి? ఇవన్నీ కార్మికుల మెదళ్ళను తొలుస్తున్న ప్రశ్నలు.



మరి యాజమాన్యం చేసిన ప్రయత్నం ఏమిటి? సింపుల్‌గా మీ హయ్యర్ పెన్షన్ తిరస్కరించారని ఒక లేఖ పంపి చేతులు దులుపుకున్నది. వారి వద్ద నుండి అదనంగా రికవరీ చేసిన మొత్తాలు తిరిగి కార్మికులకు చెల్లించేలా కృషి చేయాల్సిన బాధ్యత పి.ఎఫ్ ట్రస్ట్‌దేగా. మరి 2014 నుండి 2024 వరకు తెలంగాణ ఆర్టీసిలో వున్న 7373మంది కోసం ఈపీఎఫ్ఓ/ఆర్‌పీఎఫ్‌సికి రాసిన లేఖలు ఎన్ని? ఒక్కో కార్మికునికి తిరిగి రావలసిన అసలెంత? ఆయా సంవత్సరాలలో వున్న వడ్డీ రేట్లను అమలు చేస్తే వచ్చే మొత్తాలు ఎంత? ఆర్టీసీ పి.ఎఫ్ ట్రస్ట్ నేటి వరకైనా ఈ లెక్కలు చేసిందా? చేయకపోతే ఎందుకు చేయలేదు? ఆ సమాచారం కేవలం ఆర్టీసి ట్రస్ట్ వద్ద మాత్రమే వుంటుంది. ఎందుకంటే ఆర్టీసి 'మినహాయించబడ్డ ట్రస్ట్'గా నడుస్తున్నది. పదేండ్ల కాలంలో ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నించే సమయం లేదా?

కార్మికుల సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకత్వం 2021 సం॥ నుండి ఈ సమస్యను వెలుగులోకి తెచ్చి, పరిష్కారానికి ప్రయత్నిస్తున్నది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో హయ్యర్ పెన్షన్ సమస్య మరోసారి చర్చకు వస్తున్నది. అందులో వస్తున్న సమస్యలతో పాటు ఈ సమస్యపై పోరాడుతున్నది. అయినా ఇక్కడ కూడా 16,307 మందికి అన్యాయం జరుగుతున్నది. హయ్యర్ పెన్షన్ కోసం డిమాండు నోటీసులు జారీ చేసేటప్పుడు, అప్పటివరకు పెన్షన్‌ఫండ్‌కు జమచేసిన నిధిని మినహాయించి, మిగిలిన డబ్బులకు మాత్రమే డిమాండ్ నోటీసులు పంపాలని ఈపీఎఫ్ఓ నుండి వున్న ఉత్తర్వులను కూడా పరిగణనలోకి తీసుకోకుండా, వీరికి కూడా పూర్తి కాలానికి (1996-2023) మధ్య కాలానికి సంబంధించి చెల్లించాల్సిన మొత్తాలపై డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఫలితంగా ఒకే కాలానికి వారు రెండుసార్లు అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. ఇది అత్యంత దుర్మార్గమైనది. ఆర్‌పిఎఫ్‌సికి ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులతో 7అక్టోబర్ 2024న జరిగిన మీటింగ్‌లో దీనినే ప్రధాన సమస్యగా చర్చించడం జరిగింది.వీరికి రావలసిన డబ్బులు తిరిగి చెల్లించాలంటే, అందుకు సంబంధించిన వివరాలతో కూడిన లేఖలను ఆర్టీసి పి.ఎఫ్ ట్రస్ట్ నుండి ఆర్‌పిఎఫ్‌సికి పంపించాలి. ఇప్పటివరకు ఆ పని జరగలేదు. అందుకని 18అక్టోబర్ 2024న ఆర్టీసి చీఫ్ పర్సనల్ మేనేజర్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్‌గా వినతిపత్రం ఇచ్చింది. ఇప్పటికైనా స్పందిస్తారని ఆశిస్తున్నాము.రికవరీలను జమ చేసుకొని, పదేండ్ల తర్వాత తిరస్కరించింది ఈపీఎఫ్ఓ. నెల రోజులలోపు ఆ డబ్బులు తిరిగి ఇప్పిస్తామని అంగీకరించింది ఆర్టీసి పిఎఫ్ ట్రస్ట్. కానీ ఏ తప్పు చేయకుండానే ప్రభుత్వాన్ని నమ్మి రూ.220 కోట్ల మేర నష్టపోతున్నది మాత్రం కార్మికులే. తప్పు ప్రభుత్వం, యాజమాన్యది అయితే, శిక్ష మాత్రం కార్మికులకా? ఆలోచించాలి.

అలాగే,అనేక ఆందోళనల తర్వాత పొందిన హయ్యర్ పెన్షన్ హక్కును కేంద్రం తూట్లుపొడుస్తూ, దామాషా పద్ధతి పేరుతో అర్హత కలిగిన పెన్షన్‌లో నలభైశాతం కోత పెడుతున్నది. ఇప్పటికే హయ్యర్ పెన్షన్ పొందుతున్న వేలాది మంది ప్రయోజనానికి కూడా త్వరలో ప్రమాదం వస్తుంది. అందుకని మొత్తం పెన్షన్, పీఎఫ్ సమస్యలపై ఆందోళనలు ఉధృతం చేయాల్సిన అవసరముంది. దానికి కార్మికులంతా సిద్ధమవ్వాలి.

> హయ్యర్ పెన్షన్ కోసం డిమాండు నోటీసులు జారీ చేసేటప్పుడు, అప్పటివరకు పెన్షన్‌ఫండ్‌కు జమచేసిన నిధిని మినహాయించి, మిగిలిన డబ్బులకు మాత్రమే డిమాండ్ నోటీసులు పంపాలని ఈపీఎఫ్ఓ నుండి వున్న ఉత్తర్వులను కూడా పరిగణనలోకి తీసుకోకుండా, వీరికి కూడా పూర్తి కాలానికి (1996-2023) మధ్య కాలానికి సంబంధించి చెల్లించాల్సిన మొత్తాలపై డిమాండ్ నోటీసులు జారీ చేశారు. ఫలితంగా ఒకే కాలానికి వారు రెండుసార్లు అసలుతోపాటు వడ్డీ కూడా చెల్లించాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. ఇది అత్యంత దుర్మార్గమైనది.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

- అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులకు నివాళి

నవతెలంగాణ-ఖమ్మం



విధినిర్వహణలో అసువులుబాసిన పోలీసులకు జిల్లా పోలీస్ యంత్రాంగం నివాళులర్పించారు. సోమవారం ఖమ్మంలోని పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సిటీ ఆర్మ్‌డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ పేరడ్ మైదానంలోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. పోలీస్ అమర వీరుల స్థూపం వద్ద జిల్లా అధికార యంత్రాంగం, పోలీస్ అధికారులు, సిబ్బంది, అమర వీరుల కుటుంబీకులు పూలమాలలు ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు. దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధినిర్వహణలో అసువులు బాసిన 214 మంది అమర వీరుల పేర్లను అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్ కుమార్ చదివి వినిపించారు. పోలీసు అమర వీరులకు నివాళులర్పించేందుకు వచ్చిన వారి కుటుంబీకులు, బంధువులు స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించే సమయంలో తమ వారిని స్మరించుకుని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలీసు అమరులను స్మరించుకుంటూ వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో జిల్లాలో అధికార యంత్రాంగం ప్రశాంతంగా విధులు నిర్వహిస్తున్నరంటే అనాటి పోలీసు త్యాగాల ఫలితంగానే అన్నారు. ప్రధానంగా ప్రభుత్వాలు తీసుకొచ్చే చట్టాలను నిష్పాక్షపతంగా అమలు చేయడంలో పోలీసులు కీలకమైన పాత్ర పోషిస్తారని, ప్రజాస్వామ్య దేశానికి ఇది చాలా కీలకమని అన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి అమరులైన పోలీసుల జీవితాలను యువ పోలీసులు ఆదర్శంగా తీసుకొని సమాజ సేవలో ముందుండాలన్నారు.

పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ సమాజం కోసం, భవిష్యత్తు తరాల కోసం, ప్రజా రక్షణ కోసం పోలీసులు అహర్నిశలు తమ ప్రాణాలను లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్నారన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని, శాంతి భద్రతల కట్టడిలో పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పనిచేస్తుందన్నారు. నిత్యం పోలీసులు చేస్తున్న పోరాటాలు, వీరోచిత సాహస చర్యలను మనం చూస్తున్నామని, వీరందరూ తమ కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి దేశంలోని కోట్లాది మంది ప్రజల కోసం ఉద్యోగ నిర్వహణలో జీవితాలు అంకిత చేశారని అన్నారు.

ఆనంతరం పోలీస్ అమరవీరుల కుటుంబీకులతో కలెక్టర్, పోలీస్ కమిషనర్ మాట్లాడారు. ఏదైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకొని రావాలని సూచించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా ఈనెల 25 , 27న సైకిల్ ర్యాలీ, 26వ తేదీన రక్తదానం శిబిరం, 27వ తేదీన పోలీస్ సిబ్బందికి వ్యాసరచన పోటీలు, 28వ తేదీన విద్యార్థులకు ఆన్‌లైన్ వ్యాసరచన పోటీలు, అవగాహన కార్యక్రమాలు, 29వ తేదీన ఆన్‌లైన్ ఓపెన్‌హౌస్, నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) నరేష్ కుమార్, అడిషనల్ డీసీపీ (లా అండ్ ఆర్డర్) ప్రసాద్‌రావు, ఏఆర్ అడిషనల్ డీసీపీ విజయబాబు, ఏసీపీలు వేంకటేశ్, రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రహెమాన్, రఘు, సాంబరాజు, రవి, మల్లయ్య, నర్సయ్య, ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, అప్పలనాయుడు, సిఐలు ఉదయ్ కుమార్, బాలకృష్ణ, రమేష్, భానుప్రకాశ్, సాగర్, రాజు, తిరుపతి, కిరణ్ కుమార్, మురళి, రాజిరెడ్డి, రామకృష్ణ, సతీష్, మోహన్ బాబు, హనుక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు కట్టుబానిసలుగా... ప్రభుత్వాల విధానాలు

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం

నవతెలంగాణ-సత్తుపల్లి



కార్మికులను కట్టుబానిసలుగా చేసేలా ప్రభుత్వాల విధానపర నిర్ణయాలు ఉండటమే గాక కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేలా గోచరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు ఆరోపించారు. సోమవారం సత్తుపల్లిలోని రావి వీరవెంకయ్య భవన్‌లో జరిగిన సీఐటీయూ ముఖ్య నాయకుల సమావేశంలో కళ్యాణం ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. లేబర్ కోడ్‌లు, నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఎత్తివేతకు జరుగుతున్న కుట్ర తగదన్నారు. కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయడానికి క్రెచ్ సెంటర్లను తీసుకొచ్చి స్వచ్ఛంద సంస్థలను బలోపేతం చేసే కుట్రకు కేంద్రప్రభుత్వం తెరలేపిందన్నారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వాలు గంగిరెద్దుల్లా తలలూపి సహకరిస్తోందని విమర్శించారు. ఐసీడీఎస్‌ను రక్షించుకోవడానికి అంగన్వాడీలతో పాటు లబ్ధిదారులు కూడా భవిష్యత్తులో జరిగే పోరాటాలకు సిద్ధం కావాలని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆశాలకు కనీస వేతనం అమలు చేయకుండా వారితో అన్ని రకాల సేవలు చేయించుకుంటూ శ్రమదోపిడీ చేస్తున్నారని కళ్యాణం మండిపడ్డారు. ఈ సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విఠల్‌రావు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లూరు చంద్రశేఖర్, జిల్లా కమిటీ సభ్యులు కొలికపోగు సర్వేశ్వరరావు, వివిధ రంగాల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పనులు చేయకుండానే బిల్లులు

- ప్రజాధనాన్ని లూటీ చేయటాన్ని అరికట్టాలి
- సీపీఐ(ఎం), బీఆర్ఎస్ నాయకుల ధర్నా

నవతెలంగాణ-వైరా



వైరా మున్సిపాలిటీ పరిధిలో పనులు చేయకుండా బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని లూటీ చేయటానికి ప్రయత్నాలు చేయడంపై సీపీఐ(ఎం), బీఆర్ఎస్ నాయకులు సోమవారం మున్సిపాలిటీ కమిషనర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అధికార పార్టీ నేతలు అధికారులను బెదిరించి అక్రమ పద్ధతుల్లో బిల్లులు పెట్టి ప్రజా ధనాన్ని లూటీ చేయుటకు ప్రయత్నాలు చేయడం సరికాదని అన్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలపై ఇంటి పన్నులు భారం వేసి, మున్సిపాలిటీ అభివృద్ధి నిధుల నుంచి పనులు చేయకుండా, ప్రజలు స్వచ్ఛందంగా శ్రమదానం ద్వారా చేసుకున్న పనులు కూడా బిల్లులు పెట్టించి మున్సిపాలిటీ నిధులు డ్రా చేయాలని కమిషనర్ కార్యాలయంలో జరుగుతున్న ఒత్తిళ్ళను అరికట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ పరిధిలో అనేక రహదారులు, డ్రైనేజీ నిర్మాణం మధ్యలో ఆగిపోయినా వాటిని పూర్తి చేయకుండా బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని కొల్లగొట్టే విధానాన్ని ఎలా అనుమతిస్తారని కమిషనర్ వేణును ప్రశ్నించారు. ఒక ప్రజా ప్రతినిధి తన కారు ఖర్చులకు 19లక్షలా 80వేల రూపాయలకు బిల్లులు పెట్టినట్లు ఆరోపణలు తీవ్ర విమర్శలకు తెర లేపినవి. మునిసిపాలిటీలో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే తాపత్రయం ప్రదర్శిస్తున్నారని, ఈ విధానాన్ని అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా మునిసిపాలిటీలో ప్రజల సొమ్ము కైంకర్యం కాకుండా చూడాలని, లేకుంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి చేస్తున్న అరాచకంగా భావించాల్సి వస్తుందని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బొంతు రాంబాబు హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మద్దెల రవి, పార్టీ పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, మల్లెంపాటి రామారావు, ఇమ్మడి సుధీర్, దొంతిబోయిన గోపి, గుమ్మా నరసింహరావు, కొంగర సుధాకర్, పైడిపల్లి సాంబశివరావు, కామినేని రవి, యనమద్ది రామకృష్ణ, వడ్లమూడి మధు, పల్లెబోయిన వెంకటేశ్వరరావు, వెల్పుల రాములు తదితరులు పాల్గొన్నారు.



పడకంటి సత్యవతికి నివాళి

నవతెలంగాణ-మధిర

సీపీఐ(ఎం) నాయకులు పడకంటి మురళి తల్లి సత్యవతి దశదినకర్మ అడవి రామన్నపాలెంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్, చింతలచెరువు కోటేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకులు శీలం నర్సింహారావు, మండల కార్యదర్శి మందా సైదులు తదితరులు హాజరై సత్యవతి చిత్రపటానికి నివాళ్లర్పించారు.

అనుమతులు లేకుండా నిర్మించిన భవన యజమానులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-వైరా

వైరా మునిసిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా నిర్మించిన భవనాలు, వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ 10వ వార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని కమిషనర్ వేణుకు వినతి పత్రం అందజేశారు. వైరాలో ప్రభుత్వ స్థలాల్లో, వైరా చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్‌లో, ఎన్ఎస్‌పి కాలువలను ఆక్రమించి నిర్మించిన గృహ యజమానులపై చర్యలు తీసుకోవాలని తన అనుచరులతో కలిసి డిమాండ్ చేశారు.

విద్యాభివృద్ధి ద్వారానే...! ఉన్నత శిఖరాలు...!!

- ఎస్‌బీఎస్ కళాశాలకు రూ. లక్ష అందిస్తాను
- కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ దయానంద్
- విద్యార్థులకు యూనిఫాం దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-సత్తుపల్లి



విద్యలో రాణించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ఆశా స్వచ్ఛంద సేవ వ్యవస్థాపకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ అన్నారు. స్థానిక ఎస్‌బీఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన విద్యార్థులకు యూనిఫాం దుస్తుల పంపిణీ కార్యక్రమంలో డాక్టర్ దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను కళాశాల యాజమాన్యం డాక్టర్ దయానంద్ చేతుల మీదుగా పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దయానంద్ మాట్లాడారు. మంచిగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం శిథిలావస్థకు చేరుకొని ఉన్న కళాశాల భవనాలను పరిశీలించారు. నూతన భవన నిర్మాణాలు చేపట్టేలా కృషి చేస్తానన్నారు. కళాశాల అభివృద్ధి కోసం తనవంతుగా రూ. లక్ష అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వర్లు, అధ్యాపకులు రామకృష్ణ, అయూబ్‌ఖాన్, నరసింహారావు, రవికుమార్, శ్రీనివాస్, మధుకర్, సతీశ్, వసంత, లావణ్య అనసూయ, భూలక్ష్మి, బాలికల కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, ప్రమీల, ఏఎంసీ ఛైర్మెన్ దోమ ఆనంద్ కుమార్, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నకేశవరావు, కమల్‌పాషా పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు హార్వెస్ట్ విద్యార్థులు

నవతెలంగాణ-ఖమ్మం



ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన అండర్ 14 అండ్ 17 చెస్, బాస్కెట్ బాల్ పోటీలలో హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపల్ ఆర్.పార్వతీరెడ్డి తెలిపారు. చెస్ టోర్నమెంట్ అండర్ 14 బాలికల విభాగంలో ఎ. హిమ శ్రీనిక ఉమ్మడి ఖమ్మం జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించి, అండర్ 17 చెస్ బాలుర విభాగంలో వి.సత్యప్రణవ్ మొదటి స్థానం, బి.రుత్విక్ ద్వితీయ స్థానం, బి.శశాంక్ సిద్దు తృతీయ స్థానం సాధించి త్వరలో మేడ్చల్లో జరగబోయే రాష్ట్రస్థాయిలో జరిగే చెస్ టోర్నమెంట్స ఖమ్మం జిల్లా నుండి ఎంపిక కావడం జరిగిందన్నారు.తమ పాఠశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతీరోజు ప్రత్యేక శిక్షణాతరగతులు నిర్వహించి ఎక్కడ పోటీలు నిర్వహించిన విజేతలుగా తిరిగిరావడం ఆనవాయితీగా కొనసాగుతుందని అన్నారు. వీరికి శిక్షణ ఇచ్చిన చెస్ కోచ్, వ్యాయామ ఉపాధ్యాయులకు, అలాగే వారికి ప్రోత్సాహాన్ని అందించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

ఖమ్మం రైల్వేస్టేషన్ అభివృద్ధికి సహకారమందిస్తా

- ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం



జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తానని, కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. సోమవారం ఆయన రైల్వే స్టేషన్ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఎస్కలేటర్, ఎలివేటర్, ప్రయాణికుల విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. రెండు ప్లాట్ ఫాంలపై కలియతిరిగి వసతులు పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సౌకర్యాలు, లోటుపాట్లపై ఆరా తీశారు. పనులు నాణ్యతగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కొత్తగా క్యాంటీన్ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రయాణికుల, అధికారుల వాహనాల పార్కింగ్ సమస్య తెలుసుకున్న ఎంపీ స్పందిస్తూ..స్టేషన్ సమీపంలో ఉన్న స్థలాన్ని కేటాయించేలా కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్తానని అభయమిచ్చారు. అలాగే ప్రయాణికుల ప్రయివేట్ పార్కింగ్ కేంద్రాన్ని సందర్శించి..టోకెన్ ధరలు తెలుసుకున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం అధిక రుసుమును తగ్గించేలా రైల్వే జీఎంతో మాట్లాడుతానని తెలిపారు.

స్టూడెంట్స్..ఫెసిలిటీస్ కైసే హై

రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్ ఫాంపై..పదుల సంఖ్యలో లగేజీల్తో ఎదురుచూస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లి ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి పలకరించారు. తాము పశ్చిమబెంగాల్ రాష్ట్రం నుంచి వచ్చినట్లు వారంతా తెలిపారు. కైసే హెా..అచ్చే హెా.యహాపర్ సహులతే కైసే హై(ఇక్కడ సౌకర్యాలు బావున్నాయా) అంటూ..ఆరా తీశారు.

మానవత్వం చాటిన ఎంపీ..

ఖమ్మం రైల్వే స్టేషన్ రెండో ప్లాట్ ఫాం పై ఎంపీ రఘురాంరెడ్డి పరిశీలించి వస్తుండగా అప్పటికే ప్రమాదవశాత్తు పట్టాలాపై పడిపోయిన మహిళా ప్రయాణికురాలిని ప్లాట్ ఫాం పైకి చేర్చగా..ఎంపీ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. జనగాం జిల్లా నవాబ్ పేటకు చెందిన నాగమణి అనే ఈమెకు ప్రాథమిక చికిత్స చేయించి ఆస్పత్రికి తరలించాలని అధికారులకు సూచించారు. అలాగే జిల్లా ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ తో ఫోన్లో మాట్లాడి.. మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మైనార్టీ నాయకులు ఎమ్‌డి ముస్తఫా, నాయకులు మిక్కిలినేని నరేందర్, అనంతరెడ్డి, ఉమ్మినేని కృష్ణ, పాపా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సర్వజ్ఞ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం



కొత్తగూడెంలో జరిగిన ఎస్జిఎఫ్ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) వారు నిర్వహించిన అండర్-17 ఫుట్‌బాల్, అండర్- 17 అండ్ 14 విభాగం టేబుల్ టెన్నిస్ పోటీల్లో సర్వజ్ఞ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి.నాగేంద్రకుమార్ అన్నారు. అండర్-17 ఫుట్‌బాల్, అండర్-17 అండ్ 14 టేబుల్ టెన్నిస్ సర్వజ్ఞ విద్యార్థులు విజయం సాధించి రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అదే విధంగా బి.మహిధర్ అండర్ 14 ఫుట్‌బాల్ తరఫున నవంబర్ 2వ వారంలో జమ్మూకాశ్మీర్‌లో జరగబోయే క్రీడలలో పాల్గొనడానికి ఎంపికయ్యాడని తెలిపారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. చదువుతో పాటు విద్యార్థులకు ఆటలలో శిక్షణ ఇస్తూ వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలుగు తీస్తూ వాళ్ల మనోధైర్యముతో పాటు ఏకాగ్రతకు, క్రమశిక్షణకు ఆటలు ఎంతో ముఖ్యమని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన విద్యార్థులందరినీ అభినందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు సర్వజ్ఞ ఎప్పుడూ తోడుగా ఉంటుందని, అలానే వారు మున్ముందు మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఇంటిని కూల్చివేయడం అమానుషం: సీపీఐ(ఎం)

నవతెలంగాణ- ఖమ్మం కార్పొరేషన్



కొంతమంది ఇచ్చిన తప్పుడు సమాచారంతో ఖమ్మం నగరంలో గత 40 సంవత్సరాల నుండి పిల్లి చిన్న కృష్ణ తోటలో నివాస ఉంటున్న మల్లంపూడి నాగేశ్వరరావు ఇంటిని అత్యంత దారుణంగా సోమవారం కూల్చివేశారు. దీంతో ఇంట్లో ఉన్న ఇద్దరు మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. వారిని 108లో హాస్పటల్‌కి తరలించారు. వెంపటి సత్యనారాయణ ఇచ్చిన తప్పుడు సమాచారంతో అతిగా స్పందించిన అధికారులు కూల్చివేత చర్యలకు పాల్పడ్డారని మల్లంపూడి సతీష్ ఆరోపించారు. బాధిత కుటుంబానికి అఖిలపక్ష పార్టీల నాయకులు అండగా నిలిచారు. నాయకులు యర్రా శ్రీకాంత్, యర్రా శ్రీనివాసరావు, తాలూరి హనుమంతరావు, రుద్రగాని ఉపేందర్, తోట ఉపేందర్, నూనె శశిధరు, భూక్య శ్రీనివాసరావు, కొప్పెర ఉపేందర్‌లు బాధితుల ఇంటి వద్దకు వెళ్లి వారికి మద్దతు తెలిపారు. వెంపటి సత్యనారాయణ భూమి విషయంపై సమగ్ర సర్వే చేయాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులుగా నాసరయ్య

నవతెలంగాణ- ఖమ్మం

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా పసుపులేటి నాసరయ్యను రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చిమ శ్రీనివాస్, రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కె.వి.కృష్ణారావు నియమించారు.

ప్రారంభమైన ఫార్మా కౌన్సిలింగ్

నవతెలంగాణ- ఖమ్మం

ఫార్మా డి, బి.ఫార్మసీ కోర్సులలో చేరే విద్యార్థులకు సోమవారం ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైందని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా తెలిపారు. మొదటిరోజు 448మంది విద్యార్థులు వివిధ టైం స్లాట్లలో నమోదు చేసుకోగా, 415 మంది కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని, .ఈ ప్రక్రియ మరో రెండు రోజులు జరుగుతుందని తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం



ప్రజావాణి దరఖాస్తులను అధికారులు సకాలంలో పరిష్కారించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులకు ప్రాధాన్యత నిచ్చి ప్రజలు ఇచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కల్లూరు మండలం పేరువంచ గ్రామానికి చెందిన కె. దుర్గ తన భర్త మరణించారని, తనకు వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మండల ఎంపిడిఓకు ఎండార్స్ చేస్తూ, విచారణ చేసి అర్హత మేరకు పెన్షన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలో రామన్నపేట కాలనీ వాసులు 60వ డివిజన్‌లో వరదల కారణంగా ఇండ్లు పూర్తిగా మునిగి పోయాయని, సర్వే పూర్తయినప్పటికీ తమకు ప్రభుత్వ సహాయం అందలేదని దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్‌కు ఎండార్స్ చేస్తూ, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖమ్మం నగర పాలక సంస్థ 37వ డివిజన్ కు చెందిన తలారి సుగుణమ్మ తన భర్త చనిపోయారని తనకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతినెల 35 కిలోల బియ్యం వచ్చే విధంగా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిని, పరిశీలించి తగు చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ అరుణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు మెరుగైన జీవనం పొందేందుకు తోడ్పాటు

ఖమ్మం నగరంలోని ఆటో డ్రైవర్లు మెరుగైన జీవనం పొందేందుకు ప్రభుత్వం తరఫున అవసరమైన తోడ్పాటు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని తన చాంబర్‌లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆటో యూనియన్ నాయకులతో, ఆటో డ్రైవర్ల ఆరోగ్యం, ఇన్సూరెన్స్, అడ్డాల వద్ద సౌకర్యాలు, ఇతర సమస్యలు, అంశాలపై అడిగి తెలుసుకున్నారు. ఈనెల 15న బస్టాండ్ కూడలి ప్రాంతంలో ఆటో డ్రైవర్లను జిల్లా కలెక్టర్ కలిసి వివరాలు తెలుసుకొని ఆటో యూనియన్ నాయకులను పిలిచి చర్చిస్తానని తెలిపిన విషయం విధితమే. దీని ప్రకారం సోమవారం కలెక్టరేట్ లో సమావేశమైన ఆటో యూనియన్ నాయకులు జిల్లా కలెక్టర్ కు తమ సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆటో అడ్డాల వద్ద అవకాశం ఉన్న చోట కార్పోరేషన్ ద్వారా టాయిలెట్ల నిర్మాణం చేస్తామని, వాటి నిర్వహణ బాధ్యతలు యూనియన్లు స్వీకరించాలని తెలిపారు. ఖమ్మం నగరంలో ఆటో డ్రైవర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని కలెక్టర్ అన్నారు. ఖమ్మం నగరంలో ఆటో డ్రైవర్లు అందరికీ 5 లక్షల రూపాయల భీమా సౌకర్యం కల్పించడం జరుగుతుందని, డ్రైవర్ మరణించినా, ప్రమాదం బారిన పడిన, వైకల్యం వచ్చిన ఈ భీమా ఉపయోగపడుతుందని, దీని కోసం డ్రైవర్లు ప్రతి సంవత్సరం 500 రూపాయల వరకు చెల్లించాలని, దీనితో ప్రతి ఆటో డ్రైవర్ కు బీమా సౌకర్యం ఉండే విధంగా చర్యలు చేపడతామని అన్నారు. బీమా చేయడంతో పాటు ప్రతి సంవత్సరం వాయిదా సకాలంలో చెల్లించడం కీలకమని, డ్రైవర్లు 500 రూపాయల బీమా తప్పనిసరిగా చెల్లించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, దీనిపై డ్రైవర్లతో చర్చించి ఆటో డ్రైవర్ సంఘాలు తమ అభిప్రాయాలను తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, జిల్లా రవాణాశాఖ అధికారి వెంకటరమణ, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు ఎన్. నరేష్ మోహన్, సిఐటియు ప్రతినిధి జిల్లా ఉపేందర్, ఐఎఫ్‌టియు ప్రతినిధి శ్రీను, ఏఐటీయూసీ ప్రతినిధి మోహన్‌రావు, పాల్వంచ కృష్ణ, ఆంజనేయులు, లక్ష్మీనారాయణ, యాకూబ్ పాల్గొన్నారు.

భావి తరాలకు మెరుగైన విద్య అందించేందుకు పటిష్ట చర్యలు

ఖమ్మం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే భావితరాల పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్‌లోని తన చాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠలతో కలిసి బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతుల కల్పనపై దృష్టి సారించి విద్యార్థులకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించి విద్యార్థుల నమోదు పెంచేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ఫౌండర్ కృష్ణ పాడిశెట్టి మాట్లాడుతూ రాష్ట్ర డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహణకు ప్రణాళికలు రూపొందించామని అన్నారు. బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సంస్థ ద్వారా ఎందరో బాల, బాలికలకు కంప్యూటర్ శిక్షణ అందించామని, పాఠ్యాంశాలు ప్రణాళికల ద్వారా కంప్యూటర్స్ శిక్షణ మాత్రమే కాకుండా సమాజ శ్రేయస్సు, ఆరోగ్య అవగాహన, పర్యావరణ పరిరక్షణ, యోగ వంటి వ్యక్తిత్వ వికాసంతమైన విషయాలను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నేర్పిస్తున్నామని, ఇప్పటికే 15 పాఠశాలల్లోని 5 వేల మందికి పైగా విద్యార్థుల జీవితాలను వికసింపచేయడం జరిగిందని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్ లను దత్తత తీసుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 800 పైగా విద్యార్థులకు సహాయపడే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ సభ్యులు మాధవి పాడిశెట్టి, మరియెన్ పాలి, వంశీ కంచం, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దిశ సమావేశానికి అధికారులు నివేదికలతో సిద్ధం కావాలి

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశానికి అధికారులు కచ్చితమైన నివేదికలతో మంగళవారం హాజరుకావాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో దిశ కమిటీ సమావేశం సన్నద్ధంపై కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌తో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు తమ శాఖ కార్యకలాపాలపై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. గత 5 సంవత్సరాల్లో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులు, ఖర్చు పెట్టిన నిధులు, చెల్లింపులకు సంబంధించి నమోదు చేసిన మొత్తం, మిగులు నిధుల వివరాలు చూపాలన్నారు. సంక్షేమం, మౌళిక సదుపాయాల కల్పన, వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, విద్య వైద్యం తదితర అంశాల వారిగా, కేంద్ర ప్రభుత్వ పథకాల వారిగా నివేదికలు పొందుపర్చాలన్నారు.

సమర్థవంతంగా విధుల నిర్వహణకు క్షేత్ర స్థాయి అనుభవం

క్షేత స్థాయిలో ప్రజల సమస్యలు తెలుసుకున్నప్పుడే ప్రభుత్వ అధికారి, తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించగలరని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. ఆల్ ఇండియా సర్వీసెస్, సెంట్రల్ సివిల్ సర్వీసెస్-2024 అధికారులకు, తెలంగాణ డా. మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల శిక్షణ సంస్థచే ప్రత్యేక ఫౌండేషన్ కోర్స్‌లో భాగంగా జిల్లాలో క్షేత్ర పరిశీలనకు వచ్చిన సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌తో కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో సమావేశమయ్యారు.

పిడుగుపాటుకు రైతు మృతి

నవతెలంగాణ-బోనకల్

మండల పరిధిలోని తూటకుంట్ల గ్రామానికి చెందిన ఓ రైతు పిడుగుపాటుకు ఆదివారం రాత్రి మృతి చెందాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తూటికుంట్ల గ్రామానికి చెందిన సంగెపు నారాయణ అనే రైతు ఆదివారం తన పత్తి పొలంలో అరకతోలుతున్నాడు. ఆదివారం పెద్ద ఎత్తున ఉరుములు, మెరుపులతో మండలంలో వర్షం కురిసింది. ఈ సమయంలోనే అరక తోలుతున్న నారాయణపై పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అయితే అరక ఆవులు ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వచ్చాయి. కానీ నారాయణ మాత్రం రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు నడుచుకుంటూ వస్తున్నాడని భావించారు. కానీ ఆదివారం రాత్రి 9 గంటలు అయిన నారాయణ ఇంటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబ సభ్యులు, బంధువులు పొలము వద్దకు వెళ్లారు. పొలములో చెట్టు కింద నారాయణ మృతదేహం కనిపించింది. నారాయణ మృతదేహంపై కాలిన గాయాలు ఉన్నాయి. దీంతో పిడుగుపాటుతో నారాయణ మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు నిర్ధారణకు వచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని మాజీ ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, మాజీ సర్పంచ్ నోముల వెంకట నరసమ్మ సీపీఐ(ఎం) నాయకులు నోముల పుల్లయ్య, పాపినేని రమేష్, పాపినేని అప్పారావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

పీహెచ్‌సీకి బెడ్ వితరణ

నవతెలంగాణ-పెనుబల్లి

మండలంలోని లంకసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గర్భిణీల కోసం. సోమవారం ఎడ్ల పద్మశ్రీ జ్ఞాపకార్థం బెడ్‌ను అందజేశారు. యడ్లబంజరు గ్రామానికి చెందిన యడ్ల హర్షిత జన్మదినం సందర్భంగా తన తల్లి పద్మశ్రీ జ్ఞాపకార్థం లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గర్భిణీల కోసం ప్రత్యేకంగా 20 వేల రూపాయల విలువైన బెడ్‌ను మెడికల్ ఆఫీసర్ చింతా కిరణ్ కుమార్‌కు అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రభుత్వ ఆస్పత్రికీ ప్రజలకు ఉపయోగపడే బెడ్‌ను అందచేయడం అభినందనియం అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను వైద్య సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, యడ్ల వెంకటేశ్వరావు, యడ్ల నరసింహారావు, బన్నే భద్రయ్య, వనమా సాయి, యడ్ల సుమంత్, రామిశెట్టి మనోహర్ నాయుడు, వైద్య సిబ్బంది నాగేశ్వరావు, పోలమ్మ, పాషా తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు

నవతెలంగాణ-తల్లాడ

క్షయ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని, క్రమం తప్పకుండా మందులు వాడితే, ఫలితం ఉంటుందని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డాక్టర్ గోపి తెలిపారు. మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి చికిత్స సూపర్వైజర్ వై. సురేష్, ల్యాబ్ సూపర్వైజర్ ఆర్. సంజయ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అంబేద్కర్ నగర్ రాష్ట్రీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. బిల్లుపాడు డిబి కాలనీకి చెందిన నల్లగట్ల జయరాజు(35) బైక్ పై పల్లిపాడు వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాదు నుండి తల్లాడ వైపు వస్తున్న కొత్తగూడెం డిపో ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో జయరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. 108 అత్యవసర వాహనంలో వైద్యం కోసం ఖమ్మం తరలించారు. వైద్యం పొందుతూ జయరాజు మృతి చెందాడు.

ద్విచక్రవాహనం కారు ఢీ

ఒకరు మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు

మండల పరిధిలోని నరసింహారావు పేట గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. భద్రాచలం వెళ్లి దైవ దర్శనం చేసుకుని తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనాన్ని తల్లాడ నుండి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వైరాకు చెందిన బత్తుల మురళీకృష్ణ మృతిచెందగా, జగ్గయ్యపేటకు చెందిన ఉజ్వల్, బత్తుల నరసింహారావు, తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 లో ఖమ్మం తరలించారు. ఎస్సై బి. కొండలరావు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

ఆశా వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-వేంసూరు




ఆశా వర్కర్ల మండల కమిటీ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా తోట స్వాతి, కొట్టే అరుణ తోపాటు ఉపాధ్యక్షులుగా కొంగల పుల్లమ్మ, మంజుల, సహాయ కార్యదర్శిగా నడ్డి వెంకటమ్మ, కోశాధికారిగా సువార్తతో పాటు గౌరవ అధ్యక్షుడిగా మల్లూరు చంద్రశేఖర్, 15 మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్లూరు చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని, ఆశాలకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హిమాంజలి, రాజేశ్వరి, రాధ, ప్రమీల, రావూరి యశోద, రాణి, మంగమ్మ, ఆరేంపుల కుమారి పాల్గొన్నారు.

మహిళా శిశు సంక్షేమంపై అవగాహన

నవతెలంగాణ-మధిర

గర్ల్స్ హై స్కూల్ మధిరలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమంపై సోమవారం బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, మైనర్ బాలికలకు వివాహంపై, తొందరగా పెళ్లిళ్లు చేసుకోవద్దని, ఇంటర్నెట్ జోలికి వెళ్లొద్దని తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ డిస్ట్రిక్ మిషన్ సుప్రీమ్, ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి కుమారి, డాక్టర్ హేమలత, ప్రధానోపాధ్యాయులు హైమావతి, పిడి అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కూసుమంచి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, గొర్రిలపాడు తండా, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, పెరికె సింగారంలను సోమవారం మండల విద్యాశాఖాధికారి రాయల వీరాస్వామితో కలసి జిల్లా అకాడమిక్ మోనిటరింగ్ అధికారి కేశవపట్నం రవి కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో జరుగుతున్న సమ్మెటివ్ అస్సెస్మెంట్ నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్ష ముగిసిన తరువాత విద్యార్థులను పాఠశాలలోనే ఉంచి మరుసటి పరీక్షకు సంబంధించిన సబ్జెక్టును సిద్ధం చేయాలన్నారు. వివిధ విషయములలో విద్యార్థుల ప్రగతిని, నోట్ పుస్తకములను, అభ్యాస పుస్తకములను పరిశీలించారు. విద్యార్థుల కొరకై సిద్ధముచేయబడుతున్న మధ్యాహ్న భోజనమును తనిఖీచేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
మంగళవారం | అక్టోబర్ 22, 2024 | www.navatelangana.com

శీలం నాగిరెడ్డికి ఎంపీ రామసహాయం నివాళి

నవతెలంగాణ-తల్లాడ



మండల పరిధిలోని రామానుజవరం గ్రామానికి చెందిన శీలం నాగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. సోమవారం నిర్వహించిన దశదిన కార్యక్రమంలో ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గంగాదేవి పాడు సొసైటీ చైర్మెన్ తూము వీరభద్రరావు, రామానుజవరం మాజీ సర్పంచ్ సేలం కోటారెడ్డి, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, కే. వెంకటేశ్వరరావు, మోత్కూరు శ్రీనివాసరావు, యాకోబు భాష తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ నష్టపరిహారం ఇవ్వాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్

నవతెలంగాణ-మధిర



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులందరికీ పంట నష్టపరిహారం అందించాలని, కొద్దిమంది కాంగ్రెస్ కార్యకర్తలకు అందించి చేతులు దులుపుకుంటే రైతులందరికీ పంట నష్టపరిహారం అందినట్టు కాదని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ అన్నారు. పట్టణంలోని బోడెపూడి భవన్‌లో సీపీఐ(ఎం) మండల కమిటీ సమావేశం ఓట్ల శంకర్‌రావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం కల్పించే గిట్టుబాటు ధర అందక రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ప్రజల నడ్డి విరుస్తున్నాయని, ఈ సమయంలో ప్రభుత్వం అండగా ఉండాల్సింది పోయి రైతులను, కూలీలను అధిక ధరలతో దోచుకోవడం దుర్మార్గమని విమర్శించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, పార్టీ మండల కార్యదర్శి మందా సైదులు, వడ్రానపు మధు, నాయుడు శ్రీరాములు, వీరాచారి, వెంకాయమ్మ, షేక్ ఉద్దండు సాహెబ్, బాజినేని వెంకట నరసయ్య, పార్టీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

24న మోటాపురంలో సీపీఐ(ఎం) మండల మహాసభ

- జయప్రదం కోరుతూ విస్తృత ప్రచారం
- హాజరుకానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు

నవతెలంగాణ-నేలకొండపల్లి



ఈ నెల 24న మండలంలోని మోటాపురం గ్రామంలో సీపీఐ(ఎం) 9వ మండల మహాసభను నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా నాయకులు, మండల ఇంచార్జ్ గుడవర్తి నాగేశ్వరరావు తెలిపారు. మహాసభ జయప్రదం కోరుతూ సోమవారం మండలంలోని మోటాపురం గ్రామంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారన్నారు. మహాసభ సందర్భంగా భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చావా లెనిన్ బాబు నగర్‌లో జరిగే ఈ మహాసభలో మండల వ్యాప్తంగా 200 మంది పార్టీ కార్యకర్తలు ప్రతినిధులుగా హాజరవుతున్నారన్నారు. మహాసభ జయప్రదం కోసం సన్నాహక కమిటీ, సంతాప తీర్మానం కమిటీ, మినిట్స్ కమిటీ, తీర్మానాల కమిటీలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మహాసభలో గత మూడు ఏళ్లుగా పార్టీ నిర్వహించిన ఉద్యమాలు, ఫలితాలపై ముసాయిదాను రూపొందించినట్లు ఆయన తెలిపారు. మహాసభ నూతన కమిటీ ఏర్పాటుతో రాబోయే మూడు ఏళ్ల కాలంలో పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే ఉద్యమ కార్యాచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ మహాసభ సందర్భంగా జరిగే బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కెవి.రెడ్డి, మండల సీనియర్ నాయకులు రచ్చ నరసింహారావు, జోన్ బాధ్యులు పగిడికత్తుల నాగేశ్వరరావు, రాసాల కనకయ్య, బెల్లం లక్ష్మి, గుగులోతు వీరునాయక్, శాఖ కార్యదర్శి ఏలూరు రామారావు, సీనియర్ నాయకులు ఏలూరు రంగారావు, ఇంటూరి అశోక్, చావా రామయ్య, బెల్లం గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థిని దీప్తికి ఎంపీ అభినందనలు

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్



క్రమశిక్షణ, దృఢ సంకల్పం, పట్టుదల ఉంటే మనిషి సాధించలేనిదంటూ ఏది ఉండదని ఆచరణలో నిరూపించింది సరస్వతి పుత్రిక దీప్తి. పేద కుటుంబానికి చెందిన దీప్తి కష్టపడి చదివి కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర సోమవారం ఖమ్మం బురహాన్ పురంలోని తన క్యాంప్ కార్యాలయంలో దీప్తిని శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డకు చెందిన హమాలీ పని చేసే వెంకటేశ్వర్లు-మంగ దంపతుల కూతురు దీప్తి మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలో చదివి పదవ తరగతిలో 10/10, ఇంటర్మీడియట్‌లో 1000కి 958 మార్కులు సాధించి అందరి ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా దీప్తిని ఎంపీ రవిచంద్రతో కలిసి బీఆర్ఎస్ నాయకులు తోట రామారావు తదితర ప్రముఖులు ప్రశంసించారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నవతెలంగాణ-మధిర

వార్షిక పోలీస్ స్టేషన్ల తనిఖీల్లో భాగంగా వైరా ఏసీపీ ఏఆర్. రెహమాన్ సోమవారం మధిర టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. దీనితో పాటు పెండింగ్‌లో తీవ్రమైన నేరాల సిడి ఫైల్స్, స్థిరస్తి, చోరీలు, ఐటీ కేసుల ప్రస్తుత స్థితిగతులకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నిరంతర ముందస్తు సమాచారాన్ని సేకరించడంతో పాటు పోలీస్ స్టేషన్ పరిధిలో తిరిగే అనుమానితుల సమాచారాన్ని సేకరించాలని, కష్టంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంధ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ రమేష్‌పై ఫిర్యాదు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఉత్తర్వులు బేఖాతార్

నవతెలంగాణ-ఖమ్మం

రఘునాథపాలెం మండలం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ రమేష్‌పై సోమవారం జిల్లా కలెక్టర్‌కు తోటమాలి ఊట్కూరు బాబు ఫిర్యాదు చేశారు. 2001 నుండి పెద్దగోపతి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఊటుకూరు బాబు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.50 జీతం నుంచి పనిచేస్తున్న సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జిల్లా స్థాయి అవార్డులు పిహెచ్సికి బాబు ఆధ్వర్యంలోని వచ్చాయి. ఆసుపత్రి ఆవరణలో అందమైన పూల మొక్కలు చెట్లు నాటటంలో బాబు ఎంతో కష్టపడ్డారు. అప్పట్లో ఎన్నో అవార్డులు కూడా వచ్చాయి. పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రమేష్ మెడికల్ అధికారిగా ఉన్న 2020 సెప్టెంబర్ నెలలో డాక్టర్ రమేష్ ఉన్న సమయంలో రోజువారి పనిలో భాగంగా ఉదయం శుభ్రం చేసే క్రమంలో హాస్పటల్ ఆపరేషన్ థియేటర్లో డాక్టర్ రమేష్ చేయకూడని పని చేస్తూ బాబు కంటపడటంతో ఆ సమయంలో డాక్టర్ బాబుపై కోపగించుకొని నా గదిలోకి ఎందుకు వచ్చావు అని ద్వేషం పెంచుకొని అప్పటి నుండి అతను విధుల నుంచి తొలగించి నీవు పనులకు రావద్దు అని విధులను తొలగించానని అని చెప్పడంతో బాబు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. 2022లో అప్పటి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలతి ఊటుకూరు బాబును తిరిగి విధుల్లోకి చేర్చుకోవాలని కలెక్టర్‌కు నోట్ ఫైల్ ద్వారా డాక్టర్ రమేష్‌కు 2022 జూన్ 9 తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ రమేష్ ఊట్కూరు బాబుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఇచ్చిన ఉత్తర్వులను దాచిపెట్టి అతనికి ఇప్పటి వరకు ఉత్తర్వులలో పేర్కొన్న విధంగా బాబుకు ఉద్యోగం ఇవ్వలేదు. దీంతో బాబు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- మున్సిపల్ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

నవతెలంగాణ-ఖమ్మం కార్పొరేషన్

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ దరఖాస్తులను పరిశీలించి సబంధిత అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపారనష్టం..

నవతెలంగాణ-పెనుబల్లి

పెనుబల్లి మండలంలో అకాల వర్షాలు.. గాలి దుమారంతో పొట్ట కొచ్చి ఎదుగుతున్న వరి పైరు నేలకు వాలి పోవడంతో రైతులు అపార నష్టం చవిచూస్తున్నారు. మండలంలోని పాత, కొత్తకారాయిగూడెంతో పాటు లంక సాగర్, సాగరాయికట్టు ప్రాంతంలోని వరి పొలాలు పొట్ట దశకు వచ్చి ఎదుగుతున్న సమయంలో గాలి దుమారం అకాల వర్షాల వల్ల పెట్టిన పెట్టుబడులు సైతం వచ్చే పరిస్థితి కనపడటం లేదు. వరి కంకులు పాలు పోసుకునే సమయంలో వరి మొళ్ళల్లో చాప చుట్టినట్టుగా నేల వాలిపోవడంతో ధాన్యం తయారయ్యే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. ఎకరాకు పాతిక వేల రూపాయలు మేరకు పెట్టుబడి పెట్టి వరి పంట సాగు చేస్తే ఈఏడాది వాతావరణంలో వస్తున్న తీవ్ర మార్పులు కారణంగా వర్షాలు ఈ ప్రాంతంలో తీవ్రంగా కురవడంతో పంట దిగుబడి పూర్తిస్థాయిలో తగ్గే అవకాశం ఉందని రైతులు తెలుపుతున్నారు. పెనుబల్లి మండలంలో 70 శాతం మంది రైతులు వరి పంట జీవనాధారంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పుడు మబ్బుడిగా తుఫాను రావడంతో వరి పంట దిగుబడి తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి నెలకొంది. దెబ్బతిన్న వరి పొలాలను అధికారులు పరిశీలించి సర్వే నిర్వహించి బాధిత రైతు కుటుంబాలకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నిరుపేదలకు అండగా సీఎంఆర్ఎఫ్

నవతెలంగాణ-చింతకాని

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు కొండంత అండగా ఉంటూ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కింద ఆర్థిక సహాయం అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. సోమవారం నేరడ గ్రామంలో దూసరి గోపాలరావు నివాసంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు చింతకాని మండలం నేరడ గ్రామానికి చెందిన కనకపుడి యశోదకి రూ. 45 వేలు సీఎం సహాయనిధి చెక్కు మంజూరైన చెక్కును ఆమెకు అందజేశారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మంకెన నాగేశ్వరరావు, గ్రామ మాజీ ఉప సర్పంచ్ దూసరి గోపాలరావు, పెరిక ప్రభాకర్, గుండెపోగు ప్రభాకర్, గొర్రెముచ్చు అంతోని తదితరులు పాల్గొన్నారు.

నీది 10వ వార్డు..4వ వార్డులో ధర్నా ఏంటి?

- మున్సిపల్ ఆఫీస్‌లో చేసుకో
- కౌన్సిలర్‌పై ఎస్ఐ సీరియస్

నవతెలంగాణ-వైరా



వైరా మునిసిపాలిటీ పరిధిలోని 4 వ వార్డులో బస్టాండ్ వెనక ఖమ్మం రాజమండ్రి జాతీయ రహదారి పై నిర్మించిన మూడంతస్తుల భవనం నిర్మాణానికి అనుమతులు లేవని యజమానిపై చర్యలు తీసుకోవాలని 10 వ వార్డు కౌన్సిలర్ కర్నాటి నందిని సోమవారం ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా భవన యజమానికి కౌన్సిలర్‌కు వాగ్వివాదం జరిగింది. భవన యజమాని దొంతి బోయిన చింతయ్య తనకున్న డాక్యుమెంట్స్‌తో వైరా ఎస్ఐ వంశీ కృష్ణ బాగరాజ్‌కు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సంఘటనా స్థలానికి చేరుకుని భవనం ముందు ధర్నా చేయటం సమంజసం కాదని వెంటనే లేవాలని తెలుపగా అందుకు నిరాకరించిన కౌన్సిలర్, ఆమె భర్త కర్నాటి హనుమంతరావు తదితరులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీది 10 వ వార్డు అయితే నాలుగవ వార్డులో ధర్నా చేయటం ఏమిటని ధర్నా చేసుకుంటే మున్సిపల్ ఆఫీస్ ముందు చేసుకో అంతే గాని న్యూసెన్స్ చెయ్యొద్దని హెచ్చరించడంతో లేచి మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అనుమతిలేని భవనాలు, వెంచర్లపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. కాగా భవన యజమాని దొంతి బోయిన చింతయ్య మాట్లాడుతూ తనకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ ఉన్నాయని, అన్ని అనుమతులతో నిర్మించానని, భవన మొదటి అంతస్తు నిర్మాణం కర్నాటి హనుమంతరావు దగ్గర ఉండే చేయించినట్లు తెలిపాడు. వ్యక్తి గత కారణాలతో అరాచకాలకు పాల్పడుతూ నా బిల్డింగ్ ముందు ధర్నా చేయటం ఎందుకని ప్రశ్నించారు.

'ప్రభుత్వ పథకాలకు నోచుకోని కుటుంబాలు'

నవతెలంగాణ-వేంసూరు

ప్రభుత్వాలు మారిన అధికారులు వచ్చినా ప్రజల జీవన విధానాలలో మార్పు రావటం లేదని దానికి నిదర్శనం మండల పరిధిలోని వెంకటాపురం పంచాయతీలోని లక్ష్మీనారాయణపురం గ్రామంలో 15 కుటుంబాలకు నేటి వరకు విద్యుత్ సౌకర్యం లేదంటే నమ్మశక్యం కానీ విషయం. ప్రధాన రహదారి ప్రక్కన నిత్యం మండల అధికారులు తిరిగే ప్రదేశం గ్రామపంచాయతీలలో ఎన్ని సర్వేలు చేసినా ప్రజా పాలన దరఖాస్తులలో అధికారులకు కనిపించ లేదా అని సిపిఐ మండల కార్యదర్శి పిల్లి భాస్కర్ అన్నారు. సోమవారం ఆ కుటుంబాలను కలుసుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల అధికారులు స్పందించి ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు 15 కుటుంబాలకు గృహజ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్తు అందే విధంగా కృషి చేయాలని అన్నారు. అధికారులు స్పందించినట్లయితే ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. పరిశీలించిన వారిలో నాగేశ్వరరావు, చంటి, పుత్తూరు వెంకటేశ్వరరావు, కుమారి, సత్యం, జ్యోతి, వెంకట్రావు, వెంకటమ్మ కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

సమగ్రంగా పంట నష్ట సర్వే నిర్వహించాలి

- ఏడీఏను నిలదీసిన రైతులు

నవతెలంగాణ-బోనకల్



ఇటీవల తుఫాను ప్రభావంతో కురిసిన అకాల వర్షాల వలన మండలంలో దెబ్బతిన్న పత్తి, వరి, తదితర పంటలపై సమగ్ర సర్వే నిర్వహించాలని మధిర ఏడీఏ విజయ్ చందర్‌ను బోనకల్ రైతులు స్థానిక రైతు వేదికలో సోమవారం నిలదీశారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల అధికారులు ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధిర ఏడీఏ విజయ్ చంద్ర కూడా హాజరయ్యారు. బోనకల్‌కి చెందిన రైతులు కొంతమంది తమ పంటలు దెబ్బతిన్న నమోదు చేయలేదని, దీని వలన తాము నష్టపోయామని రైతులు ఏడీఏని నిలదీశారు. అనంతరం రైతు వేదిక ముందు ఆందోళన నిర్వహించారు. ఆందోళన వద్దకు ఏడిఏ వచ్చి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా రైతులు వినిపించుకోలేదు. తమకు అన్యాయం జరిగిందని, కొంతమంది పంట వేయకపోయినా పంట నష్టపోయినట్టు నమోదు చేశారని, వాస్తవంగా పంట సాగు చేసి నష్టపోయిన తమ పంట నమోదు చేయలేదని నిలదీశారు. దీంతో ఏడిఏ జెడిఏతో మాట్లాడి సమస్యను వివరించారు. దీంతో జెడిఏ రైతుల వివరాలను తీసుకోమని ఏడిఏటి చెప్పారు. అదే విషయాన్ని ఏడిఏ రైతులకు తెలిపారు. దీంతో రైతులు తమ ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి ఎంగల ఆనందరావు, తూము రోషన్ కుమార్, రైతులు గంగుల నాగయ్య ఎర్రగాని సైదులు అంతోటి తిరుపతరావు, ఎర్రగాని యాలాద్రి, ఎర్రగాని రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మౌలాలికి టీచర్ ఎక్సలెన్స్ అవార్డు

నవతెలంగాణ-కల్లూరు



విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ వారి భవిష్యత్తుకు పునాదులు వేస్తూ తనకంటూ గుర్తింపు పొంది ఉత్తమ ఉపాధ్యాయుడిగా సేవలం దిస్తున్న ఎండి. మౌలాలికి టీచర్స్ ఎక్సలెన్స్ అవార్డు ఎంపిక కావటం హర్షించ దగ్గ విషయం. మండల పరిధిలో పేరువంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎండి. మౌలాలి, ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యాములను జ్ఞానం వైపు, శాస్త్రీయత వైపు, కుతూహలం వైపు, శ్రమ పట్ల గౌరవం వైపు నడిపుతూ విద్యార్థులకు కృత్యహలం, పెంచి ఆలోచనలకు అనుగుణంగా బోధన చేస్తూ జాతీయ హృదయాలలో నిలిచిపోయారు. సమాజానికి ఉపయోగపడే విధంగా పనిచేస్తున్న మౌలాలిని అక్టోబర్ 5 ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మొత్తం ఉపాధ్యాయుడుగా, రిసోర్స్ పర్సన్‌గా చేసిన సేవలకుగాను శారదా ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఫౌండేషన్ స్టిరీన్ స్కై లైఫ్ సంయుక్త ఆధ్వర్యంలో టీచర్ ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపిక చేయగా ఆదివారం రాత్రి హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మెన్ డాక్టర్ కమలా మనోహర్ చేతుల మీదుగా మౌలాలి అవార్డు అందుకున్నారు. అవార్డు పొందిన ఉపాధ్యాయుని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

నవతెలంగాణ-కల్లూరు

ఐకెపి సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు విషయంలో ఇన్‌చార్జిలకు ఏపిఎం వెంకట్రామారావు సోమవారం అవగాహన కల్పించారు. ఉషోదయ మండల మహిళా సమైక్యలో బ్యాంకు లింకేజీ, ఎంటర్ప్రైజెస్ మహిళా శక్తి సంస్థాగత నిర్మాణ కార్యక్రమాలు, ధాన్యం కొనుగోలు సెంటర్లు సర్ప్ అమలు చేస్తున్న అన్ని ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు గురించి సీసీలు స్టాఫ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఓటర్‌గా నమోదు చేసుకోండి

నవతెలంగాణ-టేకులపల్లి

ఖమ్మం-నల్గొండ-వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి ఓటరుగా నమోదు చేయడానికి సమయం దగ్గర పడుతున్నందున, టీఆర్‌టీయూ టేకులపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సులానగర్ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలలో ఓటును నమోదు చేసుకోవాలని అవగాహన కల్పించినట్లు సంఘ నాయకులు సోమవారం తెలిపారు. 2018వ సంవత్సరం నుండి, 6 నవంబర్ 2024 వరకు మూడు సంవత్సరాలు ఉన్నత పాఠశాల నందు పని చేసిన ఉపాధ్యాయులు అందరూ తమ ఓటు నమోదు చేయాలని కోరారు. ఉపాధ్యాయులందరికీ ఎమ్మెల్సీ ఓటు ఫామ్ 19ను అందరికీ అందజేయడం జరిగిందన్నారు. ఈ కారిక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టీ. రవీందర్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు విజయనిర్మల, మండల అధ్యక్షులు జి.మోతిలాల్, ప్రధాన కార్యదర్శి బి. రమేష్ బాబు, నాయకులు సిహెచ్ .మురళి ధర్రావు, వెంకట్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ అథ్లెటిక్స్ పోటీలో ప్రియదర్శిని

• విద్యార్థికి మొదటి స్థానం

నవతెలంగాణ-కొత్తగూడెం

కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నిర్వహించిన అథ్లెటిక్స్ (క్రాస్ కంట్రీ) పోటీలో 10 కిలో మీటర్ల విభాగంలో కొత్తగూడెం పట్టణ ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో బి.కాం మొదటి సంవత్సరం చదువుతున్న మాలోత్ అఖిల్ ప్రథమ స్థానం కైవసం చేసుకొని త్వరలో జరగబోయే ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కాటేపల్లి నవీన్ బాబు తెలిపారు. ఈ సందర్భముగా అఖిల్ ను కళాశాల ఆవరణలో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు,



ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ నయీం పాషా మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ స్థాయిలో ప్రథమ స్థానం సాధించి ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు తమ కళాశాల నుండి ఇద్దరు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాయల వివేక్, పి.డి కాశిమల్ల రమేష్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.





కదం తొక్కిన మహిళా లోకం



• వేలాదిగా తరలి వచ్చిన మహిళలు
• ఆకట్టుకున్న ఆదివాసీ కొమ్మునృత్యం
• పట్టణంలో కోలాహలం

కొత్తగూడెంలో భారీ ప్రదర్శన / ఐద్వా బహిరంగ సభ విజయవంతం

నవతెలంగాణ-కొత్తగూడెం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం పట్టణం మహిళాలోకంతో నిండి పోయింది. ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా మహిళలు కనిపించారు. పెద్ద పెద్ద ఓడింగ్స్... దారి పొడుగునా ఐద్వా జాతీయ, రాష్ట్ర నాయకత్వం నిలువెత్తు ఫ్లెక్సీల ఏర్పాట్లు, ప్రధాన కూడళ్లన్నీ ఐద్వా జెండాలు... తోరణాలతో నిండిపోయాయి..

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు 21, 22, 23 తేదీలలో కొత్తగూడెం కావడంతో పట్టణమంతా మహిళా పోరాట యోధుల ఫ్లెక్సీలతో దర్శనమిచ్చాయి.... మహాసభల సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. కూలీలైన్ సూర్యాప్యాలెస్ ఎదురుగా ఉన్న మైదానంతో బహిరంగం సభ జరిగింది. తొలుత బహిరంగ సభకు రాష్ట్ర వ్యాప్తం ఐద్వా నాయకులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నలుమూలన నుండి పెద్దఎత్తున మహిళలు సభకు విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళలు ఎర్రటి ఎండను లెక్క చేయకుండా ఐద్వా జెండా చేతబూని కొత్తగూడెం పాత బస్సు డిపో నుండి సూర్యోదయ ప్యాలెస్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఓల్డ్ డిపో నుండి గణేష్ టెంపుల్, సూపర్ బజార్ మీదుగా సాగింది. వేలాది మంది మహిళలు ఐద్వా జెండాలను చేత బూని మహిళలపై హింస అరికట్టాలి, మహిళలకు సమానత్వం కల్పించాలి... చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి.... ధరలు నియంత్రించాలని... మద్యపానం నియంత్రించాలి.... ప్రభుత్వ విద్యా వైద్యం పటిష్టంగా అమలు చేయాలి... ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగు పరచాలని నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ ముందుభాగాన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే, జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి, జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందర రామన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు టి.జ్యోతి, బుగ్గవీటి సరళ, ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.సీతాలక్ష్మి, ఎం.జ్యోతి, తదితరులు ర్యాలీ అగ్రభాగంలో నడిచి ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన అనంతరం సూర్య ప్యాలెస్ ఎదురుగా ఉన్న గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించారు.



అలరించిన కళారూపాలు..

ఐద్వా మహిళా సంఘం బహిరంగ సభ సందర్భంగా నిర్వహించిన భారీ ప్రదర్శనలో అనేక కళారూపాలు కనువిందు చేశాయి. అందరిని ఆకట్టుకున్నాయి. ఐద్వా రాష్ట్ర మహాసభల సందర్భంగా నిర్వహించిన ప్రదర్శనలో ముందు భాగాన ప్రదర్శించిన మహిళా కళారూపాలు దారి పొడుగుగా ప్రజలను ఆకట్టుకున్నాయి. భద్రాచలం ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించే రేలా డోలు కొయ్యల కొమ్ము నృత్యం... అశ్వారావు పేట నుంచి వచ్చిన డప్పుల నృత్యం, లక్ష్మీదేవి పల్లి మండలం నుంచి వచ్చిన కోలాట కళారూపాలు విశేషంగా ఆకర్షించాయి. ఎర్రటి ఎండను లెక్క చేయకుండా మహిళలు ప్రదర్శించిన కళారూపాలు కొత్తగూడెం పట్టణ ప్రజలను విశేషంగా ఆకర్షించడంతోపాటు, ప్రదర్శనలో పాల్గొన్న వేలాదిమంది మహిళలను ఉత్సాహపరిచాయి.



ములకలపల్లి- తాళ్లపాయ వంతెన వద్ద సైడ్ డైవర్షన్ రోడ్డు నిర్మించాలి

• ప్రధాన రహదారిపై గ్రామస్తుల ధర్నా
• 2 నెలలైనా అమలుకాని ఎమ్మెల్యే జారె హామీ

నవతెలంగాణ-ములకలపల్లి

ములకలపల్లి- తాళ్లపాయ మధ్య ఉన్న వంతెన వద్ద రహదారి డైవర్షన్ రోడ్డు నిర్మించాలని తాళ్లపాయ గ్రామస్తులు సోమవారం ములకలపల్లి ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించి రెండు గంటల పాటు ఆందోళన చేపట్టారు. కొండ్రు సుందర్రావు, గడ్డం ఉదయ్ ఆధ్వర్యంలో 200 మంది గ్రామస్తులతో ధర్నా చేపట్టి గత ఆరు నెలలుగా ప్రజలు రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమయం కావడంతో రైతులు, విద్యార్థులు, వృద్ధులు మండల కేంద్రానికి రావాలంటే రూ.200 చార్జీతో రవాణా చేయాల్సి వస్తుందన్నారు. వంతెన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రైలింగ్ వంతెన ప్రమాదకరంగా ఉండటంతో చాలామంది వంతెన రైలింగ్ కిందపడి గాయాలపాలయ్యారన్నారు. పంచాయతీ ప్రజలు గత రెండు నెలల క్రితం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు వినతులు అందించినప్పటికీ పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నెలరోజుల్లో సైడ్ డైవర్షన్ రహదారి నిర్మిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే నేటికి రెండు నెలలవుతున్నా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా చేస్తున్న విషయం తెలుసుకున్న భద్రు ఆందోళనకారుల వద్దకు వచ్చి నాలుగు రోజుల్లో సొంత ఖర్చులతో సైడ్ డైవర్షన్ రహదారి నిర్మిస్తామని హామీ ఇవ్వడంతో తాళ్లపాయి పంచాయతీ ప్రజలు ఆందోళన విరమించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి అఖిలపక్ష నాయకులు తమ సంపూర్ణ మద్దతు తెలిపి ధర్నాలో పాల్గొన్నారు. ఆదివాసీ రాష్ట్ర నాయకులు, ఆదివాసీ లీగల్ అడ్వైజర్ ఊకే రవి, పొడియం ప్రేమకుమార్, సీపీఐ జిల్లా నాయకులు సరాటి రమేష్, సీపీఎం మండల అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు, టీడీపీ జిల్లా నాయకులు పువ్వాళ్ల శ్రీను, శంకర్రావు, బిక్కుమళ్ల సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు కుంజా రాంబాబు, మాజీ సర్పంచ్ వాడే నాగరాజు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు కుంజా కృష్ణ జనసేన జిల్లా నాయకులు రాంబాబు, పాల్గొన్నారు.

నూతన మసీదు నిర్మాణానికి శ్రీకారం..

నవతెలంగాణ - అశ్వారావుపేట

ఏళ్లనాటి పురాతన మసీదును తొలిగించి అదే ప్రదేశంలో నూతన మసీదు నిర్మించే పనులను సోమవారం ప్రారంభించారు. అశ్వారావుపేటలోని దాదాపు 50 ఏళ్ల నాటి మసీదు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో దానిని పూర్తిగా తొలగించారు. తొలగించిన పాత మసీదు స్థానంలో కొత్తగా మసీదు నిర్మించే పనులను ముస్లిం సదర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే వలీ పాషా, ఎస్కే నజీర్ తో పాటు కమిటీ సభ్యులు ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా కమిటీ బాధ్యులు మాట్లాడుతూ నూతన మసీదు నిర్మాణాన్ని వచ్చే రంజాన్ పండుగ నాటికి పూర్తి చేయనున్నట్లు కమిటీ బాధ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముస్లిం కమిటీ ఇంచార్జి మౌలానా సయ్యద్ సాబ్, ఉస్మాన్ హాఫిజ్, స్థానిక ముస్లిం పెద్దలు ఎండి ఉస్మాన్, ఫైజుద్దీన్,ఎస్ కే అలీమ్, ఎస్కే సర్దార్ పాల్గొన్నారు.

శాంతియుత సమాజమే పోలీసుల లక్ష్యం..

• పటిష్టమైన శాంతి భద్రతలతోనే అభివృద్ధి సాధ్యం
• కలెక్టర్ జితేష్.వి.పాటిల్
• విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలు మరువలేనివి
• ఎస్పీ రోహిత్ రాజు

నవతెలంగాణ-కొత్తగూడెం

విధి నిర్వహణలో దేశ రక్షణ కోసం ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా పోలీసులు సోమవారం హేమచంద్రాపురం నందు గల జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు పోలీస్ అమరవీరుల దినోత్సవం (ఫ్లాగ్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ జితేష్.వి.పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు హాజరయ్యారు. వీరు పెరేడ్ కమాండర్ లాల్ బాబు ఆధ్వర్యంలోని సాయుధ దళ పోలీసులచే గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సంఘ విద్రోహ శక్తులచే పోరాడి చనిపోయిన పోలీస్ పోలీసు అమర వీరుల త్యాగం భావితరాలకు స్పూర్తిగా నిలుస్తుందని చెప్పారు. ప్రజల సంరక్షణ కోసం పోలీస్ వ్యవస్థ నిరంతరం పనిచేస్తుందని, శాంతి భద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే స్పందించి ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించడంలో ఎల్లప్పుడు పోలీస్ శాఖ ముందు ఉంటుందని అన్నారు. శాంతిభద్రతలు పటిష్టంగా ఉన్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు.



పోలీసుల త్యాగం మరువలేనిది : ఎస్పీ రోహిత్‌రాజు

ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసు మేల్కొని, శాంతి భద్రతల పరిరక్షణ నిమిత్తం నిరంతరం కాపలా కాస్తుంటారని ఎండా, వాన, పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుటుంబంతో కలిసి జరుపుకునే పండగల్ని కూడా త్యజించి, ప్రజల కోసం శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలని సైతం పణంగా పెట్టి సంఘ విద్రోహశక్తులచే పోరాడి వీరమరణం పొందిన పోలీసులు చేసిన త్యాగానికి సానుభూతి, గౌరవం చూపించడం మనందరి బాధ్యత అని తెలిపారు. అక్టోబర్ 21 అంటే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం. 1959లో చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థంగా తిప్పిగొట్టిన రోజు ఇదని తెలిపారు. ఈ సమరంలో 10 మంది జవాన్లు అమరులయ్యారని,1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులోని అక్షయచిన్ ప్రాంతంలో సుమారుగా 16,000 అడుగుల ఎత్తులో తీవ్రమైన చలిలో కాపలా కాస్తున్న సిఆర్‌పిఎఫ్ జవాన్లు, దురాక్రమణకు ప్రయత్నించిన చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి వీర జవాన్లు ప్రాణాలర్పించడం జరిగిందని తెలిపారు. అప్పటినుంచి దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని దేశ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం వారు అమరవీరుల స్తూపానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.సాయి మనోహర్, డిఎస్పీలు చంద్రభాను, రెహమాన్, మల్లయ్య స్వామి, రవీందర్ రెడ్డి, సతీష్ కుమార్, ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు, పోలీస్ కార్యాలయ సిబ్బంది,స్పెషల్ పార్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



అశ్వాపురం :

నవతెలంగాణ-అశ్వాపురం :

రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయం నుండి కొనసాగిన ర్యాలీ టిడిపి సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకూ కొనసాగింది. ఆ పార్టీ నాయకులు కార్యాలయం ముందు సుమారు అరగంట పాటు నినాదించారు. అనంతరం తహశీల్దార్ స్వర్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారంగా రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు కోడి అమరేంద్ర యాదవ్, మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సూది రెడ్డి గోపాలకృష్ణారెడ్డి, కంచుకట్ల వీరభద్రం, మేడవరపు సుధీర్, వెన్న అశోక్ కుమార్, గద్దల రామకృష్ణ, చిలక వెంకటరామయ్య, నక్కన పోయిన పాపారావు, చుంచు రామ్మూర్తి, నేలపట్ల సత్యనారాయణ రెడ్డి, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం :

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. భద్రాచలం- చర్ల ప్రధాన రహదారి ప్రధాన సెంటర్లో నిర్వహించిన రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాల ప్రకారం రైతు భరోసా రూ.15 వేలను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని, 2 లక్షల రూపాయల రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలని, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, ప్లకార్డ్స్ ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. రాస్తారోకోను ఉద్దేశించి డివిజన్ నాయకులు మానే రామకృష్ణ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలకు, రైతులకు అడ్డగోలు హామీలు ఇచ్చి అవి అమలుచేయటంలో విఫలమయ్యారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రావుల పల్లి రాంప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, అధికార ప్రతినిధి ఎండీ జాని పాషా, ఉపాధ్యక్షులు తునికి కామేశ్వరరావు, అపక వీరాజు, సోషల్ మీడియా అధ్యక్షులు దామెర్ల శ్రీనివాస్, రైతు సంఘం మండల అధ్యక్షుడు జొగ వెంకట రమణ, ఎస్సీ సెల్ అధ్యక్షులు మోతుకురి శ్రీకాంత్, యూత్ అధ్యక్ష కార్యదర్శులు అల్లాడి వెంకటేష్, జిలకర గంగరాజు, మైనార్టీ సెల్ కార్యదర్శి ఖాదర్ పాషా, నాయకులు జంజురి జయసింహ, భూక్యా చందు, కాటిబోయిన వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 29ను రద్దు చేయండి

నవతెలంగాణ- టేకులపల్లి

జీవో నెంబర్ 29ను రద్దు చేయాలని, ఏజెన్సీ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు అశోక్ బాబు నాయక్ సోమవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ ఎగ్జామ్‌ను రీ షెడ్యూల్ చేయాలని దానివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తీవ్రం నష్టం జరుగుతుందని, ఉద్యోగ నియామకాల్లో మెరిట్ కం రోస్టర్ పాటించాలని కోరారు. 29 జీవో వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వారి రిజర్వేషన్ మేరకే పరిమితం చేస్తున్నారని, కావున మెరిట్‌లో మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వారు సాధించిన మార్కుల ఆధారంగా జనరల్ క్యాటగిరిలో ఎంపిక చేయాలని కోరారు. ఈ కొత్త 29 జీవో వల్ల ఎస్సీ/ఎస్టీ/ బీసీ ఓపెన్ క్యాటగిరిలో అర్హత సాధించిన రిజర్వు కేటగిరికి పరిమితం చేశారన్నారు. పాత 55 జీవో వల్ల ఎస్సీ/ఎస్టీ/ బీసీ అభ్యర్థులు మెరిట్ ఆధారంగా రిజర్వ్, ఓపెన్ క్యాటగిరిలో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిందని, కాబట్టి జీవో వివాదం లేకుండా భవిష్యత్ నియామకాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు నష్టం జరగకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విజ్ఞప్తి చేశారు.



దీపావళి కానుక చీరెలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే జారె

నవతెలంగాణ-దమ్మపేట

తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా దసరా, దీపావళి పురష్కరించుకొని పండుగల కానుకగా మహిళలకు అందిస్తున్న చీరలను సోమవారం అశ్వారావుపేట నియోజకవర్గ శాసనసభ్యులు జారె ఆదినారాయణ ప్రారంభించారు. మండలంలోని గండుగులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె మహిళలకు చీరెలు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులకు అండగా నిలబడాలనే ఉద్దేశంతో వారి చేతులతో నేచిన చీరలను రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ చేయాలని అన్నారు. తద్వారా స్థానిక చేనేత కార్మికులు ఆర్థికంగా బలోపేతం అవ్వడానికి వారికి అండగా నిలబడటానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. స్థానికంగా చీరల తయారీకి కొద్దిపాటి ఆలస్యం అయినందున దసరాకు అందించలేకపోయామని త్వరలో రాబోయే దీపావళి సందర్భంగా అందిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండలంలో మీ ఎమ్మెల్యే మీ ఇంటికి కార్యక్రమం

మండలంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మీ ఎమ్మెల్యే మీ ఇంటికి కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం నుండి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. 4వ విడత మంజూరి కాబడిన షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారుల గృహాలకు వెళ్ళి అందజేశారు. మండలంలోని అంకంపాలెం, సుధాపల్లి, పట్వారిగూడెం, పార్కలగండి, చిల్లగుంపు, పెద్దగొల్లగూడెం, చిన్నగొల్లగూడెం, మల్కారం, దమ్మపేట, మందలపల్లి, అలిపల్లి, వడ్లగూడెం, ముష్టిబండ, గట్టుగూడెం, మొద్దులగూడెం, నాచారం, నాగుపల్లి, లింగాలపల్లి, జమేదార్ బంజర గ్రామాలలో పర్యటించి లబ్ధిదారులకు నేరుగా ఇచ్చారు. ఇదే క్రమంలో అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న పలువురిని పరామర్శించి మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తానన్నారు. చిన్నగొల్లగూడెంలో జోనుబోయిన మల్లయ్య కాలు ఇన్‌ఫెక్షన్ కారణంగా తొలగించగా పరిశీలించి కత్రిమ కాలు ఏర్పాటు చేపిస్తానని హామీ ఇచ్చారు.

సేంద్రియ వ్యవసాయమే శ్రీరామరక్ష

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



నవతెలంగాణ-దమ్మపేట

ప్రతి ఒక రైతు లాభసాటి పంటలను వేసుకోవాలని, పంట మార్పిడి విధానం ద్వారానే రైతుకి లాభం వుంటుందని, ముఖ్యంగా సేంద్రియ వ్యవసాయం శ్రీరామరక్ష అని వ్యవసాయ శాఖా మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కోర్నెపాడు, గుంటూరు జిల్లాలోని రైతునేస్తం ఫౌండేషన్‌ని సందర్శించి తన అభిప్రాయాన్ని తెలియ చేసారు. గత 20 ఏండ్లుగా రైతు నేస్తం వెంకటేశ్వర రావు చేస్తున్న కృషిని కొనియాడారు. కేవలం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇవ్వడమే కాకుండా, ప్రకృతిలో లభించే ఆకులు, మూత్రం, అవుపేడ ద్వారా ఏ విధంగా ఆర్గానిక్ ఎరువులు, ఆర్గానిక్ పెస్టిసైడ్స్ తయారు చేసుకోవాలో ఇక్కడ రైతులకు నేర్పించడం, మల్టీలేయర్ వ్యవసాయ విధానాలు ప్రత్యక్షంగా చూపించడం, పండించిన పంటను యంత్రాల ద్వారా ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే పద్ధతులను తెలియచేయడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ మార్గాలను కల్పిస్తున్న ఫౌండేషన్‌ని అభినందించారు. ప్రతి ఒక్క రైతు సందర్శించాల్సిన ప్రదేశంగా కొనియాడారు. ఇక్కడ రైతులు కూడా ఆయిల్ పామ్ పంటలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప్పుటూరి సాంబశివరావు, పాత్రికేయులు వెంకట్రావు, స్థానిక రైతులు, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మెన్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

విధులతో పాటు విద్యాబోధన...

- గత ఎంఈవోలకు భిన్నంగా ప్రసాదరావు



నవతెలంగాణ-అశ్వారావుపేట

ఒక పీరియడ్ చెప్తేనే మరో పీరియడ్‌కు వెనకడుగు వేసే ఉపాధ్యాయులు ఉన్న నేటి పరిస్థితుల నేపథ్యంలో ఒక పక్క ఎంఈవో విధులు నిర్వహిస్తూ మరోపక్క తాను ప్రధానోపాధ్యాయుడుగా ఉన్న పాఠశాలలో తరగతులు బోధిస్తున్న ఎంఈవో ప్రసాదరావు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని మామిళ్ళవారిగూడెం ప్రధానోపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న ప్రసాదరావు గతంలో విద్యాశాఖ మండల నోడల్ అధికారిగా వ్యవహరించారు. ఈ క్రమంలో గత నెలలో మండలానికి ఒక ఎంఈవో నియమించాలి అనే విద్యాశాఖ నిర్ణయం మేరకు అశ్వారావుపేట మండల అధికారిగా ప్రసాదరావు నియమించబడ్డారు. ఈ నేపద్యంలో ఆయన తన విధులు నిర్వహిస్తూనే తన పాఠశాల విద్యార్ధులకు తరగతులు బోధిస్తున్నారు. సోమవారం ఆయన మామిళ్ళవారిగూడెం కాంప్లెక్స్ పరిధిలోని ఆసుపాక కాలనీ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసారు. ఈ సందర్భంగా నాణ్యమైన బోధన చేయాలని స్థానిక ఉపాధ్యాయులకు చూసించారు. విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అక్కడ నుండి మామిళ్ళవారిగూడెం పాఠశాల చేరుకుని తన విద్యార్థులకు తరగతులు బోధన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోనే అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలలో మామిళ్ళవారిగూడెం ఉన్నత పాఠశాల రెండోది అని ఉపాధ్యాయుల కొరతతో తరగతులు బోధించాల్సి వస్తుందని తెలిపారు.

అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యలపై విద్యార్థులకు అవగాహన

- డిప్యూటీ డీఎంఅండ్ హెచ్ఓ



నవతెలంగాణ-టేకులపల్లి

గ్లోబల్ అయోడిన్ డెఫిషియన్సీ డిసార్డర్ ప్రివెన్షన్ డే సందర్భంగా అయోడిన్ లోపం వల్ల కలిగే సమస్యలపై కోయగూడెం గిరిజన ఆశ్రమ పాఠశాలలో జిల్లా డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుకృత విద్యార్థులకు సోమవారం అవగాహన కల్పించారు. అయోడిన్ లోపం వల్ల గర్భస్రావం, మృత శిశువు జననం, పిండం అభివృద్ధి లోపం, బుద్ధిమాంద్యం గల పిల్లలు జన్మించడం, తక్కువ మానసిక శారీరక పెరుగుదల, గాయిటర్ వ్యాధి, నేర్చుకునే సామర్థ్యం తక్కువగా ఉండడం, వల్ల చదువులో ఆటల్లో వెనుకబడిపోవడం, పుట్టుకతో చెవుడు, మూగతనం, మరుగుజ్జుతనం, కండరాలు బిగుసుకుపోవడం, తెలివి తక్కువగా ఉండడం లాంటి లక్షణాలు ఉంటాయని, వీటన్నింటి నివారణకు శక్తి, మేధస్సు వికాసానికి అయోడిన్ ఉప్పునే తప్పనిసరిగా వాడాలని కోరారు. గ్రామాలలోని ప్రతి ఇంటిని, ప్రతి పాఠశాలను, హోటల్స్‌ను సందర్శించి, వారు వాడే ఉప్పులో అయడిన్ ఉందో లేదో, తప్పనిసరిగా పరీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, అసాంక్రమిక వ్యాధుల జిల్లా అధికారి డాక్టర్ మధు వరుణ్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, సూపర్వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ నిర్లక్ష్యం...ఇంట్లోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మద్యం మత్తులో ఉన్న డ్రైవర్ నిర్లక్ష్యంతో ట్రాక్టర్ ఓ ఇంట్లోకి దూసుకెళ్లిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... మర్కోడు గ్రామ పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో నూతన విద్యుత్ స్తంభాల పనుల నిమిత్తం ఓ గుత్తేదారు సోమవారం ఇల్లందు నుండి మర్కోడు గ్రామానికి ట్రాక్టర్ తీసుకొచ్చారు. డ్రైవర్ మద్యం తాగి ఉండటంతో మర్కోడు గ్రామంలో స్పీడ్ బ్రేకర్‌ను గమనించకుండా ట్రాక్టర్ వేగంగా నడపడంతో అదుపుతప్పి మూలమలుపులో ఉన్న బూర్ల రాంబాబు అనే వ్యాపారి ఇంట్లోకి ట్రాక్టర్ దూసుకెళ్లింది. దాంతో ప్రహరీ గోడ కొంత భాగం కూలింది. ట్రాక్టర్ టైర్లు డ్రైనేజీ కాలువలో ఇరుక్కోవడంతో షాపులో ఉన్నవారికి ప్రాణాపాయం తప్పిందన్నారు. బాధిత వ్యాపారి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సై ఈ.రతీష్ ట్రాక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చెరువులు, కుంటలను కాపాడండి

- కలెక్టర్‌కు తంబర్ల వినతి

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల పరిధిలో ఉన్న కుంటలు, చెరువులు కొన్ని ఆక్రమణకు గురవుతున్నాయని సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు తంబర్ల వినతి పత్రం అందజేశారు. చెరువులు, కుంటలకు హద్దులు లేకపోవడంతో ఆక్రమించుకుంటూ పోతే మునుముందు చెరువులు, కుంటలు అనేవి లేక భూగర్భ జలాలు అంతరించిపోయే పరిస్థితి ఉందని వారు తెలిపారు. వ్యవసాయం చేసేటటువంటి రైతులకు నీరు అందక తీవ్ర పంట నష్టం వచ్చి ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు.

నేటి నుండి కేఓసీ బొగ్గు టిప్పర్ డ్రైవర్ల, క్లీనర్ల సమ్మె

నవతెలంగాణ-టేకులపల్లి

కోయగూడెం ఓపెన్ కాస్ట్ నుండి బీపీఎల్, నవభారత్, కొత్తగూడెం ఆర్‌సీహెచ్‌పీ, టిప్పర్ల ద్వారా బొగ్గు ట్రాన్స్‌ఫర్ చేస్తున్న డ్రైవర్ల వేతనాలు పెంచాలని, పది నెలల కింద నోటీస్ ఇచ్చిన అసోసియేషన్ యజమాన్యం స్పందించనందున నేటి నుండి సమ్మె చేస్తున్నట్టు సోమవారం యూనియన్ నాయకులు తెలిపారు. ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా, టీయూసీఐ యూనియన్, జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్ షావలి, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాయం వెంకన్న, టిప్పర్ డ్రైవర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.

టిప్పర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టేకులపల్లి టిప్పర్ కార్యాలయంలో డ్రైవర్ల వేతనాల కోసం చర్చలకు యాజమానులే ఆహ్వానించారని, తిరిగి చర్చలకు రాకుండా తాత్సారం చేస్తూ 28వ తారీకు నాడు చర్చలు జరపాలని, ఫోన్లో మాట్లాడటం వలన, డ్రైవర్లు నేటి నుండి నిరవధికంగా సమ్మెలోకి వెళ్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా టిప్పర్ యాజమానులు అసోసియేషన్, ఇది నిరవధిక సమ్మెగా మారకముందే పిలిచి, చర్చలు జరిపి ఒప్పందం చేయాలని తెలిపారు. ఈ సమ్మెలో మోటార్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి. మధార్, చింటూ, రాజేష్, చంటి, వీరభద్రం, రమేష్ బాబు, నరసింహారావు, రాజా ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు అమలు చేయాలి

కోయగూడెం ఓసీ 2 భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలి

- వ్యకాస ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా
- మాజీ ఎంపీ మిడియం బాబూరావు



నవతెలంగాణ-కొత్తగూడెం

హైకోర్టు తీర్పు అమలు జరిపి, కోయగూడెం ఓసీ-2 భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని భద్రాచలం మాజీ ఎంపీ మిడియం బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కొత్తగూడెం మంచికంటి భవన్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఆర్డీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు, అనంతరం ఆర్డీఓకు వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు, వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్‌లు మాట్లాడుతూ టేకులపల్లి మండలం లచ్చగూడెం, కోయగూడెం, దంతెలతండ, కొత్తతండ, జేత్యతండ గ్రామాలకు చెందిన 105 గిరిజన కుటుంబాలు సాగు భూములు కోల్పోయారని అన్నారు. భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకపోవడం వల్ల నిర్వాసితులు వ్యవసాయ కార్మిక సంఘం, భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించారన్నారు. 2011, 2024 సంవత్సరాలలో రెండు సార్లు హైకోర్టులో నిర్వాసితులకు న్యాయం చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందని అన్నారు. వెంటనే అధికారులు గిరిజన నిర్వాసితులకు భూమి నష్టపరిహారం, ఉద్యోగాలు, భూమికి బదులు భూమి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈసం నరసింహారావు, కడుదుల వీరన్న, పూనెం స్వామి, దొడ్డ సంపత్ కుమార్, కోటేశ్వరరావు, బోడ కృష్ణ, బానోత్ కృష్ణ, ఈసం చుక్కమ్మ, భట్టు సత్తెమ్మ చీమల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.





మంత్రాల నెపంతో వ్యక్తి దారుణ హత్య

నవతెలంగాణ-జూలూరుపాడు

మంత్రాల నెపంతో వ్యక్తిని హత్య చేసిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. రాచబండ్ల కోయగూడెం గ్రామానికి చెందిన కుంజా బిక్షం (40) సొంత అన్న కొడుకు కుంజా ప్రవీణ్, వరుసకు మామ అయిన మల్కం గంగయ్య ఇద్దరూ కలిసి బిక్షాన్ని గత రాత్రి మద్యం సేవించేందుకు గ్రామ సమీపంలోని చెక్ డ్యాం వద్దకు తీసుకువెళ్లారు. మద్యం సేవించిన అనంతరం ప్రవీణ్, గంగయ్య ఇద్దరు కలిసి బిక్షం ముఖంపై రాయితో కొట్టి హత్య చేసి వాగులో పడేశారు. అయితే మృతి చెందిన బిక్షం చేతబడులు చేస్తాడని అనుమానంతో హత్య చేశారని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

విషయం తెలుసుకున్న సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణా ప్రతాప్ సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తుల సహాయంతో మృతదేహాన్ని చెక్ డ్యాం నుంచి వెలికి తీసి హత్యకు సంబంధించిన ఆధారాలు సేకరించి, మృతదేహాన్ని కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, పూర్తి వివరాలు విచారణలో తెలుస్తాయని సీఐ తెలిపారు. నిందితులు ఇద్దరు కూడా పోలీస్ స్టేషన్లో లొంగిపోయారు.



ఎట్టకేలకు మోక్షం..!

బూర్గంపాడు, సోంపల్లి గ్రామాల మధ్య రహదారి

- రూ.కోటి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పాయం
- హర్షం వ్యక్తం చేసిన రైతులు, గ్రామస్తులు

నవతెలంగాణ-బూర్గంపాడు

రెండు గ్రామాల మధ్య రైతులు, గ్రామస్తులకు అపరిష్కృతంగా ఉన్న సమస్యకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరిష్కారం చూపటంతో ఎట్టకేలకు ఆ సమస్యకు పరిష్కారం మోక్షం లభించింది. బూర్గంపాడు-సోంపల్లి గ్రామాల మధ్య సుమారు 8 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం రూ.కోటి నిధులు మంజూరు చేయటంతో ఆ గ్రామ ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లనాటి సమస్యకు పరిష్కారం దక్కటంతో ఆ గ్రామస్తులు సంబరాలను చేసుకున్నారు. ముఖ్యంగా రైతుల తమ పొలాలకు వెళ్లే రహదారి సౌకర్యం అంతంత మాత్రమే ఉన్న ఈ ప్రాంతంలో రూ.కోటి నిధులు మంజూరు చేస్తూ ఎమ్మెల్యే ఎన్నో ఏళ్ళగా రైతులు-ప్రజలు పడుతున్న కష్టాలకు ఫలితం దక్కడంపై సర్వత్ర ప్రజానీకం తమ పరిషత్ తమ సమస్యకు పరిష్కారం దక్కిందని ఆనందంలో మునిగి తేలుతున్నారు. గౌతమీపురం యస్సి కాలనీ ముత్యాలమ్మ దేవాలయం నుండి సోంపల్లిని కలుపుతూ వెళ్లే రహదారి నిర్మాణానికి స్థానిక రైతులు, ప్రజల ఆకాంక్ష మేరకు సుమారు రూ.కోటి నిధుల మంజూరుకు కృషి చేశారు. సోమవారం గౌతమిపురం కాలనీలో సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దుగ్గెం పూడి కృష్ణారెడ్డి-మైనారిటీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఖాన్, బి బ్లాక్ అధ్యక్షురాలు బర్ల నాగమణి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మందా నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు భజన సతీష్, కైపు శ్రీనివాస్ రెడ్డి, దాసరి సాంబయ్య, చిప్ప రాజు, భజన ప్రసాద్, కుమార్, శనగ కిషోర్, దేగల ధర్మయ్య, కేసుపాక మహేష్, భజన పెద్ద నాగం, నరేష్, భజన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో ఇల్లు దగ్ధం

- కట్టుబట్టలే మిగిల్చిన కడు విషాదం



నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రమాదవశాత్తు సంబంధించిన విద్యుద్ఘాతంతో ఓ గిరిజన కుటుంబానికి చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. స్థానికులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం... ముసలిమడుగు గ్రామానికి చెందిన వాగే సత్యం సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పత్తి చేలో పత్తి తీసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంట్లో నుండి మంటలు వ్యాపించడంతో గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్థానికులు గ్రామస్తులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినప్పటికీ మంటలు అదుపులోకి రాకపోవడంతో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ.55 వేల నగదుతో పాటు, రైతుకు చెందిన పట్టాదారు పాసుపుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంకు ఎకౌంటు పాస్ పుస్తకాలు వంటి పత్రాలతో పాటు ఇటు సామాగ్రి పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబానికి కట్టుబట్టలే మిగిలాయి. సుమారు రూ.2 లక్షల మేర నష్టం వాటిలినట్లు స్థానికులు తెలుపుతున్నారు. కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, డబుల్ బెడ్రూమ్ ఇల్లు మంజూరు చేయాలని సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు వాగే ఖాదర్ బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేగు బంధానికి తలొగ్గని ఉద్యమ స్ఫూర్తి

ఎమర్జెన్సీ లోనూ పోరాటం ఆపని 'దిశాలి'

పేగు బంధం కుటుంబ సంబంధాల కంటే కూడా పార్టీ నిర్ణయమే శిరోధర్యమని భావించి పార్టీ నిర్ణయానికి కట్టుబడి పని చేసిన భద్రాచలం డివిజన్ మొదటి తరం మహిళా నాయకురాలు కొమరం స్వరాజ్యేశ్వరమ్మ పై ఐద్వ రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం.

- భద్రాచలం డివిజన్ మొదటి తరం మహిళ నాయకురాలు కొమరం స్వరాజ్యేశ్వరమ్మ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఉద్యోగ కుటుంబంలో జన్మించి కార్మిక పక్షంగా నిలిచి

కూనవరం మండలం కరకగూడెం గ్రామంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దాన వీరయ్య-కనకమ్మ దంపతులకు మూడో సంతానంగా జన్మించిన స్వరాజ్యేశ్వరమ్మ పుట్టింది ఉద్యోగ కుటుంబమైనా చిన్ననాటి నుండే వామపక్ష భావజాలంతో కార్మిక పక్షాన నిలుస్తూ బండారు చంద్రరావు, టీవీఆర్ చంద్రం భీష్మారావు నాయకుల స్ఫూర్తితో తన ఉద్యమ ప్రస్తావని ప్రారంభించారు. స్వరాజ్యేశ్వరమ్మ వివాహం సైతం ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న దుమ్ముగూడెం మండలం సీతానగరం నాగయ్యతో జరిగిన నాటినుండి భర్త ప్రోద్భలంతో ఎలమంచిలి సీతారామయ్య బీఎస్ రామయ్యల నాయకత్వంలో భద్రాచలం డివిజన్ మొదటి తరం మహిళా నాయకురాలిగా అంచెలంచెలుగా ఎదిగారు.

భద్రాచలం డివిజన్ మొదటి తరం మహిళ నాయకురాలిగా

1978 భద్రాచలం డివిజన్ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన భద్రాచలం డివిజన్ మొదటి తరం మహిళా నాయకురాలిగా స్వరాజ్యేశ్వరమ్మ అప్పటి ఉమ్మడి డివిజన్లో విస్తృతంగా మహిళా సమస్యలపై అనేక రకాల పోరాటాలు నిర్వహించారు. 1989లో బత్తుల హేమావతి కార్యదర్శిగా, స్వరాజశ్వరమ్మ అధ్యక్షులుగా కొనసాగుతూ అనేక ఉద్యమాలను ఏజెన్సీ ప్రాంతంలో నిర్మించారు.

ఎమర్జెన్సీ లోనూ పోరాటాలు కొనసాగించిన దిశాలి

1975 జనవరి 26న అప్పటి ఇందిరా గాంధీ ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించారు. అప్పటికే 10 రోజుల నుండి కూలి రేట్లు పెంచాలని వ్యవసాయ కూలీలు పార్టీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తుంటే ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీ నేపథ్యంలో అగ్రనాయకత్వం మొత్తం అజ్ఞాతంలోకి తరలిపోయినా కూలీల పోరాటాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలో తెలియని సకటం పరిస్థితులలో స్వరాజ్యేశ్వరమ్మ ద్వితీయ శ్రేణి నాయకత్వంతోనే అత్యవసరంగా చర్చించి ఏమి జరిగిన పోరాటంలో వెనక్కి తగ్గేదే లేదని ఎమర్జెన్సీలో కనబడితే కాల్చివేసే ఉత్తర్వులు ఉన్నప్పటికీ కూలీల పక్షాన నిలబడి పోరాటానికి కొనసాగించారు. దొడ్డి దారిన రైతులు అందరూ ఐక్యమై నూజివీడు నుండి వలస కూలీలను తీసుకొచ్చి పనులు చేయించే ప్రయత్నం చేస్తే సామరస్యంగా వలస కూలీలకు నచ్చచెప్పి వెనక్కు పంపించి పోరాటాన్ని కొనసాగించిన ఫలితంగా అప్పటి జిల్లా కలెక్టర్ జయేంద్ర సింగ్ రైతులతో రైతు కూలీలతో చర్చలు జరిపి రూ.2 ఉన్న కూలీని రూ.4 పెంచాల్సి వచ్చింది. రైతు కూలీ పోరాటస్ఫూర్తితో పాలేర్లు ఖాతా కూలీలు జీతగాళ్లు సైతం ఐక్యంగా స్వరాజ్యేశ్వరమ్మ నాయకత్వంలో ఉద్యమించి రూ.30 నెలవారి కూలీని రూ.60 పెంచుకున్నారు. ప్రభుత్వ నిర్బంధాలు పోలీసుల దాడులను ఎదుర్కొని నమ్ముకున్న కార్మిక పక్షాన నిలబడి విజయం సాధించిన స్వరాజశ్వరమ్మ భద్రాచలం డివిజన్ ఉద్యమంలో కీలకంగా మారారు.



మావోయిస్టుల బెదిరింపులను లెక్కచేయకుండా...

తునికాకు రేటు 25 పైసలు పెంచాలని పార్టీ ఆధ్వర్యంలో ఆదివాసీ తునికాకు కార్మికులతో ఉద్యమిస్తుంటే తునికాకు కాంట్రాక్టర్లు దొడ్డిదారిన మావోయిస్టులతో చర్చలు జరిపి 18 పైసలకు ఒప్పందం కుదిరించుకోగా పెంచాల్సిన రేటు 25 పైసలు అని దొడ్డిదారిన చేసుకున్న ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ నాయకత్వం సహకారంతో స్వరాజ్యేశ్వరమ్మ పోరాటాన్ని కొనసాగించారు. జీర్ణించుకోలేని మావోయిస్టులు మా ఒప్పందాన్ని వ్యతిరేకిస్తావా అని ఇంటిపై దాడికి సైతం దిగినప్పటికీ ఏమాత్రం బెదరక తన పోరాటానికి కొనసాగించి 25 పైసలకు పెంచే వరకూ తునికాకు సేకరణ చేసేది లేదని తేల్చి చెప్పారంటే స్వరాజ్యేస్వరమ్మ పోరాట స్ఫూర్తి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

పేగు బంధం కుటుంబ సంబంధాల కంటే పార్టీయే మిన్న

2004లో జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల సమయంలో భద్రచలం పార్లమెంట్ నియోజకవర్గం నుండి పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా డాక్టర్ మీడియం బాబురావు పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంలో కమ్యూనిస్టుల కంచుకోటైన భద్రాచలం డివిజన్‌లో గెలవాలంటే కమ్యూనిస్టు పార్టీని ఎలాగైనా చీల్చాలి అని ఎత్తుగడలో భాగంగా అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గోవిందరావుపేట ఎంపీడీవోగా ప్రభుత్వ విధులు నిర్వహిస్తున్న స్వరాజ్యేశ్వరమ్మ చిన్న కూతురైన కొమరం పనిశ్వరమ్మ ఉద్యోగ బాధ్యతలు ఉన్నప్పటికీ ఆమెకు అప్పటి తెలుగుదేశం పెద్దలు పార్లమెంటు భ్రమలు కల్పించారు. భద్రాచలం పార్లమెంటు సభ్యురాలిగా పోటీకి నిలబెట్టినప్పటికీ పేగు బంధం కుటుంబ సంబంధాల కంటే పార్టీ నిర్ణయమే శిరోధాన్యమని పార్టీ అభ్యర్థి మీడియం బాబురావు గెలుపుకి స్వరాజ్యేశ్వరమ్మ పనిచేశారు. ఒకవైపు కన్న కూతురు ప్రత్యర్థిగా పోటీలో నిలిచిన కుటుంబ సభ్యులు ఒత్తిడికి గురిచేసినా 60 పదుల వయసులోనూ ముక్కు వాడిని దీక్షతో నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి పార్టీ గెలుపులో కీలకంగా వ్యవహరించిన స్వరాజ్యేశ్వరమ్మ నేటి తరం కార్యకర్తలకు స్ఫూర్తిగా నిలిచారు.

రోజురోజుకి పెరిగిపోతున్న కార్పొరేటీకరణ ప్రపంచీకరణ ప్రభావాలతో ప్రస్తుత పరిస్థితులలో మహిళలపై యువతులపై రోజురోజుకు పెరిగిపోతున్న అగత్యాలకు వ్యతిరేకంగా మహిళలను పోరాట నాయకులుగా తయారు చేయడమే లక్ష్యంగా జరుగుతున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా స్వరాజ్యేశ్వరమ్మ వంటి దిశాలిల చరిత్రలు నేటితరం మహిళలు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హక్కుల కోసం పోరాడుతున్న మహిళా సంఘం మహాసభలు విజయవంతం కావాలని నవతెలంగాణ పత్రిక ద్వారా తన సందేశాన్ని మహాసభల ప్రతినిధుల బృందానికి స్వరాజ్యేశ్వరమ్మ అందిస్తున్నారు.



స్వరాజ్యేశ్వరమ్మను మర్యాదపూర్వకంగా కలిసిన జాతీయ నాయకురాలు పుణ్యవతి

వాసవి క్లబ్ రీజియన్-7 ప్రాంతీయ సదస్సు విజయవంతం

- సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారికి అవార్డుల ప్రదానం
- వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ దాచేపల్లి



నవతెలంగాణ-ఇల్లందు

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వి 106-ఏ, రీజియన్-7 ప్రాంతీయ సదస్సు సోమవారం పట్టణంలోని స్థానిక కళాసి బస్తీలో గల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ సెవెన్‌లోని ఇల్లందు, గుండాల, వైరా, మధిర, ఎర్రుపాలెంలకు సంబంధించిన ఏడు క్లబ్బులు పాల్గొన్నాయి. గత పది నెలలుగా వాసవి క్లబ్బులు ద్వారా వివిధ వర్గాల ప్రజలకు అందించిన సేవా కార్యక్రమాలకు గాను రీజియన్-7 చైర్మెన్ అర్వపల్లి రాధాకృష్ణ అవార్డులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులలో బెస్ట్ క్లబ్, బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్, బెస్ట్ సర్వీస్ ప్రోగ్రాం, బెస్ట్ స్క్రాప్ బుక్, బెస్ట్ మ్యాన్ మైలేజ్ కేటగిరీలలో క్లబ్బులకు అవార్డులను అందజేశామన్నారు. వివిధ క్లబ్బుల నుండి సుమారు 150 మంది వాసవి క్లబ్ సభ్యులు ఈ ప్రాంతీయ సదస్సుకు హాజరయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ దాచేపల్లి సీతారాం, పరిశీలకులుగా చారుగుళ్ళ శ్రీనివాస్, చిదిరాల లింగయ్య, గౌరిశెట్టి పురుషోత్తం, దారా నరసింహారావు, గోళ్ళ రాధాకృష్ణ, మాశెట్టి వరప్రసాద్, రీజియన్ చైర్మెన్ అర్వపల్లి రాధాకృష్ణ, రీజియన్ సెక్రెటరీ తాటిపల్లి సుబ్బారావు, కాన్ఫరెన్స్ చైర్మెన్ కండే రమేష్, ఇల్లందు వాసవి క్లబ్ అధ్యక్షుడు పుల్లూరు సతీష్ కుమార్, మధుబాబు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, ఆర్యవైశ్య మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, పల్లెర్ల చంద్రశేఖర్, మైలవరపు బసవయ్య, నరేంద్రుల అనుబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండించిన అన్ని పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

రైతులు పండించిన అన్ని రకాల పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా (మాస్ లైన్) జిల్లా నాయకులు మాచర్ల సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ, తహసీల్దార్ కార్యాలయాల్లో ఏఓ, తహసీల్దార్ అనీల్ కుమార్, శకుంతలకు రైతుల సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని గుర్తు చేశారు. మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రంతో పాటు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ నాయకులు జి.వెంకటేశ్వర్లు, వై.రామనాథం, జి.రాంబాబు, సమ్మయ్య, జోగ సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఓసీ-2 దుర్గా ఓబీ కంపెనీ ఔదార్యం

- పాఠశాలకు బియ్యం, నిత్యావసర వస్తువుల పంపిణీ



నవతెలంగాణ-మణుగూరు

మండలంలోని ముత్యాలమ్మ నగర్ పంచాయతీ పరిధిలోని సంతోష్ నగర్‌లోని శ్రీ విద్యాభ్యాస పూర్వ బాల వెలుగు పాఠశాలకు స్థానిక పీకే ఓసీ-2లో మట్టి వెలికితీత పనులు నిర్వహిస్తున్న దుర్గా ఇన్ ఫ్రా మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఆధ్వర్యంలో 125 కిలోల బియ్యం, 15 లీటర్ల వంటనూనె, 25 కిలోల పప్పు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. పీకే ఓసి ప్రాజెక్టు మేనేజర్ దండమూడి రాంబాబు వితరణ కార్యక్రమానికి పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోనీ వలస గొత్తి కోయలు, గిరిజనులు, అనాధలు, నిరు పేద విద్యార్థినీ, విద్యార్థులను సమీకరించి వారికి చదువుతోపాటు కళలు, క్రీడలలో కూడా వారికి శిక్షణ ఇచ్చి ప్రభుత్వ గురుకుల పాఠశాలలో సీటు సంపాదించే స్థాయికి ప్రవేశ పరీక్షలలో తగు శిక్షణ ఇచ్చి వారిని సరస్వతి పుత్రులుగా తీర్చిదిద్దుతున్న శ్రీ విద్యాభ్యాస పాఠశాల నిర్వాహకులను ఆయన అభినందించారు. దాతల సహకారంతో విద్యార్థిని విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేసిన దుర్గ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. దుర్గా-2 ఓబీ కంపెనీ మేనేజర్ బిపిన్ మాట్లాడుతూ పాఠశాలకు బియ్యం, నిత్యావసర వస్తువులు ఈరోజు ఇవ్వడమే కాకుండా ప్రతినెల క్రమం తప్పకుండా అందజేస్తామని విద్యార్థుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు ఆలపించిన స్వాగత గీతం అందరినీ ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో పీకే ఓసీ రక్షణ అధికారి ఎం.లింగబాబు, దుర్గా-2 ఓబీ కంపెనీ మేనేజర్ బిపిన్, సునీల్, హితేష్ పోకర్, పాఠశాల నిర్వాహకులు బి.జగన్ మోహన్ రెడ్డి, సిబ్బంది సుహాసిని దేవి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లి కుటుంబానికి ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండల పరిధిలోని పెద్దతండా గ్రామానికి చెందిన చల్లపల్లి శ్రీను తల్లి రాధమ్మ ఇటీవల మృతిచెందింది. ఆ కుటుంబాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సోమవారం పరామర్శించారు. రాధమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబానికి తమ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకుడు పుచ్చకాయల కమలాకర్ ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...కల్లూరు మండలం చిన్నకోరుకొండ గ్రామ శివారు కిష్టారం గ్రామానికి చెందిన వి.వెంకటేశ్వర రావు (20) తన ద్విచక్రవాహనంపై ఆదివారం తన స్నేహితుల ఇంటికి మహబూబాబాద్ జిల్లా డోర్నకల్లు మండలం ముల్కలపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో మండలంలోని కాచిరాజుగూడెం గ్రామం వద్ద రోడ్డుపై ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొట్టాడు. దీంతో వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ యువకుడిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్స్పెక్టర్ రాజు తెలిపారు.

నేడు జిల్లాలో ఎంపీ రఘురాం రెడ్డి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మంగళవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 9:30 గంటల నుంచి నగరంలోని గట్టయ సెంటర్ వద్ద గల క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని పరిశీలించి.. అందుబాటులో ఉన్న మెరుగైన వైద్యసేవలు, ఇంకా కావాల్సిన సౌకర్యాల కోసం వివరాలు తెలుసుకుంటారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ, ప్రయివేట్ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌లో జరిగే దిశా సమావేశానికి ఎంపీ రఘురాం రెడ్డి హాజరవుతారు.

ఐద్వా రాష్ట్ర మహాసభలకు తరలిన మహిళలు

నవతెలంగాణ-వైరాటౌన్

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 21 నుంచి మూడు రోజుల పాటు కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగుతున్న సందర్భంగా ఐద్వా వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వైరా మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య నగర్, హనుమాన్ బజార్, గండగలపాడు, లాలాపురం, బ్రహ్మణపల్లి ఏరియాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు గుడిమెట్ల రజిత, మాజీ ఎంపీపీ బొంతు సమత, ఐద్వా వైరా పట్టణ కార్యదర్శి తోట కృష్ణవేణి మాట్లాడుతూ సమైక్య ఉద్యమం ద్వారానే మహిళలు హక్కులు సాధించడం జరిగిందని అన్నారు. భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా వైరా పట్టణ అధ్యక్షురాలు మాడపాటి సుజాత, చింతనిప్పు సులోచన, కంసాని మల్లికంబా, గుమ్మా వెంకట సాయిలక్ష్మి, వేదగిరి కళావతి, మాదినేని రజినీ, బత్తుల ప్రమీల, దేవళ్ళ మంగ, దూద్దుకూరి వీరమ్మ, సీతారామమ్మ, రాచ్చబంట్టి విజయ, చావా కళావతి, తాటి కష్ణ కుమారి, కట్టా లక్ష్మీ, జక్కంపూడి సరోజిని, చింతనిప్పు విజయలక్ష్మి, సంక్రాంతి సత్యశ్రీ, కోయినేని పద్మజ, ఉప్పునూరి మాదవి, గుడిమెట్ల వెంకట రమణ, కుదురుపాక నాగమణి, సుస్మిత, మాదవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో రమాదేవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - బోనకల్

బోనకల్ ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతల స్వీకరించిన రురావత్ రమాదేవిని మండల పరిధిలోని గోవిందాపురం ఏ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో గ్రామంలో ఆరు కోట్ల రూపాయల రోడ్డు విస్తరణ పనులను ఆమెకు కాంగ్రెస్ నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు భాగం పాపారావు, మండల నాయకులు భాగం నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షులు గండమాల రాయప్ప, భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు భాగం రాధాకష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

29 జీవోను రద్దు చేయాలి

నవతెలంగాణ-ఖమ్మం

గత ప్రభుత్వం ఉద్యోగాల నియామకంపై తెచ్చిన 55జీవోను రద్దు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 29 ఇచ్చిందని, దీంతో దళిత గిరిజన బలహీనవర్గాల రిజర్వేషన్ పరంగా పొందాల్సిన ఉద్యోగాలను అగ్రకులాలకు అప్పగించడానికే రూపొందించారని, తక్షణమే ఆ జీవో 29ని రద్దు చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముత్తమాల ప్రసాద్, నందిపాటి మనోహర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను 55 జీవో ప్రకారం నిర్వహించాలని కోరుతూ ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తుందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న 29 జీవో ప్రకారం జనరల్ కోటాలో ఎంపికైన రిజర్వ్ అభ్యర్థిని జనరల్ కోటాలో పరిగణించకుండా రిజర్వ్ కోటాలో పరిగణించడం వల్ల ఇతర రిజర్వుడ్ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముందని తెలిపారు. జీవో 29ను రద్దు చేసి గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా యూపీఎస్సీ తరహాలోనే ప్రిలిమ్స్ హాల్ టికెట్ నెంబర్లను ఆన్సర్ బుక్లెట్లపై ముద్రించి అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అభ్యర్థులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని సూచించారు. నిరుద్యోగుల పట్ల బీజేపీ మొసలి కన్నీరు ఆపి వారు 2కోట్ల ఉద్యోగాలు ఎప్పుడిస్తారో చెప్పాలన్నారు.

ఎంఈఓగా జుంకీలాల్ బాధ్యతలు

- కాంప్లెక్స్ హెడ్మాస్టర్లు అభినందనలు



నవతెలంగాణ-జూలూరుపాడు

మండల విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన జుంకీలాలను సోమవారం తన కార్యాలయంలో కాంప్లెక్స్ హెడ్మాస్టర్ శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జుంకీలాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, మండల విద్యా వ్యవస్థకు మంచి పేరు తీసుకురావడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు సంజీవరావు, కాకర్ల మంగ, వేణి గుండె పుడి, మీరా సాహెబ్, పాపకొల్లు లక్ష్మీ నరసయ్య, జూలూరుపాడు సుభద్రమ్మ పడమటి నర్సాపురం, పద్మజా, కస్తూర్బాలు పాల్గొన్నారు.

ఐద్వా రాష్ట్ర మహాసభల దృశ్య మాలిక



























మునగ సాగుపై రైతులకు అవగాహన

నవతెలంగాణ-టేకులపల్లి



మండలంలోని వెంకటయ్య తండా గ్రామంలో మునగ పంట సాగుపై ఏడీఏ లాల్ చంద్ సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో మాట్లాడారు. రైతులు ఒకే రకమైన పంటను ఏళ్ల తరబడి వేయడంతో భూమిలో సారవంతం తగ్గి, పంట దిగుబడి తగ్గుతుందని, మొక్కజొన్న, పత్తి, వరి పంటలకు ప్రత్యామ్నాయంగా మునగ పంటను సాగు చేయటం వలన, పెట్టుబడి సాయం కింద ఎన్ఆర్ఈజీఎస్ నుండి పెట్టుబడి పొంది, లాభాలు మాత్రం రైతులకు వస్తాయని తెలిపారు. మునగ గింజలను ఎండబెట్టి అమ్మడం ద్వారా నూనెను తీసి కాస్మోటిక్ కంపెనీలు కొంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ, ఎంపీడీవో రవీంద్రరావు, ఎంపీఓ గణేష్ గాంధీ, ఏపీవో శ్రీనివాస్, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మునగ సాగుతో రైతులకు లాభాలు : ఎంపీడీఓ

పినపాక : మునగ సాగుతో రైతులు లాభాలు పొందవచ్చని ఎంపీడీవో రామకృష్ణ సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని ఏడూళ్ళ బయ్యారం గ్రామపంచాయతీలో ఎంపీఓ కే.వెంకటేశ్వరరావుతో కలిసి మునగ సాగుపై అవగాహన సమావేశం సోమవారం నిర్వహించారు. అవగాహనా సమావేశంలో మునగ సాగు విధానాలు, మార్కెటింగ్ అంశాలను వివరించి, రైతులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. మండలంలో మునగ సాగుకు ఆసక్తి ఉన్న రైతులు ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అనంతరం తోగ్గుడెం, ఏడూళ్ళ బయ్యారం పల్లె ప్రకృతి వనాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శులను, సిబ్బంది పని తీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు జైపాల్ రెడ్డి, సాంబశివరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



మండలంలో శాశ్వత మార్కెట్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలి

- పత్తికి రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించాలి
- సీపీఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్ర బాబు

నవతెలంగాణ-జూలూరుపాడు

మండల కేంద్రంలో శాశ్వత మార్కెట్ యార్డ్‌ను నిర్మించాలని సీపీఐ వైరా నియోజకవర్గ కన్వీనర్ ఎర్ర బాబు డిమాండ్ చేశారు. సోమవారం యాస రోశయ్య, అధ్యక్షన మండల కౌన్సిల్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పత్తి కొనుగోలు ద్వారా, అత్యధిక ఆదాయం వస్తుందని, అధికారులు ప్రభుత్వం, వ్యాపారులకు కార్మికులకు కనీస సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్న నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, మార్కెట్ యార్డ్ కోసం సిపిఐ పెద్ద ఎత్తున గతంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారని, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, చంద్ర నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పత్తి పంటకు రూ.10వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి, ఎస్.కెనాగుల్ మీరా, సీపీఐ నాయకులు ఎల్లంకి మధు, వీరభద్రం, ఎస్.కె.చాంద్ పాషా, తూము కోటయ్య, సొసైటీ డైరెక్టర్ రజిని తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా...ఇద్దరు మృతి

నవతెలంగాణ-కొణిజర్ల

ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బోడియాతండా వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల ప్రకారం...వైరా పట్టణానికి చెందిన భూక్యా సైదులు (45) (ఓనర్ కం డ్రైవర్), బాణోత్ భీందేవ్ (50)తో కలిసి రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో భీందేవ్ కూతురు వద్ద ఐరన్ (సువ్వ) తెచ్చేందుకు భూక్యా సైదులు ట్రాక్టర్‌ని తీసుకొని వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో బోడియాతండా వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి సాగర్ కెనాల్ ప్రధాన కాలువలోకి ఫల్టీ కొట్టింది. దీంతో సైదులు, భీందేవ్ అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ జి.సూరజ్ తన సిబ్బందితో కలిసి జేసీబీ సహకరంతో ట్రాక్టర్‌ని, మృతదేహాలను బయటకు తీసి, ఖమ్మం జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని సీఐ సాగర్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్ అమలు చేయాలి

నవతెలంగాణ-కరకగూడెం

ఎస్సీ కులాల స్థానిక రిజర్వేషన్ ప్రభుత్వం అమలు చేయాలని షెడ్యూల్ కులాల హక్కుల పోరాటం సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొమ్మెర శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల తొలగించిన స్థానిక రిజర్వేషన్ తిరిగి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల హక్కుల పోరాటం జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎనగంటి కృపాకర్, రాష్ట్ర నాయకులు కండే రాములు, ఇనుముల వెంకటేశ్వర్లు, కత్తి బాలకృష్ణ, ఎక్స్ ఎంపీటీసీ బోడ, ముత్తయ్య, బొమ్మెర రాములు, కుమ్మరి సమ్మయ్య, తాటి గూడెం మాజీ ఉపసర్పంచ్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా రైతులందరికీ వేయాలి

- బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

నవతెలంగాణ-బూర్గంపాడు



తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన రైతు హామీలు నెరవేర్చాలని, వానా కాలం రైతు భరోసా ఎగ్గొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణా రెడ్డి మాట్లాడుతూ రైతాంగ వ్యతిరేక చర్యలు చేపడుతున్న కాంగ్రెస్ ద్వంద వైఖరి నశించాలని ఆయన అన్నారు. ఎటువంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జక్కం సుబ్రమణ్యం, మండల మైనారిటీ అధ్యక్షులు సాధిక్ పాషా, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు వలదాస్ సాలయ్య, సారపాక టౌన్ ప్రెసిడెంట్ శ్రీను, నియోజక వర్గ యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లాకోటి పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం : మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాక్షస పాలనతో రాష్ట్ర వ్యాప్తంగా రైతులను మోసం చేశారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల సోమయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పై రైతులు, బీఆర్ఎస్ నాయకులతో రోడ్డుపై బైఠాయించి నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఊకే రామనాథం, కొమరం విశ్వనాథం, వెంకటేశ్వర్లు, మలకం వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచులు సత్యనారయణ, ప్రశాంత్, చిరంజీవి, రంజిత్, కనకయ్య, ఎల్లగౌడ్, క్రిష్ణరావు, ముకుందా తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

నవతెలంగాణ-అశ్వారావుపేట

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం వేడుకలను అశ్వారావుపేట పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలసి సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పట్టణంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకోస విదినిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్ఓ ఎస్సై యయాతి రాజు, అదుపు ఎస్సై శివరామకృష్ణలతో పాటు విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఐద్వా రాష్ట్ర మహాసభలకు భారీగా తరలిన మహిళలు

నవతెలంగాణ-ఇల్లందు

కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఐద్వా 4వ రాష్ట్ర మహాసభలకు ఇల్లందు నుండి మహిళలు సోమవారం భారీగా తరలి వెళ్లారు. మహాసభలకు బయలుదేరే వాహనాలకు ఐద్వా జిల్లా నాయకులు తాళ్లూరి పద్మ కాంతమ్మ జెండాను ఊపి ప్రారంభించారు. అంతకుముందు ఐద్వా మండల కార్యదర్శి ఆలేటి సంధ్య జెండా ఆవిష్కరణను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలకు రక్షణ కల్పించాలని ఆమె అన్నారు.

బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులు

నవతెలంగాణ-కొత్తగూడెం లీగల్



తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శిగా గొల్లపుడి భానుమతి మరియు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగ పదోన్నతి పొందిన బత్తుల రామారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.



రైతు భరోసా ఇవ్వాలి

- ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- మహిళలకు ఇస్తామన్న రూ.2500 అందించాలి :

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

నవతెలంగాణ-మెదక్ టౌన్

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రైతు భరోసా పేరుతో రైతులకు పెట్టుబడి సాయం చేస్తామని వాగ్దానం చేసిందని, కానీ ఇప్పుడు దాన్ని అమలుచేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు మహిళలకు ఇస్తామన్న రూ.2500ల ఆర్థిక సాయాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రమైన మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో సోమవారం నిర్వహించిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు వాగ్దానాలు చేసిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి వైఫల్యం చెందారని అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీకి ఎక్కడా సంపూర్ణంగా జరగలేదని, అర్హత ఉండి కూడా మాఫీ కానీ రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని గొప్పలు చెబుతున్నా.. అదనంగా బస్సులు నడపకుండా వారిని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. అవినీతిని అరికట్టాలని, జల సంరక్షణ కోసం రాష్ట్రంలో ఏర్పాటయిన హైడ్రా దౌర్జన్యాలకు పాల్పడుతుందని తెలిపారు. మూసీ సుందరీకరణ పేరుతో దాని చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల్లో నివసిస్తున్న పేద, మధ్య ప్రజలను, కార్మికులను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అక్రమ కట్టడాల పేరుతో దౌర్జన్యంగా కూల్చేయడం దారుణమన్నారు. హైడ్రా పేరుతో నష్టపోయిన వారికి పునరావాసం కల్పించి ప్రభుత్వం వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మెదక్ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం, కార్యదర్శివర్గ సభ్యులు కే. మల్లేశం, బసవరాజు, కె.నరసమ్మ, ఎ. మహేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కె. నాగరాజు డి. మల్లేశం, బాలనర్సు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



జర్నలిస్టులపై దాడులు, అక్రమ కేసులు అరికట్టాలి

- సిరిసిల్లలో యూసుఫ్‌ను విడుదల చేయాలి
- ఇల్లెందులో సుదర్శన్‌ను ఆదుకోవాలి :

అదనపు డీజీపీకి టీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను, అక్రమ కేసుల బనాయింపును వెంటనే అరికట్టాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు రాష్ట్ర అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడీజీపీ) మహేష్ భగవత్‌ను కోరారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం,పిల్లి రాంచందర్, బండి విజయ్ కుమార్, గుడిగ రఘు, కార్యదర్శు లు బి రాజశేఖర్, గంద్ర నవీన్, ఎస్కే సలీమా, బిక్షపతి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ రమాదేవి తదితరులు హైదరాబాద్‌లో ఏడీజీపీని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో తమ యూనియన్ నేషనల్ కౌన్సిల్ మెంబర్, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ సభ్యుడైన జర్నలిస్టు మహ్మద్ యూసుఫ్ పై చందుర్తి పోలీసులు అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేశారని ఆరోపించారు. అతనికి సంబంధం లేని ఒక కేసులో ఆయన్ను ఇరికించారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి అక్రమ కేసు బనాయించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలనీ జర్నలిస్టు యూసుఫ్‌పై పెట్టిన కేసును ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులలో శనివారం రాత్రి జర్నలిస్టు సుదర్శన్‌పై దుండగులు దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారనీ, వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. రాష్ట్రంలో చాలా చోట్ల జర్నలిస్టులపై దాడులు పెరిగిపోతున్నాయనీ, మరోవైపు కొందరు పోలీసు అధికారులు కక్షపూరితంగా అక్రమ కేసులు పెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని వారు ఏడీజీపీని కోరారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే వివేకానంద

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ మర్యాద పూర్వకంగా కలిశారు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం ఎర్రవెల్లిలోని ఫాం హౌజ్‌లో కేసీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సైతం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు.

నారాయణ కళాశాలలో విద్యార్థిని ఆత్మహత్య

- బంధువులు, విద్యార్థి సంఘాల నాయకుల ధర్నా
- కళాశాల అద్దాలు, ఫర్నీచర్ ధ్వంసం

నవతెలంగాణ-దుండిగల్



దసరా సెలవుల అనంతరం కళాశాల హాస్టల్‌కు తిరిగి వచ్చిన కొన్ని గంటల వ్యవధిలోనే ఓ విద్యార్థిని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మేడ్చల్ జిల్లా బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. వివరాల్లోకెళ్తే మెదక్ జిల్లా జహీరాబాద్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మయ్య కుమార్తె అనూష నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని నారాయణ బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లింది. ఆదివారం మధ్యాహ్నం అనూషను తల్లిదండ్రులు కళాశాలలో వదిలి వెళ్లిపోయారు. ఇంటికి చేరుకున్న కొన్ని గంటల్లోనే వారికి కళాశాల యాజమాన్యం నుంచి ఫోన్ వచ్చింది. అనూష స్పృహ తప్పి పడి పోయిందని, త్వరగా కళాశాలకు రావాలని చెప్పారు. తల్లిదండ్రులు ఆదివారం రాత్రి సుమారు 7.30 గంటలకు కళాశాలకు వచ్చారు. అక్కడికొచ్చాక.. అనూష హాస్టల్ గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని యాజమాన్యం చెప్పింది. అయితే, అప్పటికే మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. దాంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము మధ్యాహ్నమే అమ్మాయిని పంపించామని, ఇంతలోనే ఎందుకు ఆత్మహత్య చేసుకుంటుం దని ప్రశ్నించారు. తాము వచ్చేలోపే ఎందుకు గాంధీకి తరలించారని నిలదీశారు. ఈ ఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ సోమవారం అనూష కుటుంబీకులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ క్రమంలో కొందరు కళాశాల అద్దాలు, కొంత ఫర్నీచర్ ధ్వంసం చేశారు. బాచుపల్లి పోలీసులు వారిని శాంతింపజేసి పూర్తి విచారణ చేపడతామని తెలిపారు. సీఐ జె.ఉపేందర్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగున్నరేండ్ల ప్రతిష్టంభనకు తెర

సరిహద్దుల్లో గస్తీపై, బలగాల ఉపసంహరణపై భారత్, చైనాల ఒప్పందం





న్యూఢిల్లీ : నాలుగున్నరేండ్ల ప్రతిష్టంభన అనంతరం భారత్, చైనాలు సోమవారం సరిహద్దుల నుంచి బలగాల ఉపసంహరణపై, గస్తీ ఏర్పాట్లపై ఒక ఒప్పందానికి వచ్చాయి. సరిహద్దులకు ఇరువైపులా దాదాపు 50వేల నుండి 60వేల వరకు బలగాలు మోహరించి వుంటాయి. వాటిని ఉపసంహరించుకోవాలని ఉభయ పక్షాలు అంగీకారానికి వచ్చినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి సోమవారం తెలిపారు.

భారత్, చైనా దౌత్యవేత్తలు, సైనిక ప్రతినిధులుల వివిధ వేదికలపై చర్చలు జరుపుతూ వచ్చారని, ఆ చర్చల ఫలితంగా భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో వాస్తవాధీన రేఖ పొడవునా గస్తీ ఏర్పాట్లపై ఒప్పందం కుదిరిందని మిస్రి చెప్పారు. ఇప్పటివరకు అపరిష్కృతంగా వున్న డెమ్‌చాక్, డెప్సాంగ్ ప్రాంతాలపై కూడా ఇప్పుడు ఒప్పందం కుదిరింది. దీంతో 2020 ఏప్రిల్ నుంచి రెండు దేశాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభన పరిష్కారమవుతుందని భావిస్తున్నారు.

ఒప్పందం వివరాలను విదేశాంగ శాఖ వెల్లడించలేదు. 2020కి ముందు నాటి యధాతథ స్థితికి వస్తుందా లేదా అనేది కూడా తెలియరాలేదు. ఇటీవల ఏర్పాటు చేసిన బఫర్‌జోన్‌లు గస్తీ ప్రయోజనాల కోసం కొనసాగుతాయా లేదా అనేది కూడా తెలియరాలేదు. చర్చించిన అంశాలపై ఒప్పందం కుదిరిందని మాత్రమే మిస్రి చెప్పారు.

మంగళవారం జరగనున్న బ్రిక్స్ సదస్సు కోసం భారత ప్రధాని మోడీ రష్యా వెళ్లనున్న నేపథ్యంలో మిస్రి ప్రకటన వెలువడింది. ఈ సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా హాజరు కానున్నారు. బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో మోడీ, జిన్‌పింగ్ భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందువల్లే ఈ ఒప్పందం వివరాలను ఇప్పుడు ప్రకటించినట్లు కనిపిస్తోంది. సమావేశం గురించి మిస్రి ధ్రువీకరించలేదు. కజన్‌లో పలు ద్వైపాక్షిక సమావేశాలపై ప్రభుత్వం కసరత్తు జరుపుతోందని మాత్రమే చెప్పారు. గతంలో చైనాలో భారత రాయబారిగా చేసిన మిస్రి ఈ చర్చల్లో కీలక పాత్ర పోషించారు.

తాజా ఒప్పందంతో చైనాతో బలగాల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిందని చెప్పగలమని విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించారు. 2020 తర్వాత వివిధ కారణాల రీత్యా ఉభయులం నిషేధించిన ప్రాంతాలు కొన్ని వున్నాయని, తాజా అవగాహనతో ఆ ప్రాంతాల్లో గస్తీకి వీలు కుదిరిందని చెప్పారు. దీంతో 2020కి ముందు ఎక్కడైతే తాము గస్తీ నిర్వహించామో ఇప్పుడు అక్కడ గస్తీకి అవకాశం లభించిందన్నారు.

బీఎస్సీ అగ్రికల్చర్‌లో అదనంగా రెండు వందల సీట్లు

- ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రస్తుత విద్యా సంవత్సరం (2024-25)లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కోటా కింద అదనంగా 200 సీట్లను బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సులో పెంచుతున్నట్టు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వెల్లడించారు. సోమవారం హైదరాబాద్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీలో ఆయన బాధ్యతలు స్వీకరించినంతరం సీట్ల పెంపుదలపై ప్రకటన చేశారు. ప్రస్తుతం సాధారణ కేటగిరీలో 615 సీట్లు, ప్రత్యేక ఫీజుతో సుమారు 227 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 200 అదనపు సీట్లను కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేస్తామన్నారు. ప్రస్తుతం ప్రత్యేక కోటాలో ఉన్న బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్ కోర్సుకు నాలుగేండ్లకు కలిపి మొత్తం పది లక్షల రూపాయలు ఫీజు ఉండగా దానిని రూ.5 లక్షలకు తగ్గించినట్టు తెలిపారు. అలాగే ప్రవేశ సమయంలో ఒకేసారి మూడు లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉండగా దాన్ని తగ్గించి రూ. 65వేలు చెల్లించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. తద్వారా విద్యార్థులకు వెసులుబాటు కల్పించామని వివరించారు. వ్యవసాయ విద్యకు పెరుగుతున్న డిమాండ్‌ను ఆసరాగా తీసుకుని సాంకేతికపరమైన గుర్తింపులేని కొన్ని ప్రయివేటు సంస్థలు మాయమాటలు చెప్పి లక్షల్లో ఫీజు వసూలు చేస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ డిగ్రీ కోర్సులను నిర్వహించేందుకు కావలసిన కనీస వసతులు, సిబ్బందిని నియమించడం లేదని గుర్తు చేశారు. ఇలాంటి గుర్తింపు లేని సంస్థల్లో విద్యార్థులను చేర్చకూడదని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో ప్రవేశపెడుతున్న వివిధ కోర్సులతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలకి సంబంధించిన స్వల్పకాలిక కోర్సులను కూడా రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ప్రవేశపెట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల్లో ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలు లేని నిజామాబాద్, నల్లగొండ జిల్లాల్లో కూడా నూతనంగా వ్యవసాయ కళాశాలలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతామన్నారు.

రూ.21.56 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు

డిసెంబర్ 9లోగా రైతులందరికీ రుణమాఫీ..

- పొలంబాట కార్యక్రమంలో పొలాలకు రోడ్లు ఏర్పాటు
- విద్యార్థులు నూతన పరిజ్ఞానాన్ని నేర్చుకోవాలి :మంత్రి దనసరి అనసూయ సీతక్క

నవతెలంగాణ-ములుగు



ములుగు నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులకు సీఆర్ఆర్, ఎంఆర్ఆర్ కోటాలో రూ.21.56 కోట్ల నిధులను మంజూరు చేసినట్టు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 9లోగా రూ.2 లక్షల రుణమాఫీని రైతులందరికీ మాఫీ చేస్తామని తెలిపారు. మౌరిటెక్ ఐటీ సంస్థ సౌజన్యంతో పాటు సీఎస్ఆర్ నిధులతో జిల్లాలోని వెంకటాపూర్ జెడ్‌పీహెచ్ఎస్‌లో కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం గోవిందరావుపేట, ఎస్ఎస్ తాడ్వాయి మండలాల్లో రోడ్ల మరమత్తు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థులు నూతన పరిజ్ఞాన విద్యను నేర్చుకోవడానికి ప్రయత్నించాలని అన్నారు. ములుగు జిల్లాలో 176 మందికి ఉపాధ్యాయ పోస్టులు ఇచ్చామని, ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించడానికి సౌకర్యాల కల్పనకు కృషిచేస్తున్నట్టు తెలిపారు. రైతులు ఇబ్బందులకు గురికాకుండా పంట పొలాలకు వెళ్లడానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయడంతో పాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు రోడ్లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాల్లో పాఠశాలలు, ఆస్పత్రుల భవనాల నిర్మాణం కోసం అనుమతి ఇవ్వలేదని, దాంతో రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా కంటైనర్ పాఠశాల, ఆస్పత్రిని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఇంచర్ల గ్రామ సమీపంలో రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. ములుగు నియోజకవర్గం 75 శాతం అటవీ ప్రాంతం కావడంతో అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం కలుగుతున్నదని, దీనిపై తాను స్వయంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా విద్యా వైద్యం మెరుగుపరచడంతో పాటు రోడ్డు సౌకర్యాలకు ప్రత్యేక కార్యచరణ రూపొందించినట్టు చెప్పారు. అనంతరం గోవిందరావు పేటలో 13మంది లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను, తాడ్వాయి రైతు వేదికలో 35 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీరాజ్ ఈఈ అజయ్ కుమార్, డీఈఓ పాణిని, మౌరిటెక్ ఐటీ కంపెనీ ప్రతినిధులు నందమోహన్, మనోజ్ కుమార్, హెడ్మాస్టర్ రాధిక, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు ఫరీద బేగం, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థినీ, విద్యార్థులు, కల్యాణలక్ష్మి, షాదిముబారక్ పొందిన లబ్దిదారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగాలు

- తొలి విడతగా 133 కుటుంబాలకు అవకాశం
- వారం రోజుల పాటు దరఖాస్తుల స్వీకరణ : సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి



నవతెలంగాణ- మిర్యాలగూడ

యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్వాసితుల కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగాలు కల్పించే ప్రక్రియ చేపట్టినట్టు మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి తెలిపారు. సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ కార్యాలయ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సబ్‌కలెక్టర్ మాట్లాడారు. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామం వద్ద పవర్ ప్లాంట్ ఏర్పాటుతో 169 కుటుంబాలు ఇండ్లు కోల్పోయాయని, ఆయా కుటుంబాలకు పరిహారం అందజేయడంతోపాటు రిహాబిటేషన్ సెంటర్లకు తరలించామని అన్నారు. భూములు, ఇండ్లు కోల్పోయిన కుటుంబాల్లో ఒకరికి చొప్పున ఉద్యోగావకాశం కల్పించే విషయంలో తొలుత ఇండ్లు కోల్పోయిన వారికి అవకాశం కల్పించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇండ్లు కోల్పో యిన వారు 169 మంది ఉండగా.. తొలి విడతగా 133 కుటుంబాల నుంచి ఒక్కొక్కరికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కుటుంబంలో ఎవరికి ఉద్యోగం ఇవ్వాలో కుటుంబ సభ్యులందరి ఏకాభిప్రాయ అంగీకార పత్రంతోపాటు విద్యార్హతల ధ్రువీకరణ పత్రాలను ఈనెల 22 నుంచి వారం రోజులపాటు దామరచర్ల తహసీల్దార్‌కు అందజేయాలని సూచించారు. విద్యార్హతలను బట్టి యాదాద్రి పవర్‌ప్లాంట్ అధికారులు ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు. ఇండ్లు కోల్పోయిన మిగిలిన నిర్వాసితులకు రెండో విడత ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. తదుపరి భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని వివరించారు. ఈ సమావేశంలో యాదాద్రి పవర్ ప్లాంట్ ఈఈ జయరాంరెడ్డి, మిర్యాలగూడ దామరచర్ల మండలాల తహసీల్దార్లు హరిబాబు, జవహర్‌లాల్, కార్యాలయ డీఏఓ శ్రీనివాస్‌శర్మ పాల్గొన్నారు.

వానాకాలం, యాసంగి సీజన్లకు రైతు భరోసా ఇవ్వాలి

తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



ఎన్నికల్లో కాంగ్రెస్ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం వానాకాలం, యాసంగి సీజన్లకు రైతు భరోసా ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ డిమాండ్ చేశారు. రూ.2 లక్షల లోపు రుణమాఫీ, ధాన్యానికి బోనస్ హామీలను అమలు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో రైతాంగం ఆందోళన చెందుతోందని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతాంగానికి ద్రోహం చేసిందని విమర్శించారు. వానాకాలం పంటల సీజన్ ముగిసినా రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ వంటివి కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అమలు చేయలేదన్నారు. దీంతో రైతులు అప్పులు తెచ్చి సాగు చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తేనే రైతుల ఆత్మహత్యలు ఆగుతాయన్నారు. ఇప్పటి వరకు సగం మందికి మాత్రమే రుణమాఫీ అయిందనీ, ఇంకా సగం మంది రైతులకు మాఫీ కాలేదన్నారు. వానాకాలం సీజన్‌కు రైతు భరోసా డబ్బులు రైతుల ఖాతాలో జమ కాలేదని గుర్తు చేశారు. వరి రూ.500, మక్కజొన్న రూ.330, కందులు రూ.400, సోయ రూ.450, పత్తి రూ.475, చెరుకు రూ.850, జొన్నలు రూ.308 క్వింటాల్ పంటలకు బోనస్ కలిపి ధరలు అమలు చేస్తామని మ్యానిఫెస్టోలో చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సన్న వడ్లతోపాటు దొడ్డు వడ్లకు కూడా రూ. 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహ్మారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, మాదినేని రమేష్, వీరెపల్లి వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులు లెల్లెల బాలక్రిష్ణ, కందాల ప్రమీల, మాటూరి బాల్‌రాజ్‌గౌడ్, యం.డి గఫూర్ పాష, శెట్టిపల్లి సత్తిరెడ్డి, యం.శ్రీనివాస్‌లు, పల్లపు వెంకటేష్, యం.డి సర్దార్, చింతల రజినీకాంత్, భూక్య చందూనాయక్, పరమేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ బీభత్సం

- 33మంది పాలస్తీనియన్లు మృతి
- బీరుట్ శివార్లపై విరుచుకుపడిన క్షిపణులు



గాజా, బీరుట్ : సోమవారం తెల్లవారు జాము నుంచి గాజావ్యాప్తంగా ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 33మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 18మంది జాబాలియా శరణార్ధ శిబిరానికి చెందిన వారే. మరోవైపు ఉత్తర గాజాలో ప్రజల బలవంతపు తరలింపు కొనసాగుతోంది. ప్రజలను బలవంతంగా అక్కడ నుండి తరలిపోయేలా ఆదేశాలు జారీ చేయడం, అలాగే మారణహోమం కొనసాగించడం ద్వారా ఉత్తర ప్రాంతాన్ని పూర్తిగా నిర్వీర్యం చేయాలని ఇజ్రాయిల్ ప్రయత్నిస్తోందంటూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయం ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలావుండగా, బీరుట్‌లోని దక్షిణ శివార్లలో ఇజ్రాయిల్ 12 క్షిపణులతో దాడి జరిపింది. శనివారం ఇలాగే జరిపిన దాడిలో 16మంది మరణించారు. తాజా దాడిలో ఎంతమంది చనిపోయారో ఇంకా వివరాలు తెలియరాలేదు. దక్షిణ లెబనాన్‌లో శాంతి పరిరక్షక దళాలు ఉపయోగించే టవర్‌ను ఇజ్రాయిల్ ఆర్మీ బుల్డోజర్లు నేలమట్టం చేశాయి. లెబనాన్‌లో ఐక్యరాజ్య సమితి తాత్కాలిక బలగాలు (యుఎన్ఐఎఫ్ఐఎల్)పై ఇది తాజా దాడి అని యూఎన్ పేర్కొంది. గాజాలో ఇప్పటివరకు 42,603మంది మరణించగా, 99,795మంది గాయపడ్డారు. ఉత్తర గాజాలో పరిస్థితి బీభత్సంగా వుందని యుఎన్ఆర్‌డబ్ల్యుఎ అధికారి వ్యాఖ్యానించారు. అనూహ్యమైన, భయానకమైన పరిస్థితులను వారు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత 12మాసాల నుంచి నిరంతరంగా కొనసాగుతున్న దాడులు, పదేపదే ఒకచోట నుండి మరోచోటకు తరలింపులు, ఖాళీ చేయడం, వరుస దాడుల కారణంగా అస్తవ్యస్థమైన ప్రజా జీవనం, ప్రాణ, ఆస్తి నష్టం, విధ్వంసం, ఆహారం, నీరు లేని దారుణమైన పరిస్థితులతో ప్రజలు అల్లాడిపోతున్నారని ఐక్యరాజ్య సమితి పాలస్తీనా శరణార్థుల ప్రణాళికా విభాగం డైరెక్టర్ శామ్ రోస్ వ్యాఖ్యానించారు. గత రెండు వారాల్లో పరిస్థితులు మరీ దారుణంగా మారాయన్నారు. గాజాలో దక్షిణ, ఉత్తర, సెంట్రల్ ప్రాంతాలన్నీ లక్ష్యాలుగా మారాయన్నారు. బలవంతంగా ఇళ్లనుండి, శిబిరాల నుండి ప్రజలను ఖాళీ చేయిస్తున్నారని అన్నారు. ఒకపక్క అటూ ఇటూ కదలకుండా వీల్లేని పరిస్థితులను సృష్టిస్తూ మరోపక్క శరణార్ధ శిబిరాలపై వరుస దాడులకు దిగడంతో ప్రజలకు ఏం చేయాలో పాలుపోని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 17 రోజుల పాటు ఆహారం, నీరు, మందులు, సహాయం లేకుండా దుర్భర పరిస్థితుల్లో జీవించాల్సి వచ్చిందని డేర్ అల్ బాలాహ్‌కి చెందిన హింద్ ఖౌదరి తెలిపారు. ఉత్తర గాజాకు ఏమీ రానివ్వని పరిస్థితి నెలకొందన్నారు. ఇంత దారుణాలు నెలకొన్న పాలస్తీనియన్లు తమ పోరాటాన్ని, ప్రతిఘటనను ఆపలేదన్నారు. ఎక్కడా సురక్షితమైన ప్రాంతమంటూ లేకుండా పోయిందన్నారు. దక్షిణ లెబనాన్ గ్రామంలో ఇజ్రాయిల్ ఆర్మీ ఇండ్లను పేల్చివేసింది. భీకరంగా దాడులు జరుగుతున్నాయని, ఆ ప్రాంతంలో ముందుకు చొచ్చుకుపోవడానికి ఇజ్రాయిల్ బలగాలు ప్రయత్నిస్తున్నాయని లెబనాన్ అధికార వార్తా సంస్థ తెలిపింది. గ్రామ శివార్లలో ఇజ్రాయిల్ ట్యాంకులు కనిపిస్తున్నాయని పేర్కొంది. ఇదిలావుండగా, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మధ్య ప్రాచ్యంలో పర్యటన ప్రారంభించారు. గాజాలో దాడులను ఆరంభించిన తర్వాత ఇది 11వసారి పర్యటించడం. ఇజ్రాయిల్ సహా ఇతర ప్రాంతీయ నేతలతో ఆయన చర్చలు జరుపుతారు. కాల్పుల విరమణ ప్రాముఖ్యతను తెలియజేస్తారని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది.



ఆరోగ్యమిత్రల వేతనాలు పెంచాలి

క్యాడర్ మార్పు చేయాలి : మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఆరోగ్యమిత్రల వేతనాలను వెంటనే పెంచాలనీ, క్యాడర్‌ను మార్పు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ- సీఐటీయూ అనుబంధం) రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, ఆరోగ్యశ్రీ రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య, ఆరోగ్యశ్రీ హైదరాబాద్ అధ్యక్షులు టి.రాజు తదితరులు మంత్రి దామోదర రాజనర్సింహకు, ట్రస్ట్ సీఈవోకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి ఆదేశాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సంచాలకులు, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో (ఎఫ్ఏసీ) ఆర్.వి.కర్ణన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆరోగ్యమిత్రల క్యాటగిరీలను డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ (డీపీఓ) క్యాటగిరీలోకి మార్చాలనీ, వేతనం రూ.22,750కు పెంచాలని కోరినా ప్రభుత్వ స్పందన ఆలస్యం కావడంతో ఆగస్టు 6న సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మెలోకి వెళ్లగా, సెప్టెంబర్ 20న ప్రభుత్వం హామీ పత్రం ఇచ్చిందని గుర్తుచేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ క్యాడర్ లోకి మార్పుతో పాటు వేతనం రూ.19,500 పెంచుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి అణలు, సమ్మె చేసిన మూడు రోజులు వేతనం చెల్లించేందుకు హామీ ఇచ్చారని తెలిపారు. అదే విధంగా సమ్మె నోటీస్‌లోని మిగిలిన డిమాండ్లు ట్రస్టు ఉద్యోగులుగా గుర్తించడం, ఎనిమిది గంటల పనిదినం అమలు, ఎఫ్ఆర్ఎస్ సమస్య, హెల్త్ కార్డుల సమస్య పరిష్కారం, చనిపోయిన కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాల పట్ల చర్చల సమయంలో సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో అంగీకరించిన అంశాలను అమలు చేయాలని వారు కర్ణన్‌కు విజ్ఞప్తి చేశారు.

జీవో 29 రద్దుకు చొరవ చూపండి

- గవర్నర్‌కు బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


జీవో 29 రద్దుకు చొరవ చూపాలని బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు విజ్ఞప్తి చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆ సంఘం నేతలు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఐఏఎస్ అధికారి చిరంజీవులు తదితరులు గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. జీవో 29 వల్ల బీసీలకు జరుగుతున్న అన్యాయంపై ఆయనకు వివరిం చారు. ఈ జీవో వల్ల అగ్రవర్ణాలు ఉద్యోగాల్లో లబ్దిపొందుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలకు అన్యాయం చేసే జీవో 29ను రద్దు చేసిన తర్వాతే గ్రూప్-1 పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు

త్వరలో సమగ్ర కుల గణన సర్వే

- బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో త్వరలో సమగ్ర కుల గణన సర్వే నిర్వహించనున్నట్టు బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్ తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి వచ్చే నెల 8 వరకు ఉమ్మడి జిల్లాల్లో బీసీ కమిషన్ పర్యటిస్తుందని చెప్పారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో కులాల వారీగా సమగ్ర వివరాలు సేకరిస్తామని తెలిపారు. సమగ్ర సర్వే షెడ్యూల్‌కు సంబంధించిన వివరాలను రాజ్‌భవన్ లో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి వివరించినట్టు పేర్కొన్నారు. అలాగే కమిషన్ ఇప్పటి వరకు చేపట్టిన కార్యక్రమాలు, సమగ్రంగా సేకరించిన కులాల వివరాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన వెల్లడించారు.



ఇటీవల దక్షిణాఫ్రికాలో జరిగిన కామన్‌వెల్త్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో 'స్ట్రాంగ్ ఉమెన్'గా నిలిచారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా నాలుగు బంగారు పతకాలను గెలుచుకుని ఔరా అని పించారు. పాల్గొన్న పోటీలన్నింటిలోనూ పతకాలను గెల్చుకుని 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఇండియా'గా ప్రపంచానికి పరిచయమయ్యారు. ఆమే **షేక్.సాదియా అల్మాస్**. ఇప్పటివరకూ అంతర్జాతీయ స్థాయిలో 11, జాతీయస్థాయిలో 20 వరకూ పతకాలు గెలుచుకుని తన జైత్రయాత్రను కొనసాగిస్తున్నారు. ఇక రాష్ట్రస్థాయి పతకాలకు లెక్కే లేదు. మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే ప్రపంచ చాంపియన్‌గా రాణిస్తానని ఆత్మవిశ్వాసంతో చెబుతున్న ఆమె పరిచయం నేటి మానవిలో...

పోటీపడితే పతకం పట్టాల్సిందే

గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణంలోని ఇస్లాంపేట (తెనాలిరోడ్డు)కు చెందిన సాదియా అల్మాస్ 2002, అక్టోబర్ 27న పుట్టారు. తల్లి రిజ్వానా, తండ్రి షేక్ సందాని. సాధియ ప్రస్తుతం కెఎల్ యూనివర్శిటీలో ఎంబీఎ చదువుతున్నారు. సివిల్ సర్వీసెస్‌లో రాణించాలనే లక్ష్యంతో కెఎల్ యూనివర్శిటీలో బీఏ అభ్యసించారు. ప్రాథమిక విద్య మంగళగిరి అరవింద పబ్లిక్ స్కూల్లో, ఇంటర్మీడియట్ విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వరి సిద్ధార్థ మహిళా కళాశాలలో, మంగళగిరిలోని వీజెలో పూర్తిచేశారు.

తండ్రి ప్రోత్సాహంతో

చిన్నప్పటి నుంచి సాదియాకు ఆటలంటే ఎంతో ఇష్టం. కబడ్డీ, వెయిట్‌లిఫ్టింగ్ వంటి ఆటల్లో ప్రావీణ్యం చూపించేవారు. ఇది గమనించిన తల్లిదండ్రులు ఆటల పోటీల్లో ప్రోత్సహించారు. సాదియా తండ్రి కూడా పవర్ లిఫ్టర్స్. సందాని పవర్ లిఫ్టింగ్ అకాడమీ ఏర్పాటు చేసి 25 ఏండ్లుగా ఎంతోమందికి ఉచితంగా పవర్‌లిఫ్టింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్‌కు కార్యదర్శిగా ఉన్న తండ్రి ప్రోత్సాహంతో సాదియా పవర్‌లిఫ్టింగ్ వైపు ఆకర్షితులయ్యారు. మొదట గుంటూరు జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. పతకాలు సాధించటంతో ఆమెలో ఆత్మ విశ్వాసం పెరిగింది. తండ్రి ఆమెను జిల్లా, రాష్ట్రస్థాయిపోటీల్లో ప్రతిభ చూపేలా ప్రోత్సహించారు. అలా జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారిణిగా ఎదిగారు. ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నాయకులు కూడా తమవంతుగా ప్రోత్సాహాన్ని అందించాయి. దీంతో సాదియా వెనుతిరిగి చూడకుండా మొక్కవోని దీక్షతో నేర్చుకున్నారు. ప్రస్తుతం పతకాల పంట పండిస్తున్నారు. ఆర్థిక కారణంగా విదేశీ పోటీలకు వెళ్లటానికి సాదియా ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆమెకు రూ.3 లక్షల వరకూ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సాదియా అక్క షేక్.ఆసియా కూడా పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారిణే.

స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ కామన్‌వెల్త్‌గా...

దక్షిణాఫ్రికా సన్‌సిటీలో ఈ నెల 4 నుండి 13వ తేదీ వరకు జరిగిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ సబ్ జూనియర్, జూనియర్ పోటీల్లో సాదియా 57 కిలోల అండర్ జూనియర్ విభాగంలో స్క్వాట్ -185 కిలోల పవర్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం, బెంచ్‌ప్రెస్ 95 కిలోలు, డెడ్‌లిఫ్ట్ 180 కిలోలు ఓవరాల్‌గా 460 కిలోలు లిఫ్టింగ్‌లో బంగారు పతకాలు సాధించారు. ప్రపంచం మొత్తం గర్వించేలా అక్కడి పోటీలు నిర్వహించే ప్రతినిధులు ఆమెను 'కామన్‌వెల్త్ స్ట్రాంగ్ ఉమెన్'గా ప్రకటించారు. అనంతరం 'స్ట్రాంగ్ గర్ల్ ఆఫ్ ఇండియా' అంటూ పొడగ్తలతో ముంచెత్తారు.



వరల్డ్ చాంపియన్‌గా...

మాల్టా దేశంలో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 8 వరకు జరిగిన జూనియర్ వరల్డ్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో సాదియా 57 కేజీల విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా గోల్డ్ మెడల్ సాధించారు. స్క్వాట్ 190 కేజీలు, బెంచ్ ప్రెస్ 97.5 కేజీలు, డెడ్ లిఫ్ట్ 175 కేజీలు మొత్తంగా 462.5 కేజీల బరువు ఎత్తారు. బంగారు పతకం సాధించటం ద్వారా భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారు. యుఎఇలోని షార్జాలో 2023 ఆగస్టు 17 నుంచి 21 వరకు జరిగిన 'ఆసియన్ యూనివర్శిటీ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్‌లో చాంపియన్‌షిప్‌లో మొదటిస్థానంలో నిలిచి మొత్తం నాలుగు బంగారు పతకాలను గెలుచుకున్నారు. స్క్వాట్ 142.5 కేజీలు, బెంచ్‌ప్రెస్ 62.5 కేజీలు, డెడ్‌లిఫ్ట్ 135 కేజీలు మొత్తంగా 340 కేజీల బరువు ఎత్తి మొదటిస్థానంలో నిలిచారు. (స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆసియన్ యూనివర్శిటీస్)గా ప్రకటించారు.

> **దేశ గౌరవాన్ని పెంచుతా**
>
> పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌గా నేను ఈ స్థాయిలో రాణించటానికి మొదటగా కోచ్‌గా ఉన్న నా తండ్రి షేక్ సందాని ప్రోత్సాహమే కారణం. అలాగే నా కుటుంబ సభ్యులు, స్నేహితుల ప్రోత్సాహం ఎంతో ఉంది. పవర్‌లిఫ్టింగ్ ఏపీ, గుంటూరు జిల్లా అసోసియేషన్ల సహకారం మరువలేనిది. మంత్రి నారా లోకేష్, రోటరీ క్లబ్‌లు కూడా సహకరించాయి. భవిష్యత్తులో దేశానికి మరిన్ని పతకాలు సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తాను. జూనియర్ వరల్డ్‌లో రెండుసార్లు సత్తా చాటా. సీనియర్ వరల్డ్‌లో పతకాలు సాధిస్తా. వరల్డ్ గేమ్స్‌లో పతకాలు సాధించటమే నా లక్ష్యం.
>
> - షేక్.సాదియా



పతకాల వర్షం...

కేరళలోని అలప్పుజలో 2023 మే 1 నుంచి 6 వరకూ జరిగిన 'ఆసియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మొదటిస్థానంలో నిలిచి 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ ఆసియా'గా నిలిచారు. న్యూజిలాండ్‌లోని ఆక్‌ల్యాండ్‌లో 2022 నవంబర్ 24 నుంచి డిసెంబర్ 4 వరకు జరిగిన 'కామన్ వెల్త్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్'లోనూ మొదటిస్థానంలో నిలిచి నాలుగు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. 'స్ట్రాంగ్ ఉమెన్ ఆఫ్ కామన్‌వెల్త్'గా టైటిల్‌ను గెల్చుకున్నారు. టర్కీలోని ఇస్తాంబుల్‌లో 2022 ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 4 వరకు జరిగిన 'వరల్డ్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్'లోనూ ద్వితీయస్థానంలో నిలిచారు. ఒక గోల్డ్, రెండు సిల్వర్, రెండు బ్రాంజ్ మెడళ్లను అందుకున్నారు. 2022 జూన్ 17 నుంచి 21 వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగిన 'ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్'లోనూ మొదటి స్థానంలో నిలిచి నాలుగుబంగారు పతకాలను గెల్చుకున్నారు. 2021 టర్కీలోని ఇస్లాంబుల్‌లో జరిగిన 'ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్'లో మొదటిస్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలను గెల్చుకున్నారు. 2018 మేలో రాజస్థాన్‌లో జరిగిన 'ఏషియన్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లోనూ మొదటిస్థానంలో నిలిచారు. స్లొవేనియాలో 2023 నవంబర్‌లో జరిగిన 'వరల్డ్ యూనివర్శిటీ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్'లోనూ పాల్గొని బహుమతులు గెల్చుకున్నారు.

-యడవల్లి శ్రీనివాసరావు

పిగ్మెంటేషన్ సమస్యా?

రకరకాల కారణాల వల్ల చాలామందికి ముఖంపై పిగ్మెంటేషన్ వస్తుంటుంది. దానికి క్రీములు, ఇతర మందులు వాడే బదులు ఇంటి చిట్కాలతో ఈ సమస్య నుంచి విముక్తి పొందవచ్చు.

బంగాళా దుంపతో..

ఒక బంగాళా దుంపని తురిమి అందులో పావు కప్పు నిమ్మరసం కలపండి. పిగ్మెంటేషన్ ఎక్కువ ఉన్న చోట ఈ మాస్కుని వేసుకుని అరగంట ఆగి చల్లని నీటితో కడిగేయాలి. ఇలా రోజుకి రెండుసార్లు చేస్తే తొందరగా



నయమవుతుంది.

నిమ్మరసం, తేనె..

రెండు టేబుల్ స్పూన్ల తేనెలో రెండు టేబుల్ స్పూన్ల నిమ్మరసం కలిపి అవసరమున్న చోట ఈ మిశ్రమాన్ని పూతలా వేసుకోవాలి. తర్వాత గోరు వెచ్చని నీటిలో మెత్తటి బట్ట ముంచి పిండేయాలి. ఆ బట్టని ఈ మిశ్రమం అప్లై చేసిన చోట కవర్ చేసినట్లుగా వేయండి. ఇరవైనిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా వారానికి ఒకసారి చేయాలి.

యాపిల్ సైడర్ వెనిగర్..

అర కప్పు యాపిల్ సైడార్ వెనిగర్ లో అర కప్పు నీరు కలపండి. పిగ్మెంటేషన్ ఉన్న చోట ఈ నీటిని పోయండి. నాలుగైదు నిమిషాల తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. ఇలా రోజుకి రెండు సార్లు నెల రోజుల పాటూ చేయండి.

పసుపు, పాలు..

ఒక బౌల్‌లో ఐదారు టీ స్పూన్ల పసుపు తీసుకుని అందులో తగినంత పాలు పోసి మెత్తటి పేస్ట్ లా చేయండి. పిగ్మెంటేషన్ ఉన్నచోట ఈ పేస్ట్ అప్లై చేసి ఐదునిమిషాలు గుండ్రంగా మసాజ్ చేయండి. ఆరిన తరువాత గోరు వెచ్చని నీటితో కడిగేయండి. రోజూ స్నానానికి ముందు ఒకసారి ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.

సోషలిస్టు,సెక్యులర్

రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణంలోనే కీలకం

(మొదటిపేజి తరువాయి)

వ్యాఖ్యానించారు.మరో న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ తన వాదనలు వినిపిస్తూ.. ఈ సవరణ అమల్లోకి వచ్చేనాటికి అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ దేశంలో ఎమర్జెన్సీ విధించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా స్పందిస్తూ "మీరు భారత్ లౌకిక దేశంగా ఉండాలను కోవడం లేదా..?" అని సూటిగా ప్రశ్నించారు. దీనిపై అడ్వకేట్ జైన్ బదులిస్తూ "భారత్ లౌకిక దేశంగా ఉండ కూడదని మేం అనడం లేదు. ఆ సవరణను మాత్రమే సవాలు చేశాం" అని పేర్కొన్నారు. పీఠికలో ఈ రెండు పదాలు చేర్చడం వల్ల పాండోరా బాక్స్‌ను తెరిచినట్టైందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ప్రజాస్వామ్యం అనే పదాన్ని కూడా తొలగించవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.ఇక బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి తన వాదనలు వినిపిస్తూ.. పీఠికలో 26 నవంబర్ 1949 తేదీ ఉండటం తప్పని నిరూపిస్తానని పేర్కొన్నారు. " మనకు రాజ్యాంగ పీఠిక రెండు భాగాలుగా ఉండొచ్చు. కానీ, సెక్యులరిజం, సోషలిజం పదాలు చేర్చడానికి భారత ప్రజలు అంగీకరించారని చెప్పడం సరికాదు. పీఠిక రెండు భాగాల్లో ఒక దానిని తేదీతో, మరో దానిని తేదీ లేకుండా ఉంచవచ్చు" అని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ ఖన్నా స్పందిస్తూ.. పిటిషనర్లు సంబంధిత పత్రాలను సమర్పిస్తే పరిశీలిస్తామని చెప్పారు. నోటీసులు జారీ చేయడానికి మాత్రం బెంచ్ అంగీకరించలేదు. తదుపరి వాదనలను నవంబర్ 18వ తేదీన వింటామని న్యాయమూర్తులు పేర్కొన్నారు.

మదార్సాల విషయంలో ఎన్సీపీసీఆర్ సిఫారసుపై సుప్రీం స్టే

గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని, మదర్సా బోర్డులకు రాష్ట్రాలు నిధులివ్వొద్దని రాష్ట్రాలను కోరుతూ బాలల హక్కుల సంఘం చేసిన సిఫారసులపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మదార్సాల్లో విద్యాహక్కు చట్టాన్ని పాటించట్లేదని, అక్కడ బోధించే విద్య.. విద్యార్థులకు ఎందుకూ పనికిరాదని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపింది.

కాగా ఈ ఏడాది జూన్ 7, జూన్ 25 తేదీల్లో గుర్తింపు లేని మదర్సాల విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు తరలించాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సూచించడంతో ఉత్తరప్రదేశ్, త్రిపుర ప్రభుత్వాలు వీటిని అమలు చేయడానికి ఆదేశాలు జారీ చేశాయి. దాంతో ఈ ప్రభుత్వాల చర్యలను వ్యతిరేకిస్తూ ముస్లిం సంస్థ జమాతే ఉలేమా-ఇ-హింద్ సుప్రీంలో పిటిషన్ వేసింది. ఈ రాష్ట్రాలు ఇచ్చిన ఉత్తర్వులపై కూడా సుప్రీం స్టే విధించింది.

కోఠ్రి అడవుల్లో కాల్పులు

(మొదటిపేజి తరువాయి)

వివరాల ప్రకారం.. కోఠ్రి అడవుల్లో మావోయిస్టుల ఉనికిపై పక్కా సమాచారంతో ఆపరేషన్ ప్రారంభించించారు. ఎన్‌కౌంటర్ స్థలం వైపు యాంటీ మావోయిస్టు స్పెషల్ స్క్వాడ్ కంపెనీ 60ని పోలీసు ఉన్నతాధికారులు పంపించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులకు భారీ నష్టం జరిగే అవకాశం ఉంది. వచ్చే నెలలో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ ఎన్‌కౌంటర్‌ను కీలకంగా పరిగణించాల్సి ఉంది.

డిజిటల్ వేదికలకు కళ్లెం !

(మొదటిపేజి తరువాయి)

హక్కు ప్రజలకు లేకుండా పోయింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల (నిరోధక) చట్టాన్ని, నిన్నటి ఐపీసీని ప్రయోగించి అసమ్మతిని నేరపూరితం చేస్తున్నారు. అసమ్మతివాదులను లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నారు.

'ఉపా'కు మరింత పదును

వాస్తవానికి ఈ రెండింటికీ మరింత పదును పెట్టి 2019లో ఉపాను మరింత విస్తృతం చేశారు. వ్యక్తులను ఉగ్రవాదులుగా ముద్ర వేసేందుకు ఈ చట్టం అనుమతిస్తోంది. వలస పాలకుల కాలం నాటి రాజద్రోహ చట్టంతో సహా క్రిమినల్ కోడ్ స్థానంలో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)ను తీసుకొచ్చారు. భారతీయ క్రిమినల్ చట్టం నుండి వలస పాలకుల మరకలను తొలగించేందుకు దీనిని ప్రవేశపెట్టామని చెబుతున్నప్పటికీ అప్పటి రాజద్రోహ నిబంధనలను తొలగించలేదు. పైగా దానిని మరింత విస్తరించారు. ఆధునీకరించారు. ఈ సంవత్సరం జూలైలో బీఎన్ఎస్ అమలులోకి వచ్చింది. ఆ తర్వాత నాలుగు రోజులకే ఐదుగురు పాత్రికేయులపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో అల్లరిమూక జరిపిన దాడికి సంబంధించి సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం ఆధారంగా చేసుకొని కేసులు పెట్టారు.

నిబంధనలు, బిల్లుల రూపంలో...

స్వీయ నియంత్రణ, తప్పుడు వార్తలు, ఆన్‌లైన్ వేదికలపై ప్రభావం పేరుతో ఆన్‌లైన్ ప్రసంగాలను అడ్డుకునేందుకు సర్కారు ప్రయత్నించింది. అందుకోసం ఐటీ చట్ట నిబంధనలు, డిజిటల్ ఇండియా బిల్లు, బ్రాడ్‌కాస్టింగ్ సర్వీసెస్ (నియంత్రణ) బిల్లు వంటి వాటిని ప్రయోగించింది. 2021, 2023 ఐటీ నింధనలకు వ్యతిరేకంగా న్యాయస్థానాలలో పిటిషన్లు దాఖలయ్యాయి. డిజిటల్ ఇండియా, బ్రాడ్‌కాస్టింగ్ బిల్లుల భవిష్యత్తు తెలియడం లేదు.

సమాచారంపై నియంత్రణ

దేశ భద్రత, సార్వభౌమత్వం పేరుతోనో లేదా దుష్ప్రచారం చేస్తున్నారన్న అభియోగంతోనో లేదా విద్వేష ప్రసంగం అనే ముద్రతోనో సమాచారంపై నియంత్రణ కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. తప్పుడు వార్తలు లేదా తప్పుదోవ పట్టించే సమాచారాన్ని తొలగించేందుకు 2023లో ఐటి నిబంధనలను రూపొందించారు. డిజిటల్ వేదికలలో కన్పించే సమాచారంపై నిఘా కోసం ప్రభుత్వం ఓ నిజనిర్ధారణ విభాగాన్ని (ఎఫ్‌సీయూ) ఏర్పాటు చేసింది. అయితే అది న్యాయస్థానంలో నిలవలేదు. 'భావ ప్రకటనా స్వేచ్ఛ, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఉండగా ఇక సత్యాన్ని వెల్లడించే హక్కు ఎందుకు?' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నించారు. టర్కీ, ఈజిప్ట్, పాకిస్తాన్ వంటి దేశాలలో కూడా ఆయా ప్రభుత్వాలు ఇలాంటి అమానుష చట్టాలు తీసుకొచ్చాయి.

ఏం జరుగుతుంది?

విభిన్న గొంతుకలను వినిపిస్తున్న డిజిటల్ వేదికలకు చట్టపరంగా లభిస్తున్న రక్షణను హరించాలని భారత ప్రభుత్వం చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఈ వేదికలకు లభిస్తున్న రక్షణ కవచాన్ని బలహీనపరచేందుకు 2021లో ఐటీ నిబంధనలు ప్రవేశపెట్టారు. వాటికి కొనసాగింపుగా డిజిటల్ ఇండియా బిల్లు తీసుకొచ్చారు. త్వరలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతాయి. అసమ్మతి గళాలను ప్రభుత్వం పట్టించుకుంటుందా లేక తన నిర్ణయంతో ముందుకు పోతుందా అనేది అప్పుడే తెలుస్తుంది.

ఇజ్రాయిల్‌కు అదానీ డ్రోన్‌ల సరఫరా ఆపాలి

(మొదటిపేజి తరువాయి)

అందుకే అదానీ డ్రోన్లను ఇజ్రాయిల్‌కు సరఫరా చేయడం నిలిపివేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు వివరించారు.

మోడీ ప్రభుత్వం డ్రోన్ల సరఫరాపై నిషేధం విధించి, పాలస్తీనాకు, మైనార్టీల హక్కులకు అండగా నిలబడాలని ఆయన డిమాండ్ చేశారు. అప్పటి వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మోడీ ప్రభుత్వం ఇజ్రాయిల్‌కు సహకరించడం మానుకోవాలనీ, పాలస్తీనాపై దాడులను ఖండించాలనీ, ఐక్యరాజ్యసమితిలో వెనుకబడిన దేశాలను కూడగట్టి ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడాలని కోరారు.

ఒకవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా నిలబడి పాలస్తీనాపై దాడులను ఖండిస్తుంటే, సీఎం రేవంత్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరించడం సరికాదని వీరయ్య ఈ సందర్భంగా హితవు పలికారు. నిరసన కార్యక్రమాల్లో కాంగ్రెస్ కలిసి రావాల్సిన తరుణంలో పోలీసులు శాంతియుత ధర్నాకు కూడా అనుమతి ఇవ్వలేదని చెప్పారు. కాంగ్రెస్ అధినేతగా రాహుల్ గాంధీ చెప్పే దాన్నే కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చేయాలని సూచించారు. ప్రపంచశాంతి కోసం ఉద్దేశించిన ధర్నాకు అనుమతి ఇవ్వరా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఒకలా, సీఎం రేవంత్ రెడ్డి మరొకలా చెప్పడం అవకాశవాదమే అవుతుందని విమర్శించారు. సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా అధికార కాంగ్రెస్ , ప్రతిపక్ష బీఆర్ఎస్‌తో సహా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు కలిసి రావాలని పిలుపునిచ్చారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జాన్‌వెస్లీ మాట్లాడుతూ ఇజ్రాయిల్ చేసిన దాడుల్లో 43 వేల మంది చనిపోగా, లక్షల మంది గాయాలపాలయ్యారనీ, 10 లక్షల మంది నిర్వాసితులయ్యారని తెలిపారు. పాఠశాలలు, ఆస్పత్రులు ధ్వంసమై ఆకలి చావులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమెరికాకు అనుకూలంగా వ్యవహరిస్తూ అదానీతో డ్రోన్‌లను సరఫరా చేయిస్తున్నదని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ఆయుధాలు సరఫరా చేసే విధానాన్ని సీపీఐ(ఎం) వ్యతిరేకిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచశాంతిని కోరే వారందరూ పాలస్తీనాకు మద్దతివ్వాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, ప్రతిపక్షపార్టీలు ఇజ్రాయిల్ యుద్ధ కాంక్షను వ్యతిరేకించాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య. జగదీష్, మధుసూదన్ రెడ్డి, కవిత, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మూసీపై పూటకోమాట

(మొదటిపేజి తరువాయి)



చేయబోతున్నామంటూ ప్రకటించారని తెలిపారు. ఇటీవల నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అదే రేవంత్... 'లక్షన్నర కోట్లు' అని ఎవరన్నారంటూ ఆవేశంతో ఊగిపోయారని విమర్శించారు. ఈ రకంగా పూటకో తీరుగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రిని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందని ఎద్దేవా చేశారు. డీపీఆర్ లేకుండానే రూ.లక్షన్నర కోట్లు ఖర్చవుతాయంటూ చెప్పటం కాంగ్రెస్ సర్కారుకే చెల్లుతుందని దుయ్యబట్టారు. మూసీ రిజువనేషన్ అండ్ రివర్ ఫ్రంట్ పేరిట ప్రజాధనం లూటీ చేయటానికే రేవంత్ సర్కార్ ఇలాంటి చర్యలకు పూనుకుంటోందని హరీశ్ ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కుట్రలను బట్టబయలు చేస్తామని ఆయన హెచ్చరించారు.

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు షురూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. జనరల్ ఇంగ్లీష్ పరీక్ష విజయవంతంగా ముగిసిందని తెలిపింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పరీక్షను నిర్వహించామని తెలిపారు. 31,383 మంది అభ్యర్థులకుగాను 22,744 (72.4 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం 20 మంది స్పోర్ట్స్ అభ్యర్థులకు అదనంగా మెయిన్స్ పరీక్షలు రాసేందుకు అవకాశం కల్పించామని తెలిపారు. 46 పరీక్షా కేంద్రాల నుంచి సేకరించిన హాజరును ప్రకటించామనీ, ఇందులో స్వల్ప తేడాలుండొచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. ఈ పరీక్షలను వాయిదా వేయాలనీ, 29 జీవోను రద్దు చేయాలని అభ్యర్థులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. 163 సెక్షన్‌ను అమలు చేశారు. రాష్ట్రంలో 2011 తర్వాత గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను జరుగుతుండడంతో అత్యంత పకడ్బందీగా నిర్వహించేందుకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు చేసింది. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,383 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు.

జోక్యం చేసుకోలేం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

గ్రూప్-1 పరీక్షలను వాయిదా వేయాలని లేదా రీ షెడ్యూల్ చేయాలని సుప్రీం కోర్టును ఆశ్రయించిన పలువురు అభ్యర్థులకు చుక్కెదురైంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ పిటిషన్ పై జోక్యం చేసుకోలేమని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. అలాగే ఈ కేసులో గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకూ నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలను పేర్కొందని సీజేఐ ధర్మాసనం పేర్కొంది. అయితే ఫలితాలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) నిర్వహిస్తోన్న గ్రూప్-1 సర్వీసెస్ నియామకాల పరీక్షలను వాయిదా/రీ షెడ్యూల్ చేయాలని పోగుల రాంబాబు గత శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్ర యించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 29తో తమకు అన్యాయం జరుగుతుం దని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని జస్టిస్ జేబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. తొలుత ధర్మాసనం స్పందిస్తూ 'ఇప్పటికే అభ్యర్థులు ఎగ్జామ్ సెంటర్‌లో ఉన్నప్పుడు స్టే ఎలా ఇస్తాం. ఇది గందరగోళానిక గురి చేస్తుంది' అని వ్యాఖ్యా నించింది. ఇందుకు పిటిషన్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ గతంలో సుప్రీంకోర్టు గత తీర్పుకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో 29 తీసుకువచ్చిందన్నారు. దాదాపు 14 ఏండ్ల తరువాత, 2014లో రాష్ట్రం విడిపోయిన తరువాత తొలిసారి గ్రూప్ 1 పరీక్ష జరుగుతోందని వివరించారు. జరుగుతున్నవి గ్రూప్ -1 పరీక్షలని, మరోసారి వీటిని భర్తీ చేయడం జరగదన్నారు. ఈ సారి అవకాశం కోల్పోతే, జీవితంలో తుది ఛాన్స్ ఉండద న్నారు. అందువల్ల జీవో 29 పై స్పష్టత వచ్చే వరకు పరీక్షలు నిర్వహించవద్దని కోరుతున్నట్టు కోర్టుకు నివేదించారు. మధ్యలో సీజేఐ జోక్యం చేసుకొని, అసలు పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏ విధంగా పరీక్షలు వాయిదా వేయమని ఆదేశించగలమని ప్రశ్నించారు.

ఇది అసాధారమైన విషయం అని గుర్తు చేశారు. ఇందుకు సిబల్ బదులిస్తూ వేలాది మంది అభ్యర్థుల బహిష్కరణకు సంబంధించిన అంశమని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సీ, ఎస్టీ వర్సెస్ బిపేంద్ర యాదవ్ కేసులోని తీర్పు వివరాలను ధర్మాసనం ముందుంచారు. అయినప్పటికీ, ఎలా పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఆపగలమని కోర్టు వ్యాఖ్యానించింది. అందువల్లే నష్టపోతున్న అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరుతున్నామని సిబల్ వాదించారు. చాలా మంది అభ్యర్థులు వివక్షకు గురవుతున్నారని చెప్పారు. మరోసారి సీజేఐ ధర్మాసనం స్పందిస్తూ... తమ తుది తీర్పునకు లోబడే నియామకాలు జరపాల్సి ఉంటుందని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో వెల్లడించిన విషయాన్ని గుర్తు చేసింది.

తుది విచారణ ముగించండి

గత నెల 31న ఈ కేసు రాష్ట్ర హైకోర్టు ముందు విచారణకు వచ్చిందని ప్రభుత్వ తరపు సీనియర్ అడ్వొకేట్ నిరంజన్ రెడ్డి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. టీజీపీఎస్సీ ఇప్పటికే ఈ కేసులో హైకోర్టు ముందు కౌంటర్ ఫైల్ చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం తమ వాదనలను కౌంటర్ రూపంలో అందజేయనుందని వివరించారు. గత విచారణ సందర్భంగా ఈ పరీక్షలు పూర్తి చేసేందుకు ఎంత సమయం పడుతోందని పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను హైకోర్టు ప్రశ్నిం చిందని తెలిపారు. పరీక్షా ఫలితాలు ప్రకటించేందుకు మూడు నెలల సమయం కావాలని సర్వీస్ కమిషన్ సమాధానం ఇచ్చిందన్నారు. మధ్యలో సిబల్ జోక్యం చేసుకొని, ఫలితాలకు మూడు నెలల సమయం ఉన్నందున ఈ కేసును సోమవారం నాడే విచారించాలని కోరారు. అందుకు సీజేఐ ధర్మాసనం నిరాకరించింది. ఈ కేసులో ఇచ్చే ఈ మధ్యంతర తీర్పు అయినా పరీక్ష ప్రక్రియలో గణనీయమైన ప్రభావం చూపుతుందని కోర్టు అభిప్రాయపడింది. అందువల్ల మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్టు సీజేఐ స్పష్టం చేశారు. తమ తుది తీర్పునకు లోబడే, నియామకాలు జరపాల్సి ఉంటుందని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొందని గుర్తు చేశారు. అయితే నవంబర్ 20న జరిగే తదుపరి విచారణకు రానుంద న్నారు. అందువల్ల ఫలితాల విడుదలకు ముందే ఈ కేసులో తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించినట్లు వెల్లడించారు. అలాగే పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్టు స్పష్టం చేశారు.





బీజేపీవి మహిళా వ్యతిరేక త్రిశూల్ విధానాలు

(మొదటిపేజీ తరువాయి)

సంపదను శాసిస్తున్నారని ఆమె ఈ సందర్భంగా తెలిపారు. దీంతో అసమానతలు తీవ్రస్థాయిలో పెరుగుతున్నాయని చెప్పారు. దీనికి బీజేపీ అనుసరిస్తున్న విధానాలే కారణమని దుయ్యబట్టారు. నేటి పురుషాధిక్య సమాజంలో ఆ పార్టీ మహిళలను తిరోగమన భావజాలం వైపు నడిపిస్తోందని విమర్శించారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్... సంపన్నులకు రూ.40 లక్షల కోట్ల మేర రాయితీలిచ్చిందిగానీ, దేశంలోని వితంతువులు, ఒంటరి మహిళలు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల శ్రమ ద్వారా దేశం అభివృద్ధి చెందుతుంది, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అన్నారు. కానీ అదే మహిళలు స్వేచ్ఛకు, సమానత్వానికి దూరమవుతున్నారని వాపోయారు. ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిలో 49 శాతం వాటాలను ప్రయివేటీకరించటానికి కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోందని బృందా ఈ సందర్భంగా హెచ్చరించారు. ఫలితంగా వేలాదిమంది కార్మికులు జీవనోపాధి కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి ఉపరితల గనుల కోసం గిరిజనులు, దళితుల నుంచి పెద్ద ఎత్తున భూ సేకరణ చేస్తున్నారనీ, కానీ వారికి చట్ట ప్రకారం ఇవ్వాల్సిన పరిహారం ఇవ్వటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణుగూరు ప్రాంతంలోని గిరిజనుల నుంచి సింగరేణి మూడుసార్లు భూములు గుంజుకుని వారిని నిర్వాసితులను చేసిందని గుర్తు చేశారు. అంటే దళితులు, ఆదివాసీలు, మహిళలు ఈ దేశ పౌరులు కాదా? అని ఆమె ఈ సందర్భంగా కేంద్రాన్ని ప్రశ్నించారు. వారి సంపదను బలవంతంగా లాక్కుని కార్పొరేట్లకు కట్టబెట్టటమే మోడీ సర్కారు లక్ష్యమా? అని నిలదీశారు.

బీజేపీ సర్కార్ మహిళలకు, వారి హక్కులకు వ్యతిరేకంగా పని చేస్తోందని బృందా విమర్శిం చారు. ఉపాధి హామీ పనులకు వెళుతున్న వారిలో 95 శాతం మంది మహిళలే ఉన్నారని వివరించారు. వారు రోజుకు మూడు వేల కిలోల మట్టిని మోస్తే... ఇచ్చే కూలి రూ.250 మాత్రమేనని వాపోయారు. ఇది పచ్చి శ్రమ దోపిడీ అని వ్యాఖ్యానించారు. ఆన్‌లైన్‌లో మస్టర్‌కు సంబంధించి వేలి ముద్రలు పడకపోతే... ఆ పేరిట వేతనాలను చెల్లించకుండా ఆపేస్తున్నారని చెప్పారు. మోడీ చెబుతున్న డిజిటల్ ఇండియా ఇదేనా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణలో మహిళలు ఇండ్ల స్థలాల కోసం పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వారిని మోసం చేస్తే, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం... హామీ ఇచ్చి నేటికీ అమలు చేయటం లేదని విమర్శించారు. ఇండ్లు లేని వారందరికీ పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. బీజేపీ పదేండ్ల ఏలుబడిలో ఇప్పటి వరకూ 65 వేల మంది మహిళలు వరకట్న హత్యలకు గురయ్యారని బృందా ఆవేదన వ్యక్తం చేశారు. వీరిలో అత్యధిక మంది హిందూ మహిళలేనని వివరించారు. వీరిని హత్య చేసింది కూడా హిందువులేనని పేర్కొన్నారు. హిందూ మతం కోసమే ఉన్నామని చెప్పుకునే ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులకు వరకట్న సమస్యపై పోరాడే దమ్ము లేదా అని ప్రశ్నించారు. అలాంటి హత్యలకు గురవుతున్న వారు హిందువులు కాదా ? భారతీయులు కాదా ? అని ఆమె నిలదీశారు. మహిళలపై వరకట్న హత్యలు, అత్యాచారాలు, వేధింపులకు



సంబంధించి ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ఎందుకు నోరు మెదపటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా వారు బోధించే దేశభక్తి అని చురకలంటించారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలను బీజేపీ మతకోణంలో చూస్తోందని అన్నారు. కేవలం ఒక మతానికి చెందిన వారే మహిళల మీద హింసకు పాల్పడుతున్నారంటూ మైనారిటీలపై దాడులకు ఉసిగొల్పు తోందని చెప్పారు. మనదేశంలో ప్రతీ గంటకు 50 మంది మహిళలపై ఏదో ఒక రూపంలో హింస కొనసాగుతోందనీ, రోజూ 88 మంది మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటినీ బీజేపీ మత భావంతోనే చూస్తోందని విమర్శించారు. ఆ పార్టీ పాలనలో మహిళలపై నేరాలు 28 శాతం పెరిగాయని వివరించారు. దీన్నిబట్టి బీజేపీ హయాంలో మహిళలకు కనీస రక్షణ లేకుండా పోయిందనే విషయం విదితమవుతున్నదని బృందా విశ్లేషించారు. దేశంలో ధరల పెరుగుదల అనేది ప్రజల ఆహార భద్రత సమస్యగా మారిందని హెచ్చరించారు. దీనిపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. మహిళల స్వేచ్ఛ, సమానత్వం కోసం ఐద్వా నిరంతర పోరాటాలు నిర్వహిస్తోందనీ, వీటిని మరింత ఉధృతం చేయాల్సిన అవసరముందని ఆమె నొక్కి చెప్పారు. మోటూరి ఉదయం, లీలా సుందరయ్య, మల్లు స్వరాజ్యం, చిట్యాల ఐలమ్మ, మానికొండ సూర్యావతి లాంటి త్యాగధనుల పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని నేటి ఐద్వా నాయకులు, కార్యకర్తలు... బీజేపీ అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై తిరుగుబాటు బావుటా ఎగరేయాలని బృందాకారత్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.అరుణజ్యోతి అధ్యక్షత వహించిన ఈ సభలో ఆ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందరరామన్, జాతీయ నాయకులు ఎస్.పుణ్యవతి, డి.రమాదేవి, టి.జ్యోతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, మాజీ ఎంపీ మిడియం బాబూరావు పాల్గొన్నారు.

మహిళలు ఈ దేశ పౌరులు కాదా?

కొత్తగూడెం నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి

దేశంలో ఉన్న మహిళలు ఇక్కడి పౌరులు కాదా? అని ఐద్వా జాతీయ అధ్యక్షులు మరియం ధావలే ప్రశ్నించారు. ఐద్వా రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా సోమవారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయనీ, వాటిని తట్టుకోవటం సామాన్యులకు సాధ్యం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి అవకాశాలు దెబ్బతిన్న తర్వాత చేతిలో డబ్బు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. గ్రామీణ ఉపాధి, ఇతర ఉపాధి అవకాశాలను కేంద్రం నిర్వీర్యం చేస్తున్నదని చెప్పారు. పేదలు అర్ధాకలితో, ఒక్క పూట మాత్రమే తింటున్న దృశ్యాలు ఈ సర్కారుకు కనపడక పోవటం విడ్డూరమని ఆమె విమర్శించారు. దేశంలో జరుగుతున్న అనేక పోరాటాల్లో మహిళల పాత్ర మరువలేనిదని చెప్పారు. వారు తమ హక్కుల కోసం ఉద్యమించాలనీ, అడ్డుగోడలను బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారు. ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి వీకే శ్రీమతి మాట్లాడుతూ... మోడీ పదేండ్ల పాలనలో మహిళల అభివృద్ధిని మరింత వెనక్కు నెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మనిషి బతకటానికి కూడు, గూడు, గుడ్డ కనీస అవసరమని చెప్పారు. పేదల మౌలిక అవసరాలు తీర్చలేని సర్కార్ ఎవరి కోసం పని చేస్తున్నదని ప్రశ్నించారు. తినటానికి తిండి లేక, సరైన పౌష్టికాహారం లేక మహిళలు రోగాలు, నొప్పులు, రక్తహీనత తో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఆహార ధాన్యాలను సరఫరా చేయటంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆహార భద్రతా చట్టాన్ని అది నిర్వీర్యం చేస్తోందని వాపోయారు. పేదలకు రావాల్సిన కనీస అవసరాలను తీర్చలేని మోడీ ప్రభుత్వం మహిళలు, దళితులు, ఇతర తరగతులపై హింసను ప్రేరేపిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలు లౌకికత్వం, సర్వమానవ సమానత్వ ఆకాంక్షతో ఎన్నో ఏండ్లుగా కలిసి బతుకుతున్నారని గుర్తుచేశారు. కానీ ఆ వాతావరణాన్ని బీజేపీ కలుషితం చేస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. తిరోగమన పాలకుల విధానాలను ఎండగడుతూనే మెరుగైన సమాజాన్ని నిర్మించుకుందామని ఆమె ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఓసీల్లో కంపెనీలన్నీ గుజరాత్‌వే

కొండాపురం నిర్వాసితులకు తీవ్ర అన్యాయం

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్ మణుగూరు ఓసీల్లో పర్యటన

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ఉపరితల గనుల్లో (ఓసీ) ప్రయివేట్ కంపెనీలన్నీ గుజరాత్‌కు చెందినవేనని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ బృందాకరత్ అన్నారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని ఓసీల్లో ఆమె పర్యటించారు. ఓసీ-2 పని ప్రదేశాలను పరిశీలిం చారు. స్థానిక సింగరేణి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దుర్గ, మహాలక్ష్మి, వీబీఆర్, ఎంఐపీఎల్ కంపెనీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సింగరేణి ఓపెన్ కాస్టుల్లో 50 శాతం ప్రయివేటు, 50 శాతం సింగరేణి బొగ్గును వెలికి తీస్తున్నాయని అన్నారు. ఉపరితల గనుల వల్ల వేలాది ఎకరాల ప్రభుత్వ, అటవీ శాఖ భూములు ధ్వంసం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణిలో స్థానిక భూ నిర్వాసితులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. భూములు కోల్పోయిన వారికి సింగరేణిలో ఉద్యోగాలు రాక వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయకపోవడం వల్ల ఈ ప్రాంత గిరిజనులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గిరిజన చట్టాలు, 5వ షెడ్యూల్ కూడా అమలు చేయలేదని, గిరిజనులకు సింగరేణి సరైన నష్టపరిహార ప్యాకేజీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మణుగూరులోని అన్ని ఓసీల్లో గుజరాత్‌కు చెందిన కంపెనీలు మాత్రమే పనిచేస్తున్నాయని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 80 శాతం మంది కార్మికులు ఆయా కంపెనీల్లో పని చేస్తున్నారని, వారికి సరైన సౌకర్యాలు లేవని, ఎక్కువ గంటలు పని చేస్తున్నారని, దాని కారణంగా ఒత్తిడికి గురై తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూముల్లో సరైన వెలుతురు, గాలిరాకుండా బంధించి ఉంచుతున్నారని అన్నారు. వెంటనే కార్మిక చట్టాల ను అమలు చేయాలని, స్థానికులకు 80 శాతం ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్త కొండాపురం భూ నిర్వాసిత గ్రామాన్ని పరిశీలించారు. 25 ఏండ్ల క్రితం మొదటిసారి ఎకరానికి రూ.3,500, ఐదు సెంట్ల ఇంటి స్థలం, రెండెకరాల భూమి ఇచ్చారని బాధితులు ఆమెకు తెలిపారు. మణుగూరు ఓసీ కారణంగా రెండోసారి చాలామంది భూములు కోల్పోయారని, సరైన ప్యాకేజీ అందలేదని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు పోడు భూములను గుంజుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ(ఎం) భూ నిర్వాసితులకు అండగా ఉంటుందని బృందాకరత్ భరోసా ఇచ్చారు. ఈ పర్యటనలో ఆమె వెంట ఐద్వా ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి రమాదేవి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, టీవీఎమ్‌వీ ప్రసాద్, డి.లెనిన్ బాబు, విల్సన్ తదితరులు ఉన్నారు.




నేడు, రేపు మహాసభలు

ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలు కొత్తగూడెం క్లబ్‌లో మంగళ, బుధవారాల్లో నిర్వహించేం దుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సభలకు రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 600 మందికిపైగా ప్రతినిధులు హాజరవుతున్నారు. రెండు రోజుల పాటు ఉండేందుకు వారికి తగిన సౌకర్యాలను కల్పించారు. ఈ సభల్లో అనేక కర్తవ్యాలు, తీర్మానాలతో పాటు రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకుంటారు. మహిళలపై హింస, లైంగికదాడులు, వేధింపుల నిరోధానికి కఠిన చర్యలు తీసుకోవాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, మద్యపాన నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయ హస్తం డబ్బులు తిరిగి ఇవ్వాలని, మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించాలని, వివిధ ప్రభుత్వ శాఖల్లో, పరిశ్రమల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలన్నింటినీ శాశ్వత ప్రాతిపదికన భర్తీ చేయాలని ఈ మహాసభల్లో ప్రతినిధులు చర్చించి, తీర్మానిస్తారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ బహిరంగ సభలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుధా సుందరరామన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. జ్యోతి, కేఎన్ ఆశాలత, రాష్ట్ర సహాయ కార్యదర్శి మందలపు జ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు డి. సీతాలక్ష్మి, ఆఫీస్ బేరర్స్ మాచర్ల భారతి, అనురాధ, మహేశ్వరి, గీత, రత్నమాల, లక్ష్మమ్మ శశికళ, వినోద, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పిడికిలెత్తిన నారీలోకం

కొత్తగూడెంలో వేలాది మంది మహిళలతో భారీ ర్యాలీ

- కిక్కిరిసిన బహిరంగ సభా ప్రాంగణం
- ఆలోచింపజేసిన నేతల ప్రసంగాలు

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/ కొత్తగూడెం

కొత్తగూడెం పట్టణం మహిళలతో పోటెత్తింది. ఎటు చూసినా ఎరుపు అంచుల తెల్ల చీరలు ధరించిన మహిళలే కనిపించారు. సోమవారం నుంచి అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర మహాసభలను పురస్కరించుకొని వీధులు నారీమణులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే రాష్ట్ర నలుమూలల నుంచి మహిళలు తరలిరాగా.. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి భారీ సంఖ్యలో బహిరంగ సభకు హాజరయ్యారు.

ర్యాలీ ఆద్యంతం కదం తొక్కారు. మహిళా హక్కులు, చట్టాల పరిరక్షణ, భద్రత కోసం గొంతెత్తి నినదించారు. కొత్తగూడెం పాత డిపో సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ఐద్వా నాయకులు ముందు వరుసలో ఫ్లెక్సీ పట్టుకొని.. నినాదాలు ఇస్తూ నడుస్తుండగా మిగిలిన మహిళలు వారిని అనుసరించారు. పాత డిపో నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన గణేష్ టెంపుల్, సూపర్ బజార్ మీదుగా బహిరంగ సభా ప్రాంగణం కూలీ లైన్ సూర్యా ప్యాలెస్ వరకు సాగింది. డప్పు, కొమ్ము, కోలాట నృత్యాలతో గిరిజన మహిళలు ప్రదర్శనకు కొత్త వన్నె తీసుకొచ్చారు. ఐద్వా మహాసభలు విజయవంతం చేయాలని నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం జరిగిన బహిరంగసభలో.. మహిళలు పోరాడి సాధించుకున్న హక్కులు, చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలా నిర్వీర్యం చేస్తుందో ఐద్వా జాతీయ, రాష్ట్ర నేతలు చేసిన ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.

కొమ్ము బూరలు కోలాట నృత్యాలతో ఆకట్టుకున్న ప్రదర్శన

ఉచిత బస్సు సౌకర్యం కల్పించి.. సంఖ్య తగ్గించారు : ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ

మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిన ప్రభుత్వం బస్సుల సంఖ్య తగ్గించడాన్ని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ ఖండించారు. ఉచిత బస్సుల్లో వెళ్తున్న మహిళలపై చులకన భావన తగదన్నారు. బీజేపీ భావాజాలం వల్ల హింస పెరుగుతోందని అన్నారు. ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ వనరుగా చూడకుండా కేరళ, తమిళనాడు తరహాలో నియంత్రించాలని కోరారు. జనాభా ప్రాతిపదికన ఆస్పత్రులు, పాఠశాలలు ఏర్పాటు చేయాలి కానీ మద్యం దుకాణాలు నెలకొల్పడాన్ని ఖండించారు. దుర్గమ్మ, జయమ్మ, హైమావతి స్ఫూర్తితో మహిళా ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.



మహిళలు తలుచుకుంటే ప్రభుత్వాలే కూలాయి

ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి

మహిళలు తలుచుకుంటే ప్రభుత్వాలే కూలాయని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి తెలిపారు. మద్యపాన వ్యతిరేక పోరాటాన్ని నిర్వహించి నాటి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దెదించిన చరిత్ర మహిళలకు ఉందని గుర్తు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మహిళా నాయకులకు కొదవ లేదని అన్నారు. ఊరు ఊరునా.. వాడవాడనా వారందరినీ ఐద్వా కమిటీల్లో చేర్చాలని పిలుపు నిచ్చారు. బలవన్మరణాలకు కారణం అవుతున్న లోన్ యాప్‌లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఆపాలని కోరారు. 'బయట జనాలు గుర్తిస్తేనే ఇంట్లో మొగుడు గుర్తిస్తాడు.. రండి పోరాడుదాం' అన్న మల్లు స్వరాజ్యం మాటల స్ఫూర్తితో మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.




అధికారపీఠంపై ఛాందసవాదులు : మాజీ ఎంపీ మిడియం బాబూరావు

ఆధిపత్య భావజాలం ఉన్నవారు అధికారంలో ఉండటంతో మహిళలపై చిన్న చూపు కొనసాగుతోందని మాజీ ఎంపీ మిడియం బాబూరావు ఆరోపించారు. ఛాందసవాదులు రాజ్యాన్ని ఏలుతున్నారని అన్నారు. మహిళలపైనే కాదు, సాంస్కృతికంగానూ దాడులు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సనాతన వాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రతి 1000 మందికి గాను 1008 మంది స్త్రీలు ఉన్నారని, ఆదివాసీల్లో 1000 మందికి 1017 మంది మహిళలు ఉన్నారని వివరించారు. పురుషుల కన్నా మహిళలు ఎక్కువగా ఉన్నా మహిళలను ద్వితీయశ్రేణిగా చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సందర్భంలో భద్రాద్రి జిల్లా మహిళా నాయకురాలు చూపించిన తెగువను అభినందించారు. కుటుంబ సభ్యులు, బంధువులు సైతం ముట్టని శవాలకు అంత్యక్రియలు చేసిన విషయాన్ని ప్రస్తావించారు.



బీజేపీ పాలనలో మహిళల భద్రతకు ముప్పు : ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

బీజేపీ పాలనలో మహిళల భద్రత ప్రమాదంలో పడిందని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. మహిళలతో పాటు ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం కోసం మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రా పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా నిరుపేదల ఇండ్లు కూల్చడాన్ని ఖండించారు. సమాన పనికి సమాన వేతనం, 498ఏ వంటి చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూనుకుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి రాష్ట్రం ఇచ్చే రూ.5 లక్షలతో పాటు హామీ ప్రకారం కేంద్రం సైతం రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగమైన రూ.500కు గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు పథకాల అమలు సక్రమంగా కొనసాగడం లేదని తెలిపారు. బీఆర్ ఎస్ తరహా పాలనను కాంగ్రెస్ కొనసాగిస్తే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మహిళలు సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886